తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

సోమవారం 18.08.2025 | సంపుటి : 12 సంచిక : 30 | పేజీలు : 12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370


ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI TV

తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

# 2 దశాబ్దాల తర్వాత ఓయూకు సీఎం





## 21న ఉస్మానియా వర్సిటీకి రానున్న తెలంగాణ తొలి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- తొలిసారిగా సీఎం రానుండడంతో సిబ్బంది, విద్యార్థుల్లో నూతనోత్సాహం
- సర్కారు, యూనివర్సిటీ మధ్య సహకారం మరింత బలోపేతం
- మౌలిక వసతులకు మైలురాయిగా నిలుస్తుందని ఆశాభావం
- యూనివర్సిటీ హాస్టల్ ప్రారంభోత్సవం, కొత్త నిర్మాణాలకు శంకుస్థాపన
- సీఎం రాకకు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్న యూవర్సిటీ యాజమాన్యం

తెలంగాణలో ఉద్యమాలకు ఊపిరి పోసిన ఉస్మానియా యూనివర్సిటీకి తొలిసారిగా ఓ ముఖ్యమంత్రి వెళ్లనున్నారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత మొట్టమొదటిసారిగా సీఎం రానుండటం సర్వత్రా ఆసక్తి రేకెత్తిస్తుండగా.. ఉస్మానియా యూనివర్సిటీలో విద్యా నాణ్యత, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఇదొక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుందని అధికారుల్లో ఆశాభావం వ్యక్తమవుతోంది. రెండు దశాబ్దాల తర్వాత సీఎం రేవంత్ రెడ్డి హాజరుకానుండటంతో రాష్ట్ర ప్రభుత్వం, యూనివర్సిటీ మధ్య సహకారం మరింత బలపడుతుందని భావిస్తున్నారు. అయితే రాష్ట్ర ముఖ్యమంత్రి హోదాలో ఓయూకు వచ్చి ప్రసంగించనున్న రేవంత్ రెడ్డి చారిత్రాత్మక సందర్భానికి వేదిక కానుండటం విశేషం.



సీఎం రేవంత్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసిన ఉస్మానియా యూనివర్సిటీకి ఆహ్వానిస్తున్న వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి కాశీం. చిత్రంలో మంత్రులు పొన్నం, అడ్లూరి తదితరులు

హైదరాబాద్, ఆగస్టు 17 (జనంసాక్షి) : ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి కాశీం ఆదివారం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. 21న ఓయూలో జరిగే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రావాలని ఆహ్వానం పలికారు. ఓయూలో రూ.80 కోట్ల వ్యయంతో నిర్మాణమై 1200 మంది విద్యార్థులకు వసతి కల్పించే రెండు హాస్టల్స్‌ను ప్రారంభించి, గిరిజన సంక్షేమంశాఖ ఆర్థిక సహాయంతో మరో 300 మంది విద్యార్థులకు వసతి కల్పించే రెండు కొత్త హాస్టల్స్ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం సీఎం చేతులమీదుగా జరుగనున్నది. ఇప్పటికే ఓయూలో ఉన్న 25 హాస్టళ్లలో 7223 మంది విద్యార్థులకు వసతి ఉండగా సీఎం చేతుల మీదుగా ప్రారంభించే హాస్టల్స్ అదనపు వసతిని సమకూర్చనున్నాయి. ఇదే కార్యక్రమంలో దాదాపు 10 కోట్ల నిధులతో డిజిటల్ లైబ్రరీ రీడింగ్ రూం పనులకు కూడా ప్రారంభించనున్నారు. మిగతా 2లో..

రాజ్యాంగ వ్యవస్థల్ని ధ్వంసం చేసేందుకు

# భాజపా కుట్ర

- బిహార్‌లో ఓట్ల చోరీ కానివ్వం
- ఎస్ఐఆర్ అసలు రంగును బయటపెడతాం
- ఓటర్ అధికార్ యాత్ర ప్రారంభోత్సవంలో రాహుల్



న్యూఢిల్లీ(జనంసాక్షి): ఎన్నికల సంఘాన్ని లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తన ఆరోపణలను తీవ్రతరం చేశారు. ఓట్ల విషయంలో భాజపాతో కలిసి ఈసీ అవకతవకలకు పాల్పడుతున్నట్లు ఇప్పుడు యావత్ దేశానికి తెలిసిందన్నారు. బిహార్‌లోని సాసారం మిగతా 2లో..

రాహుల్.. అఫిడవిట్

# సమర్పించండి

పార్టీలపై ఈసీ ఎలాంటి వివక్ష చూపదు

మీడియా సమావేశంలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్



న్యూఢిల్లీ(జనంసాక్షి): ఎన్నికల సంఘానికి ఎలాంటి భేదభావాలు ఉండవని, అన్ని పార్టీలను సమానంగా చూస్తామని కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ పేర్కొన్నారు. ఓటు చోరీ పేరుతో కొందరు అనవసర అనుమానాలు లేవనెత్తుతున్నారని ఆక్షేపించారు. బిహార్‌లో ఓటరు జాబితా సమగ్ర సవరణపై ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్న నేపథ్యంలో మీడియా సమావేశం నిర్వహించిన సీఈసీ.. రాజ్యాంగ సంస్థలను మిగతా 2లో..

# రష్యా విషయంలో కీలక పురోగతి సాధించాం

మరిన్ని వివరాలు త్వరలోనే వెల్లడిస్తా : ట్రంప్

ట్రంప్, పుతిన్, జెలెన్‌స్కీ త్రైపాక్షిక సమావేశం ఆగస్టు 22న!

సమావేశానికి యూరోపియన్ దేశాల నాయకులకూ ఆహ్వానం



వాషింగ్టన్(జనంసాక్షి): రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో భేటీ అయిన మరుసటి రోజు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. రష్యా విషయంలో కీలక పురోగతి సాధించామని, మరిన్ని వివరాలు త్వరలోనే వెల్లడిస్తానని చెప్పారు. ఇందుకు సంబంధించి తన సొంత సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో పోస్టు పెట్టారు. ఉక్రెయిన్ యుద్ధం ముగింపునకు సంబంధించి ఎటువంటి ఒప్పందం కుదరకుండానే అలాస్కా సమావేశం మిగతా 2లో..

జీఎస్టీ ప్రక్షాళనతో

# ప్రజలకు లబ్ధి

- ముసాయిదాను రాష్ట్రాలకు పంపించాం
- వాటి అమలుకు సహకరించండి
- రాష్ట్రాలకు మోదీ విజ్ఞప్తి

2లో..

# ఎన్డీఏ ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్

- ప్రకటించిన భాజపా
- జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా

9లో..

# జమ్మూకశ్మీర్‌ను మళ్లీ ముంచిన క్లౌడ్‌బరస్ట్



కథువా జిల్లా ఘాటీలో మెరుపువరదలు.. ఏడుగురి మృతి

శ్రీనగర్(జనంసాక్షి): జమ్మూకశ్మీర్‌లోని కిశ్త్వాడ్ జిల్లాలో ఇటీవల సంభవించిన క్లౌడ్ బరస్ట్.. పెను విషాదాన్ని మిగిల్చిన సంగతి తెలిసిందే. ఈ ఉపద్రవాన్ని మరువక ముందే కథువా జిల్లాలోని ఘాటీ గ్రామంలో మేఘ విస్ఫోటం సంభవించింది. ఈ విపత్తులో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. మరికొందరు గాయపడ్డారని అధికారులు తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో ఈ విస్ఫోటం సంభవించిందని స్థానిక పోలీసు అధికారి మిగతా 2లో..

ELV BHASKAR FOUNDATION HOPE BEGINS HERE
HAPPY BIRTHDAY 41ST 18TH AUGUST
ELV GROUP

41వ జన్మదిన శుభాకాంక్షలు

సాధారణమైన వాటిని అసాధారణమైనవిగా మార్చగల మీ సామర్థ్యం, ప్రతి సవాలును పరిష్కరించడంలో మీ శైలి మాకు స్ఫూర్తిదాయకం, వేల మందికి పైగా మాలాంటి ఎంతో మందికి ఉద్యోగాలు కల్పించిన మీ భవిష్యత్తు మరింత శోభాయమానంగా, ఉన్నతంగా, మీరు మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించి, సమున్నతంగా, సంపూర్ణ ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్ళ సంతోషంగా వుండాలని ఆశిస్తూ మా ప్రియతమ ఇఎల్ వి గ్రూప్ ఫౌండర్ చైర్మన్ గారికి ఇవే మా శుభాకాంక్షలు



డా|| భాస్కర్. ఇ
సంస్థాపకులు మరియు చైర్మన్, ఇఎల్‌వి గ్రూప్

శుభాకాంక్షలతో... బోర్డు డైరెక్టర్లు మరియు ఇఎల్‌వి గ్రూప్ సిబ్బంది

ELV PROJECTS | THEPRODIGIES INTERNATIONAL SCHOOL | WARNICK STUDIOS | ELV HEALTH CARE | AARNA REAL ESTATE DUBAI | CHEMTEX | MERCADOS | Blue Metals Quarry & Crusher | Brunex Pharmaceuticals | TORCHBEARER | URBAN | Earth Essence | ELEVON ELEVATORS PVT. LTD | VMAP | skygolf

# రెండు దశాబ్దాల తర్వాత ఓయూకు సీఎం

అదే రోజు ఓయూలో ఉన్న టాగూర్ ఆడిటోరియంలో వెయ్యి మంది ప్రొఫెసర్లను, విద్యార్థులను ఉద్దేశించి "తెలంగాణ విద్యా రంగంలో రావాల్సిన మార్పులు ప్రభుత్వ ప్రణాళిక" అనే విషయం మీద సీఎం ప్రసంగించనున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొంటారు. ఇరవై ఏళ్ల కాలంలో ఓయూలోకి ముఖ్యమంత్రి హోదాలో వచ్చి ప్రసంగించనున్న తొలి సీఎం రేవంత్ రెడ్డి అని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో "సీఎం రీసెర్చ్ ఫెలో షిప్"తో పాటు విదేశీ పర్యటనకు వెళ్లే విద్యార్థులకు ఆర్థిక సహాయాన్ని అందించే పథకాన్ని సీఎం చేతుల మీదుగా ప్రారంభించనున్నామని వీసీ తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ఈ కార్యక్రమానికి హాజరై, హాస్టల్స్ ప్రారంభోత్సవం, శంకుస్థాపన కార్యక్రమాలను జరిపించడం ద్వారా విద్యార్థులకు స్ఫూర్తినిచ్చే విధంగా ఉంటుందని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కొత్త హాస్టల్స్ గిరిజన విద్యార్థులకు మరింత మెరుగైన వసతి సౌకర్యాలను అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని భావిస్తున్నారు. ఈ కార్యక్రమం ఉస్మానియా యూనివర్సిటీకి మరింత గుర్తింపును తెచ్చిపెడుతుందని హర్షం వ్యక్తం చేశారు.

## సీఎం చెప్పిన ఊహాజనిత ఫ్యూచర్ సిటీకి భవిష్యత్తు లేదు: కేటీఆర్

**హైదరాబాద్(జనంసాక్షి):** సీఎం రేవంత్‌రెడ్డి చెప్పిన ఊహాజనిత ఫ్యూచర్ సిటీకి భవిష్యత్తు లేదని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ వ్యాఖ్యానించారు. హైదరాబాద్ ఫార్మాసిటీ భూములలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలన్న రేవంత్‌రెడ్డి ఆకాంక్ష నెరవేరదన్నారు. తెలంగాణ ఫార్మాసిటీ భూముల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై కేటీఆర్ మండిపడ్డారు.కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫార్మా సిటీ ప్రాజెక్టును రద్దు చేసి, దాని స్థానంలో ఫ్యూచర్ సిటీ అనే అవాస్తవ ప్రాజెక్టును ప్రవేశపెట్టారని కేటీఆర్ దుయ్యబట్టారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం, ఒక నిర్దిష్ట ప్రజా ప్రయోజనం కోసం సేకరించిన భూమిని ఇతరుల ప్రయోజనం కోసం రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులకు మళ్లించడం సాధ్యం కాదని కేటీఆర్ స్పష్టం చేశారు. గత ప్రభుత్వం హయాంలో 56 గ్రామాల పరిధిలో హైదరాబాద్ ఫార్మాసిటీ కోసం 20వేల ఎకరాలతో ప్రతిపాదనలను తయారుచేశామన్నారు. స్థానిక రైతులు రాష్ట్ర ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి వచ్చి తమ భూములను ఫార్మాసిటీ కోసం ఇచ్చారని కేటీఆర్ తెలిపారు. రైతన్నలు ఫార్మా కంపెనీల కోసం కేటాయించిన భూముల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందన్నారు. ఈ మొత్తం వ్యవహారంపై ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రజలకు, రైతులకు స్పష్టత ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఇది నిర్లక్ష్య నాయకుడు రాష్ట్రాన్ని పాలిస్తే ఏమవుతుందో దానికి ఫ్యూచర్ సిటీ ప్రచారం ఒక ఉదాహరణ అని పేర్కొన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం.. ఒక నిర్దిష్ట ప్రజా ప్రయోజనం కోసం సేకరించిన భూమిని ఇతరుల ప్రయోజనం కోసం రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులకు మళ్లించడం సాధ్యం కాదని కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ చట్టాన్ని ఉటంకిస్తూ తాను రెండేళ్ల క్రితమే అసెంబ్లీలో ఈ విషయంపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించానని గుర్తుచేశారు. అయినా, రేవంత్ ప్రభుత్వం వందల కోట్ల రూపాయలు పీఆర్ కోసం ఖర్చు చేసి, ఇప్పుడు తీవ్రమైన న్యాయపరమైన అడ్డంకులను ఎదుర్కొంటోందని, చివరికి అధికారులు కూడా దీన్ని అంగీకరిస్తున్నారని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో 56 గ్రామాల పరిధిలో హైదరాబాద్ ఫార్మాసిటీ కోసం 20వేల ఎకరాలతో ప్రతిపాదనలను తయారు చేసిందని.. స్థానిక రైతులు రాష్ట్ర ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి వచ్చి తమ భూములను హైదరాబాద్ ఫార్మాసిటీ కోసం ఇచ్చారని కేటీఆర్ గుర్తు చేశారు. కొంతమంది తమ భూములు ఇవ్వడంపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తే కాంగ్రెస్ మాత్రం అధికారంలోకి రాగానే హైదరాబాద్ ఫార్మాసిటీ కోసం సేకరించిన ప్రతి ఎకరాన్ని తిరిగి రైతన్నలకు ఇస్తామని హామీలు ఇచ్చి, ఇప్పుడు రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులు స్నేహితుల కోసం అవే భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ వారిని నిండా మోసం చేసిందని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతన్నలు ఫార్మా కంపెనీల కోసం కేటాయించిన భూముల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని కేటీఆర్ పేర్కొన్నారు. ఫార్మా సిటీ ప్రాజెక్టు కోసం గత ప్రభుత్వం కోట్లాది రూపాయల ప్రజాధనంతో మౌలిక వసతుల కల్పనను ప్రారంభించినా.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం దానిని పక్కనపెట్టి, ఇప్పుడు ఫ్యూచర్ సిటీ పేరుతో భూములను అక్రమంగా రియల్ ఎస్టేట్‌కు మళ్లించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ చర్యలు ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్నాయని, దాంతో ప్రజలు, ముఖ్యంగా రైతులు నష్టపోతారని కేటీఆర్ హెచ్చరించారు.

# రాజ్యాంగ వ్యవస్థల్ని ధ్వంసం చేసేందుకు భాజపా కుట్ర

నగరంలో "ఓటర్ అధికార్ యాత్ర" ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఓటర్ల జాబితా 'ప్రత్యేక సమగ్ర సవరణ' పేరిట బిహార్‌లో ఓట్ల తొలగింపు, చేర్పుల వంటి కుట్రలకు తెరలేపారని ఆరోపించారు. 'ఇండియా' కూటమి దీనికి అనుమతించబోదని, పేదల ఓటు అధికారాన్ని వారి నుంచి దూరం కానివ్వబోదన్నారు." దేశవ్యాప్తంగా లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్లు చోరీకి గురవుతున్నాయి. మహారాష్ట్రలో లోక్‌సభ ఎన్నికల్లో 'ఇండియా' కూటమి సత్తా చాటింది. అసెంబ్లీ ఎన్నికల్లోనూ మాదే విజయమనే అంచనాలు వెలువడ్డాయి. కానీ, నాలుగు నెలల్లోనే కోటి మంది ఓటర్లు వచ్చి చేరడంతో.. భాజపా కూటమి గెలిచింది. ఎక్కడైతే ఓట్లు పెరిగాయో.. అక్కడ కాషాయ పార్టీ గెలిచింది. ఈసీ ఏం చేస్తోందో ఇప్పుడు అందరికీ తెలిసింది. ఓట్ల చోరీ ఆరోపణలపై ఎన్నికల సంఘం నా నుంచి అఫిడవిట్ కోరింది. భాజపా నేతలూ అదే విధమైన వాదనలు చేస్తే.. ఆ ప్రస్తావనే తీసుకురాలేదు. భాజపా, ఆరెస్సెస్‌లు రాజ్యాంగాన్ని దెబ్బతీసేందుకు యత్నిస్తున్నాయి" అని రాహుల్ గాంధీ ఆరోపించారు.కేంద్రంలో భాజపా నేతృత్వంలోని సర్కారు అధికారంలో ఉన్నంత కాలం రాజ్యాంగానికి ముప్పు పొంచి ఉందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. ప్రజల ఓటు హక్కును లాక్కునేందుకు యత్నిస్తోందన్నారు. ఎన్నికల సంఘం భాజపా ప్రభుత్వానికి ఏజెంట్‌లా వ్యవహరిస్తోందని వ్యాఖ్యానించారు. బిహార్‌లో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఎన్డీయే సర్కారును గద్దెదించుతారన్నారు. మరోవైపు.. బిహార్‌లో ఓటర్ల జాబితా సవరణపై ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ప్రజల ఓటు హక్కును కాలరాసేందుకు ఎన్నికల సంఘాన్ని ఉపయోగిస్తోందని ఆయన ఆరోపించారు.

# రాహుల్ అఫిడవిట్ సమర్పించండి

అవమానించడం సరికాదన్నారు. ఓటరు జాబితాను బూత్ లెవల్‌లోనే ప్రతి పార్టీ చూసుకుంటుందన్నారు. సంస్కరణల్లో భాగంగానే ఓటరు జాబితాను సవరిస్తున్నట్లు స్పష్టం చేశారు. "బిహార్‌లో ఎస్ఐఆర్‌పై కొన్ని పార్టీలు, సంబంధిత నేతలు అసత్య ప్రచారం చేయడం తీవ్ర ఆందోళనకరం. ఎన్నికల సంఘం భుజాల పైనుంచి కొన్ని రాజకీయ పార్టీలు దాడులు చేస్తున్నాయి. బిహార్ ఓటరు ముసాయిదా జాబితాలపై అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని అన్ని రాజకీయ పార్టీలకు సూచిస్తున్నాం. బూత్ స్థాయి అధికారులు, ఏజెంట్లు పారదర్శకంగా ఈ ప్రక్రియలో నిమగ్నమయ్యారు" అని సీఈసీ జ్ఞానేశ్ కుమార్ పేర్కొన్నారు."డబుల్ ఓటింగ్, ఓటు చోరీ ఆరోపణలకు ఎన్నికల సంఘం కానీ, ఓటరు భయపడే ప్రసక్తే లేదు. కోటి మందికిపై ఉద్యోగులు ఎన్నికల విధుల్లో నిమగ్నమయ్యారు. ఇంత పారదర్శకంగా చేపట్టిన కార్యక్రమంలో 'ఓటు చోరీ' ఎలా సాధ్యమవుతుంది..? ఆధారాలు లేకుండా జాబితా నుంచి ఓటరు పేరు తొలగించం. ప్రతిఒక్క ఓటరుకు ఈసీ దన్నుగా నిలుస్తుంది." అని సీఈసీ స్పష్టం చేశారు. "సవరణ ప్రక్రియ హడావుడిగా చేస్తున్నామన్నది అవాస్తవం. ప్రతి ఎన్నికల ముందు ఓటరు జాబితాను సరిచేయడం ఎన్నికల సంఘం విధి. ఓటరు జాబితాలను సవరించేందుకు దేశంలో ఇప్పటివరకు 10 సార్లకుపైగా సవరణలను చేపట్టాం. పశ్చిమ బెంగాల్‌తోపాటు ఇతర రాష్ట్రాల్లో ఎస్ఐఆర్‌ను నిర్ణీత సమయంలో ప్రకటిస్తాం. ఓటరు జాబితాలో అభ్యంతరాలు ఉంటే సెప్టెంబర్ 1లోగా తెలియజేయాలని గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీలను అభ్యర్థిస్తున్నా" అని ఎన్నికల ప్రధాన కమిషనర్ వెల్లడించారు.

ఈసీ వ్యాఖ్యలు హాస్యాస్పదం: కాంగ్రెస్

తమకు అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీలనే తేడా ఉండదని ఎన్నికల సంఘం చెప్పడాన్ని కాంగ్రెస్ హాస్యాస్పదంగా పేర్కొంది. రాహుల్ గాంధీ లేవనెత్తిన ఏ ప్రశ్నకూ సీఈసీ అర్థవంతంగా సమాధానం ఇవ్వలేకపోయారని విమర్శించింది. ఈసీ సొంత డేటా ద్వారా వెల్లడైన వాస్తవాలను మాత్రమే రాహుల్ ప్రస్తావించారని గుర్తుచేసింది. బిహార్ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై సుప్రీంకోర్టు ఇటీవల జారీ చేసిన ఆదేశాలను ఈసీ అక్షరాలా అమలు చేస్తుందా? అని పార్టీ సీనియర్ నేత జైరాం రమేశ్ 'ఎక్స్' వేదికగా ప్రశ్నించారు. ఈసీ వైఖరి దాని అసమర్థతను మాత్రమే కాకుండా, పక్షపాతాన్ని కూడా పూర్తిగా తేటతెల్లం చేసిందని ఆరోపించారు.

# కేటాయింపులు జరిగాకే మిగులు జలాలపై చర్చలుంటాయి

- సముద్రంలోకి వెళ్లే జలాలు అని మాట్లాడటం సరికాదు
- ఇరు రాష్ట్రాల వాటా తేలిన తర్వాతే ప్రాజెక్టులు కట్టాలి
- తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చుకున్నదే నీటి హక్కుల కోసం
- భవిష్యత్‌లో ఏపీలో కూడా కాంగ్రెస్ బలపడుతుంది
- రాహుల్ గాంధీ ప్రధాని అవుతారు: డిప్యూటీ సీఎం భట్టి

**విశాఖ(జనంసాక్షి):**భవిష్యత్‌లో ఏపీలో కూడా కాంగ్రెస్ బలపడుతుందని, రాహుల్ గాంధీ ప్రధాని అవుతారని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు.విశాఖలో నిర్వహించిన 'స్టాప్ ఓట్ చోరీ' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా తెలుగు రాష్ట్రాల మధ్య నీటి వివాదంపై స్పందించారు. తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చుకున్నదే నీటి హక్కుల కోసమని, రాష్ట్రంలో ప్రాజెక్టులు పూర్తయ్యి కేటాయింపులు జరిగాకే మిగులు జలాల అంశంపై చర్చలుంటాయని భట్టి స్పష్టం చేశారు. "సముద్రంలోకి వెళ్లే జలాలు అని మాట్లాడటం సరికాదు. గోదావరిపై మేం చేపట్టిన ప్రాజెక్టులు ఇంకా పూర్తి కాలేదు. ఇరు రాష్ట్రాల వాటా తేలిన తర్వాతే ప్రాజెక్టులు కట్టుకుంటే న్యాయంగా ఉంటుంది. రాజకీయ ప్రయోజనాల కంటే మాకు రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం. మా ప్రాజెక్టుల నిర్మాణం పూర్తయిన తర్వాత మిగులు జలాలుంటే వాడుకోవచ్చు. మా అవసరాలు తీరకుండా దిగువన ప్రాజెక్టులు నిర్మిస్తే కేటాయింపుల్లో సమస్య వస్తుంది"అని భట్టి అన్నారు.

## యూరియా కొరతపై పార్లమెంట్‌లో నిలదీయండి

**కాంగ్రెస్ ఎంపీలకు మంత్రి తుమ్మల ఫోన్**

**హైదరాబాద్(జనంసాక్షి):** రాష్ట్ర కాంగ్రెస్ ఎంపీలకు తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఫోన్ చేశారు. రాష్ట్రంలో యూరియా కొరత అంశాన్ని పార్లమెంట్‌లో లేవనెత్తాలని కోరారు. కేంద్రమంత్రి జేపీ నడ్డా దృష్టికి కూడా తీసుకెళ్లాలని సూచించారు. ఇప్పటికే మంత్రి తుమ్మల యూరియా కొరతపై కేంద్రానికి లేఖ రాసిన విషయం తెలిసిందే. రాష్ట్రానికి సరిపడా యూరియా కేటాయించాలని లేఖలో విజ్ఞప్తి చేశారు.

## గాజా పౌరులకు వీసాలు నిలిపివేసిన అమెరికా



**వాషింగ్టన్(జనంసాక్షి):**ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న గాజా ప్రజలపై మరో పిడుగు పడింది. ఇకపై గాజా ప్రజలకు వీసాలు నిలిపివేస్తున్నట్లు అమెరికా ప్రభుత్వం ప్రకటించింది. ఇజ్రాయెల్ దాడుల్లో గాయపడిన అనేకమంది ప్రజలు చికిత్స కోసం యూఎస్‌కు వస్తున్నారని ట్రంప్ యంత్రాంగానికి ఫిర్యాదు అందడంతో ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. తాత్కాలిక వైద్య-మానవతా వీసాలను జారీ చేయడానికి ఉపయోగించే ప్రక్రియపై సమీక్ష నిర్వహిస్తున్నామని ఇందులో భాగంగా గాజా ప్రజలకు అన్ని రకాల వీసాలు నిలిపివేస్తున్నామని అమెరికా విదేశాంగ శాఖ వెల్లడించింది. "గాజా నుంచి అమెరికాకు వచ్చే పాలస్తీనియన్లు హమాస్‌కు అనుకూలంగా ఉన్నారని.. హమాస్‌కు నిధులు సేకరించడానికి ప్రయత్నాలు చేస్తున్నారని ప్రభుత్వానికి ఫిర్యాదు అందడంతో ఈ చర్యలు తీసుకున్నాం" అని విదేశాంగ శాఖ తెలిపింది. గతవారం తీవ్రంగా గాయపడిన 11మంది పాలస్తీనియన్ చిన్నారులకు అమెరికాకు చెందిన స్వచ్ఛంద సంస్థ 'హీల్ పాలస్తీనా' వైద్య చికిత్స కోసం యూఎస్‌కు చేరుకోవడానికి సహకరించిందని పేర్కొంది. ఈ విధంగా పెద్ద మొత్తంలో ప్రజలను తరలించడం సరైనచర్య కాదని పేర్కొంది. ట్రంప్ యంత్రాంగం తీసుకున్న నిర్ణయంపై పలు స్వచ్ఛంద సంస్థలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. యూఎస్-ఆధారిత స్వచ్ఛంద సంస్థ 'పాలస్తీనా చిల్డ్రన్స్ రిలీఫ్ ఫండ్' ఈ విషయంపై స్పందిస్తూ..అమెరికా తీసుకున్న ఈ ప్రమాదకరమైన..అమానవీయ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేసింది. గత 30 ఏళ్లుగా తాము వేలాదిమంది పాలస్తీనా చిన్నారులను వైద్యం కోసం అమెరికాకు తరలించినట్లు తెలిపింది.

## నిర్మాణ రంగంలో స్వదేశీ వస్తువులనే వాడాలి

**కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి**

హైదరాబాద్(జనంసాక్షి):నగరంలో నిర్మాణ రంగం ఊపందుకుంటుందని, వినియోగదారుల ప్రయోజనాల మేరకు నిర్మాణరంగ సంస్థలు పనిచేయాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు.హైటెక్స్‌లో నిర్వహించిన క్రెడాయ్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా వస్తోన్న మార్పుల దృష్ట్యా బిల్డర్స్ స్వదేశీ వస్తువులనే ఉపయోగించాలని సూచించారు. నిర్మాణ రంగానికి ప్రభుత్వ సహకారం ఉంటుందన్నారు. నిర్మాణ రంగ వ్యాపారులు ఇళ్ల నిర్మాణం నాణ్యతలో రాజీ పడొద్దన్నారు. "ఇప్పటికే హైదరాబాద్.. ఐటీ, ఫార్మా రంగాల్లో దూసుకెళ్తోంది. నిర్మాణం రంగంలోనూ దూసుకుపోతోందని అన్నారు.





# జమ్మూకశ్మీర్‌ను మళ్లీ ముంచిన క్లౌడ్‌బరస్ట్

తెలిపారు. సహాయక చర్యల నిమిత్తం ఎస్‌డీఆర్ఎఫ్ బృందం ఆ ప్రాంతానికి చేరుకుందని వెల్లడించారు. ఘాటీ సమీపంలోని జుతానా జోడ్ అనే ప్రాంతంలో కొండచరియలు విరిగిపడటంతో శిథిలా కింద ఒక కుటుంబం చిక్కుకున్నట్లు తెలుస్తోంది.భారీ వర్షాల కారణంగా సహాక్ ఖాద్, ఉజ్ నదులలో నీటి శాతం అమాంతంగా పెరిగిపోయిందని అధికారులు తెలిపారు. రైలు పట్టాలు దెబ్బతినడంతో పాటు ఆ ప్రాంతంలోని జాతీయ రహదారితో సహా ప్రధాన మార్గాలపై వాహనాలు నిలిచిపోయాయన్నారు. కథువా పోలీస్ స్టేషన్‌లోకి కూడా వరదనీరు చేరింది.ఈ ఘటనపై కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ఎక్స్ వేదికగా వివరాలు వెల్లడించారు. మేఘ విస్ఫోటంపై సమాచారం అందగానే కథువా పోలీసు అధికారి శోభిత్ సక్సేనాతో మాట్లాడినట్లు తెలిపారు. సహాయక సిబ్బంది ఆ ప్రాంతానికి చేరుకున్నారన్నారు. మృతులకు సంతాపం తెలిపారు. మరోవైపు జిల్లా అధికారులు వాతావరణ హెచ్చరికలు జారీ చేశారు. భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉన్నందున అలాంటి ప్రదేశాలకు దూరంగా వెళ్లాలని కోరారు.ఇటీవల మచైల్ మాతా దేవి దర్శనానికి వెళుతున్న యాత్రికులపై మేఘ విస్ఫోటం విరుచుకుపడింది. ఈ ప్రమాదంలో ఇద్దరు సీఆర్‌పీఎఫ్ సిబ్బందితో సహా ఇప్పటి వరకు 60 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 82 మంది గల్లంతయ్యారు.





# రష్యా విషయంలో కీలక పురోగతి సాధించాం



ముగిసిన నేపథ్యంలో ట్రంప్ తాజా ప్రకటన ఆసక్తిగా మారింది.ఉక్రెయిన్‌కు 'నాటో' తరహా భద్రతా గ్యారంటీని అమెరికా, ఐరోపా మిత్రదేశాలు అందించేందుకు రష్యా అధ్యక్షుడు పుతిన్ అంగీకరించినట్లు అమెరికా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్‌కాఫ్ వెల్లడించారు. అలాస్కాలో ట్రంప్, పుతిన్‌ల మధ్య భేటీలో చర్చించిన అంశాలను తొలిసారి వెల్లడించిన ఆయన.. సెక్యూరిటీ గ్యారంటీకి ఇరుదేశాలు అంగీకరించాయన్నారు. చర్చల్లో ఇదే గేమ్-ఛేంజర్‌గా మారనుందన్నారు. శాంతి ఒప్పందానికి అవసరమైన అన్ని అంశాలను ప్రస్తావించామన్న విట్‌కాఫ్.. ఉక్రెయిన్‌లోని అదనపు భూభాగంలోకి వెళ్లకుండా చట్టబద్ధతతో కూడిన హామీని రష్యా ఇస్తానని చెప్పిందన్నారు. మరోవైపు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సోమవారం ట్రంప్‌తో భేటీ కానున్నారు. ఈ సమావేశానికి యూరోపియన్ దేశాల నాయకులను కూడా ట్రంప్ ఆహ్వానించినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ట్రంప్, జెలెన్‌స్కీల మధ్య సమావేశం అనంతరం ముగ్గురు నేతల మధ్య (ఆగస్టు 22న) త్రైపాక్షిక భేటీ జరిగే అవకాశం ఉందని జర్మన్ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్ వెల్లడించారు. దీంతో యుద్ధం ముగింపునకు సంబంధించి ఆగస్టు 18న కీలక ప్రకటన వెలువడుతుందని అంచనా.

ట్రంప్, పుతిన్, జెలెన్‌స్కీ త్రైపాక్షిక సమావేశం ఆగస్టు 22న!

ఉక్రెయిన్‌లో యుద్ధానికి ముగింపు పలకడంపై చర్చించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రష్యా అధ్యక్షుడు పుతిన్ అలాస్కాలో భేటీ అయిన సంగతి తెలిసిందే.అనంతరం త్రైపాక్షిక శిఖరాగ్ర సమావేశం గురించి ట్రంప్ జెలెన్‌స్కీతో ఫోన్‌లో మాట్లాడుకొన్నారు. ఈ నేపథ్యంలో ముగ్గురు అధ్యక్షుల మధ్య ఈ సమావేశం ఆగస్టు 22న ఏర్పాటు చేయాలని అమెరికా అధ్యక్షుడు యోచిస్తున్నట్లు ఆ దేశ మీడియా సంస్థలు పేర్కొన్నాయి. పుతిన్‌తో సమావేశం అనంతరం ఈ విషయాన్ని ట్రంప్ యూరోపియన్ నాయకులతో చెప్పినట్లు సమాచారం. మరో వైపు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సోమవారం ట్రంప్‌తో భేటీ అవ్వనున్నారు. ఈ సమావేశానికి యూరోపియన్ దేశాల నాయకులను కూడా ట్రంప్ ఆహ్వానించినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. జర్మన్ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్ మాట్లాడుతూ.. సోమవారం ట్రంప్, జెలెన్‌స్కీల మధ్య సమావేశం జరిగిన అనంతరం ముగ్గురు నేతల మధ్య త్రైపాక్షిక మీటింగ్ జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. యుద్ధం ముగింపుపై సోమవారం కీలక ప్రకటన వెలువడుతుందని భావిస్తున్నారు.ఉక్రెయిన్‌తో యుద్ధం గురించి ఇటీవల అలాస్కా వేదికగా ట్రంప్, పుతిన్‌లు భేటీ అయ్యి రెండున్నర గంటలకు పైగా చర్చించారు. అయినప్పటికీ ఎలాంటి ఒప్పందానికి రాలేదు. అయితే, చర్చలు సానుకూలంగా జరిగాయని ఇరువురు నేతలు ప్రకటించారు. సమావేశం గురించి ట్రంప్ మాట్లాడుతూ.. ఒప్పందంపై నిర్ణయం జెలెన్‌స్కీ చేతుల్లోనే ఉందన్నారు. అనంతరం అమెరికా అధ్యక్షుడు తనతో ఫోన్‌లో మాట్లాడినట్లు ఉక్రెయిన్ అధినేత తెలిపారు. త్రైపాక్షిక సమావేశంపై ట్రంప్ చేసిన ప్రతిపాదనకు తాను మద్దతిస్తున్నట్లు వెల్లడించారు. కీలక అంశాలపై చర్చించుకునేందుకు అది మంచి వేదిక అవుతుందన్నారు. పరిస్థితులను చక్కదిద్దే బలం అమెరికాకు ఉందని ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. శాంతి ఒప్పందంపై ఉక్రెయిన్‌కు మద్దతుగా నిలుస్తున్న యూరోపియన్ నాయకులకు జెలెన్‌స్కీ కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం వాషింగ్టన్ డీసీలో ట్రంప్‌తో జెలెన్‌స్కీ సమావేశమవ్వనున్న నేపథ్యంలో ఐరోపా నేతలు అప్రమత్తమయ్యారు. గతంలో అమెరికా అధ్యక్షుడితో సమావేశమైన జెలెన్‌స్కీకి చేదు అనుభవం ఎదురైన విషయం తెలిసిందే. ఈ ఘటన పునరావృతం కాకుండా ఉండేందుకు ట్రంప్‌తో స్నేహపూర్వకంగా మెలిగే ఫిన్‌లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్‌ను, ఇతరులను ఉక్రెయిన్ అధ్యక్షుడికి సాయంగా వాషింగ్టన్‌కు పంపనున్నట్లు యూరప్ దౌత్యవేత్తలు తెలిపారు. ఇరువురి మధ్య ఘర్షణ పునరావృతం కాకుండా, చర్చలు సజావుగా జరిగేలా వీరు చూసుకోనున్నట్లు సమాచారం. నాటో సెక్రెటరీ జనరల్ కూడా ఈ సమావేశంలో పాల్గొనే అవకాశం ఉందని పొలిటికో పత్రిక కథనం వెలువరించింది.

## జీఎస్టీ ప్రక్షాళనతో ప్రజలకు లబ్ధి

న్యూఢిల్లీ(జనంసాక్షి):జీఎస్టీ తదుపరి తరం సంస్కరణలకు సంబంధించిన ముసాయిదాను ఇప్పటికే రాష్ట్రాలకు పంపించామని, వాటి అమలుకు సహకరించాలని ప్రధాని మోదీ విజ్ఞప్తి చేశారు. ఇందులో మార్పులు పేద, మధ్యతరగతి ప్రజలతోపాటు వ్యాపారులకూ ఎంతో ప్రయోజకరంగా ఉంటాయని అన్నారు. దిల్లీలో రెండు హైవే ప్రాజెక్టుల ప్రారంభోత్సవం అనంతరం మాట్లాడిన ప్రధాని మోదీ.. జీఎస్టీ చట్టాన్ని సరళతరం చేసి, పన్ను రేట్లను సవరించాలని కేంద్రం భావిస్తోందన్నారు."మా దృష్టిలో సంస్కరణలు అనేవి సుపరిపాలన పురోగతిని సూచిస్తాయి. సమీప భవిష్యత్తులో వ్యాపార కార్యకలాపాలు మరింత తేలికగా, సులభంగా మార్చే ఉద్దేశంతో సంస్కరణలు అమలు చేసేందుకు 'నెక్స్ట్ జెన్ జీఎస్టీ'తో సిద్ధమయ్యాం. వచ్చే దీపావళికి ఈ సంస్కరణలు రెట్టింపు బోనస్‌ను ఇస్తాయి.జీఎస్టీ సంస్కరణలకు సంబంధించిన ముసాయిదాను రాష్ట్రాలకు కేంద్రం పంపించింది. వీటికి అన్ని రాష్ట్రాలు సహకరిస్తాయని ఆశిస్తున్నాం. సాధ్యమైనంత త్వరగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నా. తద్వారా దీపావళి మరింత అద్భుతంగా మారుతుంది" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఈ సంస్కరణల ప్రతిపాదనలపై చర్చించేందుకు వచ్చే నెలలో జీఎస్టీ కౌన్సిల్ భేటీ కానున్నట్లు తెలుస్తోంది.ఈ ప్రతిపాదిత రెండు శ్లాబుల విధానాన్ని జీఎస్టీ మండలి ఆమోదిస్తే, ప్రస్తుతం ఉన్న నాలుగు శ్లాబుల్లో 12, 28 శాతం శ్లాబులు తొలగిపోనున్నాయి. 5%, 18% శ్లాబులు మాత్రమే ఉండనున్నాయి. ఇది 'గేమ్ ఛేంజర్' సంస్కరణగా మిగిలిపోతుందని నిపుణులు భావిస్తున్నారు. సుమారు 6 నెలల పాటు సాగిన చర్చలు, డజన్ల సమావేశాల తర్వాత ప్రతిపాదిత జీఎస్టీ విధానం తెరమీదకు వచ్చిందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

**అభివృద్ధి చెందుతోన్న భారత్‌కు దిల్లీ ఓ నమూనా : ప్రధాని మోదీ**

అభివృద్ధి చెందుతోన్న భారత్‌కు దిల్లీ ఓ నమూనాగా తీర్చి దిద్దాల్సిన అవసరం ఉందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఇందుకోసం గత 11 ఏళ్లుగా తమ ప్రభుత్వం అన్ని స్థాయిల్లో కృషి చేస్తోందన్నారు.దేశ రాజధానిలో సుమారు రూ.11వేల కోట్లతో నిర్మించిన రెండు ప్రధాన హైవే ప్రాజెక్టులను ప్రారంభించిన ఆయన.. వీటితో దిల్లీ, సమీప ప్రాంత ప్రజలకు ఈ రహదారులు ఎంతో సౌలభ్యంగా ఉంటాయన్నారు. "అధునాతన కనెక్టివిటీ పొందిన దిల్లీ ప్రజలకు అభినందనలు. ప్రపంచం భారత్‌పై ఓ అభిప్రాయానికి రావాలనుకున్నప్పుడు తొలుత దాని చూపు రాజధాని వైపు ఉంటుంది. అందుకే అభివృద్ధి చెందిన దేశానికి దిల్లీని ఓ నమూనాగా తయారు చేయాల్సిన అవసరం ఉంది. ఇందుకోసం మన ప్రభుత్వం అనేక స్థాయిల్లో కృషి చేస్తోంది. గడిచిన 11 ఏళ్లలో దిల్లీ ఎన్‌సీఆర్‌లో ప్రయాణం సులభతరమైంది" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించడంతోపాటు సమీప ప్రాంతాలకు ప్రయాణ సమయాన్ని తగ్గించే లక్ష్యంతో మౌలిక సదుపాయాలు సమకూరుస్తున్నామని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఈ రెండు కొత్త ప్రాజెక్టులు పూర్తిగా అందుబాటులోకి వస్తే సోనిపత్, రోహ్‌తక్, బహదూర్‌గఢ్‌తోపాటు గురుగ్రామ్ నుంచి ఐజీఐ ఎయిర్‌పోర్టు వరకు ప్రయాణం సులభమవుతుందన్నారు. అంతకుముందు రోహిణి ప్రాంతంలో మెగా రోడ్ షో నిర్వహించిన మోదీ.. ప్రాజెక్టు పనుల గురించి సమీక్ష జరిపారు.

# బెట్టువీడని సినీ కార్మికులు

### వేతనాల పెంచాలని పట్టుబట్టిన వైనం
### చిరంజీవితో భేటీ అయిన నిర్మాతలు, ఫెడరేషన్ నాయకులు



**హైదరాబాద్, ఆగస్టు 17 (జనంసాక్షి) :** గత కొన్ని రోజులుగా వేతనాల పెంపు కోసం సినీ కార్మికుల సమ్మె కొనసాగుతూనే ఉంది. ఫిల్మ్ ఛాంబర్, ఫెడరేషన్ నాయకుల మధ్య జరిగిన చర్చలు విఫలమైన నేపథ్యంలో తాజాగా చిరంజీవి రంగంలోకి దిగారు. గతంలోనే చిరంజీవిని కలిసిన సినిమా నిర్మాతలు తమ గోడు వెళ్ళబోసుకున్నారు. అయితే ఫెడరేషన్ నేతలతోనూ తాను చర్చలు జరిపిన తర్వాతే తన అభిప్రాయాన్ని వెళ్ళడిస్తానని చిరంజీవి చెప్పారు. ఆ తర్వాత చిరంజీవి.. దీనిని ఫిల్మ్ ఛాంబర్, ఫెడరేషన్ చర్చల ద్వారానే పరిష్కారం ఆలోచించమని సూచించారు. కానీ ఛాంబర్, ఫెడరేషన్ మధ్య పలు సార్లు చర్చలు జరిగినప్పటికి పరిష్కారం లభించలేదు. ఈ నేపథ్యంలో ఆదివారం చిరంజీవిని ఆయన నివాసంలో నిర్మాతలు, ఫెడరేషన్ నాయకులు విడివిడిగా కలిసి మాట్లాడారు. ఇదిలా ఉంటే.. ఇప్పటికే వివిధ రాష్ట్రాలలో నిర్మాతలు, కార్మికుల మధ్య ఉన్న ఒప్పందాలను గురించిన సమాచారం చిరంజీవి సేకరించారని తెలుస్తోంది. ఇక చిరంజీవితో చిన్న నిర్మాతలు కూడా సమావేశమయ్యారు.

ఈ సమావేశంలో నట్టికుమార్, సురేందర్ రెడ్డి, యలమంచిలి రవి, ఆచంట గోపీనాథ్, కేశవరావు పాల్గొన్నారు. సినీ కార్మికుల సమ్మె, చిన్న నిర్మాతల సమస్యలపై ఈ భేటీలో చర్చించారు. అనంతరం నిర్మాత నట్టికుమార్ మీడియాతో మాట్లాడుతూ.. 'మా బాధలను చిరంజీవికి వివరించామని అన్నారు. చిన్న సినిమాలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరాం. సోమవారం ఫిల్మ్ ఫెడరేషన్ సభ్యులతో మాట్లాడుతానని చిరంజీవి అన్నారు. సమస్య పరిష్కారానికి చిరంజీవి కృషి చేస్తానన్నారని చెప్పారు' నట్టికుమార్. అయితే చిరంజీవితో జరిగిన భేటీ సందర్భంగా నిర్మాత సీ కల్యాణ్ మాట్లాడుతూ.. 'సినీ కార్మికుల వేతనాలపై ఛాంబర్, యూనియన్లు చర్చలతో ముందుకెళ్లాలని చిరంజీవి సూచించారు. సామరస్యంగా చర్చలు జరిపి షూటింగ్ మొదలు పెడితే ఓకే.. లేకపోతే రెండు రోజుల వరకూ వేచిచూస్తానని ఆయన చెప్పారు. అప్పటిదాకా మీరు సామరస్యంగా సమస్యలను పరిష్కరించుకునే ప్రయత్నం చేయండి. అప్పటికీ పరిష్కారం కాకపోతే తన నిర్ణయం చెబుతానని చిరంజీవి పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో చిరంజీవి సూచనను పాటిస్తాము' అని అన్నారు.

# పేరు ఆలయానికి.. రోడ్డు సర్కారుది..!


### సర్వే నెంబర్ గోల్‌మాల్ చేసి అక్రమ లీజు
### సెయింట్ జార్జ్ స్కూల్‌పై ఇప్పటికే కలెక్టర్‌కు ఫిర్యాదు
### వేసి రోడ్డును మూసివేయాలని ఏఐఎఫ్‌బి ఆందోళన

### 98 లక్షలకు 99 సంవత్సరాలు రాసిచ్చిన ప్రైవేటు వ్యక్తులు

*రియల్ ఎస్టేట్‌కు చెందిన కొందరు వ్యాపారులు కరీంనగర్ జిల్లాలో మరో కొత్త మోసానికి తెరతీశారు. ప్రభుత్వానికి చెందిన భూమిని ఓ ప్రైవేటు స్కూల్‌కు అప్పజెప్పేందుకు లేని సర్వే నెంబర్లను అంటగట్టారు. సంబంధం లేని స్థలంలో ఏకంగా 99 ఏండ్లపాటు అక్రమ లీజును సృష్టించారు. ఇందుకు 98 లక్షలకు బేరం కుదుర్చుకున్న సదరు ప్రైవేటు వ్యక్తులు.. ఆలయాలకు సంబంధించిన సర్వే నెంబర్లను ఉపయోగించుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.*



**కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 17 (జనంసాక్షి) :**
గతేడాది సెప్టెంబర్ 7న రాసిన ఓ ఒప్పందం తాలూకు బండారం బట్టబయలైనట్టు తెలుస్తోంది. 99 సంవత్సరాల రహదారి లీజు ఒప్పందంలో భాగంగా కరీంనగర్ జిల్లా కొత్తపల్లి పరిధిలోని శ్రీ సచ్చిదానంద స్వామి (రామాలయం), శ్రీవేంకటేశ్వర హనుమాన్ ట్రస్ట్ టెంపుల్‌వారు సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందినవారికి లీజు ఒప్పందం రాసిచ్చినట్టు పత్రంలో పేర్కొన్నారు. కొత్తపల్లి హవేలీ జగిత్యాల టూ కరీంనగర్ రోడ్డులో 100 ఫీట్ల రోడ్డు నుంచి సర్వే నెంబర్ 278/5 నుంచి సర్వే నెంబర్ 276, 277 వరకు 33 ఫీట్ల రహదారిని ఒప్పందం కుదిరిన మొత్తంలో 50శాతం చెక్కుల ద్వారా చెల్లించారు. మిగతా మొత్తాన్ని శ్రీ వేంకటేశ్వర హనుమాన్ టెంపుల్ ట్రస్ట్ పేర చెక్కులు ఇచ్చారు. అయితే ఇక్కడే పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. శ్రీ వేంకటేశ్వర హనుమాన్ టెంపుల్ ట్రస్ట్ అనేది కొందరు ప్రైవేటు వ్యక్తులు నిర్వహిస్తున్నట్టు, వారి రియల్ ఎస్టేట్ వ్యాపార లావాదేవీల కోసం ఈ పేరిట చెక్కులు తీసుకున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అయితే, శ్రీ సచ్చిదానంద స్వామి (రామాలయం) ట్రస్టు, వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయానికి చెందినవారు మాత్రం తమ ట్రస్ట్ భూములు కబ్జా కాలేదని, తమకు సంబంధించిన సర్వే నెంబర్లను ఉపయోగించుకుని ప్రభుత్వ స్థలాల్లో రోడ్డు వేసుకున్నారని చెబుతున్నారు. ఈ మేరకు ప్రభుత్వ భూములను రక్షించాలని మార్చ్ 17న జిల్లా కలెక్టర్‌కు కూడా వినతిపత్రం అందజేశారు.




**ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ ఆందోళన**

శ్రీ సచ్చిదానంద స్వామి (రామాలయం) ట్రస్టు, వీరబ్రహ్మేంద్రస్వామి టెంపుల్, ప్రభుత్వ భూముల నుండి సెయింట్ జార్జ్ స్కూల్‌కు, కొంతమంది రియల్ స్టేట్ వ్యాపారానికి అక్రమంగా లీజుకు ఇవ్వడంపై అల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భూములను సందర్శించారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శిలు కోమటిరెడ్డి తేజ్ దీప్ రెడ్డి, బండారి శేఖర్ మాట్లాడుతూ.. రామాలయం ట్రస్టు కమిటీకి సంబంధం లేకుండా ఆలయ భూములను ఎలా లీజుకు ఇస్తారని ప్రశ్నించారు. ట్రస్టు పేరుతో దేవాలయాల భూముల్లో పెద్దఎత్తున అక్రమాలు జరుగుతున్నాయన్నారు. లీజు ఇచ్చిన వారిపై, తీసుకున్న వారిపై ల్యాండ్ గ్రాబింగ్, క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. దేవాలయాలను డెవలప్ చేస్తామని డబ్బులు ఆశచూపి దేవాలయల భూములు, ప్రభుత్వ భూముల నుండి రోడ్డు తీయదాన్ని తీవ్రంగా ఖండించారు. రెవెన్యూ అధికారులు సైతం నిమ్మకునీరెత్తినట్టు ఉండటం అనుమానాలకు తావిస్తోందన్నారు. రోడ్డును మూసివేసి, సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు చేపట్టకపోతే ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ ఆధ్వర్యంలో స్కూల్ బస్సులను అడ్డుకుంటామని, సెయింట్ జార్జ్ స్కూల్ ముందు ఎదుట, కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కురువెల్లి శంకర్, బద్రి నేత, ప్రశాంత్ కుమార్, విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు అతికం రాజశేఖర్ గౌడ్, పార్టీ నాయకులు రామ్ మూర్తి, నర్సింగం, రాజు, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమవుతోంది : గౌరిశెట్టి మునీందర్, రామాలయం ట్రస్ట్ అధ్యక్షుడు**

మా భూములకు సంబంధించిన సర్వే నెంబర్లు వేసి సర్కారు స్థలంలో రోడ్డు వేసుకున్నారు. ఇక్కడ ప్రభుత్వ భూమి కబ్జా అవుతోంది. ఆ భూములను రక్షించాలి.

# కుత్బుల్లాపూర్‌లో రెచ్చిపోయిన గంజాయి బ్యాచ్

### ఓ వ్యక్తిపై సర్జికల్ బ్లేడ్‌తో దాడి




**హైదరాబాద్, ఆగస్టు 17 (జనంసాక్షి) :** కుత్బుల్లాపూర్‌లో గంజాయి బ్యాచ్ రెచ్చిపోయింది. గంజాయి బ్యాచ్‌ని పట్టుకునేందుకు వచ్చిన హైదరాబాద్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసుల సమక్షంలో ఓ యువకుడిపై సర్జికల్ బ్లేడ్‌తో జరిగిన దాడి సంచలనంగా మారింది. కాగా ఇదే ఘటనపై గాయాలపాలైన భాదితుడి కుటుంబ సభ్యులు, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు జీడిమెట్ల పోలీస్టేషన్‌లో ఫిర్యాదులు చేసిన ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. ఇరువురు స్థానిక పోలీస్టేషన్‌లో చేసిన ఫిర్యాదుల ఆధారంగా.. ఈ నెల 16న రాత్రి సమయంలో కుత్బుల్లాపూర్ అయోధ్యనగర్‌లో హాష్ ఆయిల్ గంజాయిని విక్రయిస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు హైదరాబాద్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.కోటమ్మ నేతృత్వంలో దాడులు చేపట్టారు. ఈ దాడిలో హేమంత్, నితిష్, రవితేజా, చరణ్‌ను విచారిస్తున్న క్రమంలో కుత్బుల్లాపూర్ వెంకటేశ్వరనగర్ కాలనీకి చెందిన బి.చంటియాదవ్(28) తన పనులు ముగించుకొని అటువైపు నుండి వస్తుండగా పోలీసులకు గంజాయి విక్రయదారులకు మధ్య జరుగుతున్న పెనుగులాటలో జోక్యం చేసుకోవడంతో అకస్మాత్తుగా చంటియాదవ్ తలభాగంలో చెవిపై సర్జికల్ బ్లేడ్‌తో దాడి జరిగింది. తీవ్ర రక్తస్రావం కావడంతో స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా 15 కుట్లు పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

# మూడురోజులు తెలంగాణలో అతిభారీ వర్షాలు

### రెడ్ అలెర్ట్ జారీ చేసిన వాతావరణశాఖ..!

**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణలో గతవారం రోజుల నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో వర్షాలకు వరదలు పోటెత్తాయి. ఇప్పటికే వర్షాలకు పలు జిల్లాలు అతలాకుతలమయ్యాయి. ఈ క్రమంలో వాతావరణశాఖ కీలక హెచ్చరికలు చేసింది. రాగల మూడురోజులు భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. కొన్ని జిల్లాలకు రెడ్ అలెర్ట్, మరికొన్ని జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ఆదివారం కొత్తగూడెం, హన్మకొండ, మహబూబాబాద్, ములుగు, వరంగల్ జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ నేపథ్యంలో ఆయా జిల్లాలకు రెడ్ అలెర్ట్ చేసింది వాతావరణశాఖ. ఆదిలాబాద్, జనగాం, భూపాలపల్లి, ఖమ్మం, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, సిద్దిపేట, సూర్యాపేట జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది.

జగిత్యాల, కామారెడ్డి, కరీంనగర్, మెదక్, నిర్మల్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, సంగారెడ్డి, వికారాబాద్, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కొనసాగుతాయని చెప్పింది. సోమవారం భద్రాద్రి కొత్తగూడెం, హన్మకొండ, జనగాం, ఖమ్మం, మహబూబాబాద్, ములుగు, సిద్దిపేట, వరంగల్ జిల్లాల్లో అతిభారీ వర్షాలుంటాయని తెలిపింది. ఆదిలాబాద్, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, కామారెడ్డి, కరీంనగర్, ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, కామారెడ్డి, కరీంనగర్, ఆసిఫాబాద్, మంచిర్యాల, మెదక్, నల్గొండ, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, సూర్యాపేట, భువనగిరి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు పడే సూచనలున్నాయని పేర్కొంది.

# ఏడుపాయల ఆలయం జలదిగ్బంధం



**పాపన్నపేట (జనంసాక్షి) :** ఇటీవల కురిసిన భారీవర్షాల కారణంగా సింగూరు ప్రాజెక్టు నుంచి 5 గేట్లు ఎత్తి 50వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో మంజీరా నది ఉగ్రరూపం దాల్చింది. దీంతో మెదక్ జిల్లా నాగ్సాన్‌పల్లి గ్రామ పరిధిలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల శ్రీ వనదుర్గా భవాని మాత ఆలయం గత నాలుగు రోజులుగా పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కుకుంది. ఆదివారం నాటికి నదిలో నీటి ప్రవాహం మరింత పెరిగి,ఏడుపాయల గుండా పొంగిపొర్లడంతో ఆలయం పూర్తిగా నీట మునిగింది. ప్రధాన ఆలయం లోపలికి వరద నీరు చేరింది. భక్తులు దర్శనం చేసుకోవడానికి వీలు లేకపోవడంతో అధికారులు తాత్కాలికంగా ఆలయాన్ని మూసివేశారు. ప్రస్తుతం భక్తులు ఆలయ రాజగోపురం వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని దర్శించుకున్నారు. ప్రధాన ఆలయం ముందు ఉదృతంగా ప్రవహిస్తున్న మంజీరా నది దృశ్యాలను భక్తులు చూసి ఆశ్చర్యపోతున్నారు. భద్రత చర్యల్లో బాగంగా ఏడుపాయల పరిసర ప్రాంతాల్లో పోలీసులు బారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నది పరిసరాలకు ప్రజలు వెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

### దత్తత తీసుకున్న దేశీ కుక్కపిల్లలను
# కుటుంబ సభ్యుల్లా ఆదరించాలి

### జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి కర్ణన్




**హైదరాబాద్, ఆగస్టు 17 (జనంసాక్షి) :** దేశీ కుక్కపిల్లలను దత్తత తీసుకున్నవారు వాటిని కుటుంబ సభ్యుల్లా ఆదరించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం జలగం వెంగలరావు పార్కులో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన "ఇండీ పప్పీ దత్తత మేళా " ను కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి తో కలిసి ప్రారంభించారు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం "బి ఏ హీరో.. అడాప్ట్ డోంట్ షాప్" అనే నినాదంతో ఆకట్టుకుంది. డీ-వార్మ్ చేసిన, వ్యాక్సిన్ వేసిన, ఆరోగ్యంగా ఉన్న అందమైన 39 దేశీ కుక్కపిల్లలను ఈ మేళాలో ప్రదర్శించారు. కుక్కలంటే ఇష్టపడే ప్రజలు ఈ మేళాకు హాజరై ఆసక్తిగా తిలకించారు. కమిషనర్ కర్ణన్, ఖైరతాబాద్ జోనల్ అధికారులతో కలిసి అక్కడ కుక్కపిల్లలను పరిశీలించారు. అనంతరం తొలి దత్తతగా కూకట్‌పల్లి కి చెందిన సి.హెచ్. సాయికి ఒక కుక్కపిల్లను స్వయంగా కమిషనర్ అందజేసి అభినందించారు. మేళాలో మొత్తం 24 కుక్క పిల్లలను డాగ్ లవర్స్ దత్తత తీసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ దేశీ కుక్కపిల్లలను దత్తత తీసుకున్నవారు వాటిపై చూపుతున్న ప్రేమాభిమానాలు ప్రశంసనీయమని కమిషనర్ అన్నారు. కుటుంబ బంధాలను మరింత బలపరచే ఈ ప్రయత్నాన్ని అందరూ ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. జీహెచ్ఎంసీ చీఫ్ వెటర్నరీ ఆఫీసర్ అబ్దుల్ వకీల్‌తో పాటు పలువురు అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# 27న కెకె స్మారక ఉపన్యాసాలు

**మహబూబ్‌నగర్ బ్యూరో (జనంసాక్షి) :** ఈ నెల 28న కె.కె. (కె.కనకాచారి) 20వ వర్ధంతి స్మారక ఉపన్యాసాలు నిర్వహించనున్నట్టు కెకె మెమోరియల్ ట్రస్ట్ మహబూబ్‌నగర్ ఓ ప్రకటనలో తెలిపింది. ఉదయం 10 గంటల నుంచి మహబూబ్‌నగర్‌లోని రెడ్ క్రాస్ భవన్ మీటింగ్ హాల్‌లో జరగనుందని తెలిపింది. కెకెకు నివాళిగా కె.కె చిత్రపటానికి పూలమాల అలంకారణ, 2 ని.ల మౌనం పాటించనున్నారు. ఈ సందర్భంగా మానవ జీవన తాత్వికత అంశంపై కె వామన్ కుమార్, డి. నర్సయ్య అధ్యక్షతన సమావేశం ఉంటుంది. సి.ఎస్.ఆర్. ప్రసాద్ వక్తగా పాల్గొననున్న సందర్భంగా శాంతి కోసం అన్వేషణ -సవాళ్లుపై చర్చ కొనసాగనుంది. ప్రొఫెసర్ జి. హరగోపాల్ వక్తగా పాల్గొననున్నారు. ఎం రాఘవాచారి సమన్వయకర్తగా వ్యవహరించనుండగా.. కె. భీమయ్య కృతజ్ఞతలు తెలియజేనున్నారు.

# ఎయిర్‌పోర్టు దగ్గర్లోని భవనాలు తొలగిస్తారా?

### బేగంపేట విమానాశ్రయానికి అతి సమీపంలో 12 వేలకు పైగా నివాసాలు
### బేగంపేటలో ఎయిర్‌పోర్ట్ అథారిటీ స్థలాల్లోని ప్రజల ఆందోళన



**హైదరాబాద్ (జనంసాక్షి) :** సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలోని ఎయిర్‌పోర్ట్ అథారిటీ స్థలాల్లో ఉన్న బస్తీల ప్రజలు దినదినగండంగా గడుపుతున్నారు. ఎయిర్‌పోర్ట్ అథారిటీ అధికారులు బేగంపేట విమానాశ్రయం సమీపంలోని అన్నానగర్‌లో ఇటీవల పర్యటించారు. అహ్మదాబాద్ విమానాశ్రయం సమీపంలో ఇటీవల జరిగిన విమాన ప్రమాదం తర్వాత, విమానాశ్రయం సమీపంలోని ఎత్తైన భవనాలను తొలగిస్తారని సాగుతున్న ప్రచారంపై స్థానికులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. బేగంపేట విమానాశ్రయానికి అతి సమీపంలో ఉన్న అన్నానగర్,ఇందిరమ్మ నగర్, అర్జున్ నగర్, సీబీఎన్ నగర్, శ్రీలంక బస్తీలు ఉన్నాయి. ఇవన్నీ ఎయిర్‌పోర్ట్ అథారిటీ స్థలంలోనే వెలిశాయి. అక్కడున్న బస్తీల్లో 12 వేలకు పైగా నివాసాలు ఉన్నాయి. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు బస్తీలతో పాటు ఎయిర్‌పోర్ట్ అథారిటీ ప్రాంతాలలోని ప్రజల ఓట్లను కంటోన్మెంట్ బోర్డు తొలగించింది. ఈ నేపథ్యంలో బేగంపేట విమానాశ్రయానికి సమీపంలోని ఎత్తైన నివాసాలపై అధికారులు ఆరా తీస్తున్నారన్న సమాచారం తెలుసుకున్న స్థానికులు, ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న ఆందోళనతో ఉన్నారు. ఈ పరిణామాలు ఆ ప్రాంతాల్లో ఉన్న వారి జీవితాలను ఎంతగానో ప్రభావితం చేస్తున్నాయి. తరతరాలుగా అక్కడ నివసిస్తున్న వారు తమ జీవితాలను, జీవనోపాధిని అక్కడే నిర్మించుకున్నారు. వారి ఇళ్లు కేవలం గోడలు, పైకప్పులు మాత్రమే కాదు. వారి కలలు, ఆశలు, జ్ఞాపకాలు, భవిష్యత్తు కూడా అక్కడే అనుకున్నారు. కూల్చివేత భయం వారికి నిద్రను దూరం చేసి, నిరంతర ఒత్తిడిని కలిగిస్తోంది. రోజువారీ పనులపై కూడా దృష్టి పెట్టలేని పరిస్థితి నెలకొంది.

# నిర్మల్‌లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం

### రోడ్లపై మురికి నీరు.. అంటురోగాల బారిన జనం



**నిర్మల్ బ్యూరో, ఆగస్టు 16,(జనంసాక్షి)**
నిర్మల్ పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తంగా ఉంది. గత మూడు రోజులుగా వర్షాలు కురవడంతో పరిస్థితి మరింత దారుణంగా మారింది. కాలువలు మూసుకుపోయి రోడ్లపై మురికి నీరు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతి వీధి బురదమయమై, చెత్తతో నిండిపోవడంతో వాహనాలు నడపడం కష్టంగా మారింది.ప్రియదర్శిని నగర్,కళనగర్, శాస్త్రినగర్, గొల్లపెట్, శాంతినగర్,మహదేవన్ పూర్, బెస్తవార్ పెట్,బ్రహ్మపురి, కాల్వగడ్డ, బుదవార్ పెట్,తదితర కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో మురికి నీరు రోడ్లపై ప్రవహించి.రోడ్లన్నీ చేరువులు, కుంటలుగా మారాయి.ప్రధాన రహదారి మంచిర్యాల చౌరస్తాలో కొన్నిసార్లు ద్విచక్ర వాహనాలు,కార్లు సైతం నీటమునిగాయి. అదేవిధంగా డాక్టర్స్ లైన్ రోడ్డు పూర్తిగా కల్వర్టు సక్రమంగా లేకపోవడంతో మురికినీరు,వర్షపునీరు తో చెర్వులాగా మారిపోయింది. దింతో ఎందరోమంది ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురైనారు. కొత్త కాలనీల్లో వై ఎస్ ఆర్ నగర్, విశ్వనాథ్పెట్,బెంగాల్ పెట్, మహాలక్ష్మీవాడలో డ్రైనేజీ సరిగా లేకపోవడంతో ఇళ్ల వద్ద మురుగు నీరు చేరిపోతోంది. దుర్వాసనతో ప్రజలు శ్వాస తీసుకోవడానికే ఇబ్బందిపడుతున్నారు. వర్షపు నీరు, మురుగునీరు కలిసిపోవడంతో దోమలు, ఈగలు విపరీతంగా పెరిగి డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి అంతురోగాల ముప్పు పెరిగిందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

పిల్లలు ఇళ్ల నుంచి బయటికి వస్తే మురికి నీటిలోనే నడవాల్సి వస్తోంది. రోజూ పాఠశాలకు వెళ్లడం నరక యాతనగా మారింది, మరోవైపు రోడ్లపై నిలిచిన మురుగు నీటిలో దోమలు గుంపులుగా తిరుగుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రజలు పలుమార్లు ఫిర్యాదులు చేసినా, మున్సిపల్ అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. "రోడ్లపై మురికి నీరు నిలిచి ఉండటం వల్ల గుంతలు కనిపించక పలువురు ద్విచక్ర వాహనదారులు బోల్తాపడ్డ సంఘటనలు చాలఉన్నాయి. నిత్యం రద్దీగా ఉండే గాంధీచౌక్ ప్రాంతంలో రోడ్డు పూర్తిగా గుంతలమయం కావడంతో ప్రజలు నరకయాతన పడుతున్నారు.కాల్వగడ్డ , బ్రహ్మపురి ప్రాంతం గుండా జౌళీనాల ప్రవహిస్తుండడంతో చుట్టు పక్కల నివాసం ఉండే ప్రజలు ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకొని జీవిస్తున్నారు, ప్రతీ సంవత్సరం వర్షాకాలం వచ్చిందంటే అక్కడి ప్రజలు అంతురోగాల బారిన పడుతుంటారు. వర్షం కురిసినప్పుడే అధికారులు పర్యటించి చేతులు దులుపుకుంటారని అక్కడి ప్రజలు వాపోతున్నారు. జౌళి నాల పూడిక పనులు చేపడుతామని ప్రకటన లు చేస్తారే తప్ప పూడిక పనులు చేపట్టడం లేదని అధికారులపై మండిపడుతున్నారు.కల్వర్టులు, నాళాలు, చెరువుల ఆక్రమణల వల్లే నిర్మల్ పట్టణానికి ఈ దుస్థితి నెలకొందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే మేల్కొని చర్యలు తీసుకోవాలని, కాలువల శుభ్రత పనులు వెంటనే చేపట్టాలని అధికారులను కోరుతున్నారు.

# తాలిపేరు ప్రాజెక్టు 6 గేట్లు ఎత్తివేత

తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్టుకు ఆదివారం వరద ఉధృతి పెరగడంతో అప్రమత్తమైన అధికారులు ప్రాజెక్టుకు సంబంధించిన ఆరుగేట్లను మూడు గేట్లు 2 అడుగుల మేర, మూడు గేట్లు 3 అడుగుల మేర ఎత్తి 8651 సెక్కుల నీటిని దిగువకి వదులుతున్నట్లు అధికారులు తెలిపారు.ప్రస్తుతం ప్రాజెక్టు నీటిమట్టం 72.32 మీటర్లు ఉన్నట్లు వెల్లడించారు. తెలంగాణతోపాటు ఛత్తీస్గడ్ రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలకు వరద ఉధృతి స్వల్పంగా పెరిగినట్లు తెలిపారు.

# ఒక్క క్లిక్‌తో భూముల వివరాలు


### అందుబాటులోకి ప్రత్యేక యాప్
### స్థలాల పరిరక్షణకు సాంకేతికత వినియోగం

**హైదరాబాద్ (జనంసాక్షి) :** ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు హైదరాబాద్ రెవెన్యూ అధికారులు సరికొత్త యాప్ రూపొందిస్తున్నారు. జిల్లాలోని భూముల వివరాలు అన్నింటినీ ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ ప్రత్యేక యాప్‌లో నమోదు చేయనుంది. గతంలో ల్యాండ్ బ్యాంక్ అనే యాప్ ఉండేది. కానీ కొత్తగా యాప్‌ను బైజాక్విటీ సొల్యూషన్స్ ప్రతినిధులు రూపొందించారు.రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూములు, ఖాళీ స్థలాలు, ఇతర శాఖలకు కేటాయించిన భూములు, కోర్టు కేసుల్లో ఉన్న భూముల వివరాలను పొందుపరుస్తున్నారు. 16 మండలాల్లోని ప్రభుత్వ భూముల చుట్టూ రెడ్ మార్కులు ఏర్పాటు చేయనున్నారు. కలెక్టర్ కార్యాలయంలో తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లకు రెడ్ మార్కులు, జియో ట్యాగింగ్, యాప్ ప్రత్యేక లక్షణాలను సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రతినిధులు వివరించారు. మొత్తం 20 అంశాలపై అవగాహన కల్పించారు. ఒకటి, రెండు నెలల్లో ఈ యాప్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు.

జియో కార్డినేట్స్ (భౌగోళిక నిర్దేశాంకం) పద్ధతుల ద్వారా భూముల వివరాలు అప్‌లోడ్ చేస్తున్నారు. క్షేత్రస్థాయిలోని, డిజిటల్ మ్యాప్‌లోని కొలతలకు అంగుళం తేడా ఉండదు. కబ్జాకు యత్నిస్తే ఆ చిత్రాలు చట్టపరంగా చర్యలు తీసుకునేందుకు కోర్టుల్లో సాక్ష్యంగా ఉపయోగించి చట్టపరమైన చర్యలు తీసుకుంటారు. ప్రస్తుతం ఈ వ్యవస్థను రెండు, మూడు జిల్లాల్లో చేస్తున్నారు. హైదరాబాద్? జిల్లా యాప్?లో మరిన్ని వివరాలను అదనంగా జోడించనున్నట్లు అధికారులు తెలిపారు. నగరంలో ప్రభుత్వ భూములు వందల ఎకరాలు ఉన్నాయి. వీటిల్లో ఎక్కువ భాగం చట్టపరమైన వివాదాల్లో ఉండగా కొన్నింటిని గతంలో వివిధ విభాగాలు, శాఖలో కొంత భాగాన్ని కేటాయించారు. తహసీల్దార్లు, సిబ్బంది నిరుపయోగంగా ఉన్న భూములు, గృహ సముదాయాలకు వెళ్లి వివరాలను ఆన్?లైన్?లో నమోదు చేస్తున్నారు. వీటితో పాటు ప్రభుత్వ ఖాళీ స్థలాలను కబ్జా చేశారా? వాటిపై కోర్టుల్లో న్యాయ వివాదాలు ఉన్నాయా? వంటి అంశాలను ప్రత్యేకంగా యాప్‌లోనే విడిగా అప్‌లోడ్ చేస్తున్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
18 ఆగస్టు 2025

# సామాజిక పరిణామాలను చిత్రించిన"కాలం తెచ్చిన మార్పు"



సామాజిక జీవితంలోని సమస్యల్ని సంఘర్షణల్ని సమర్థవంతంగా ఆవిష్కరిస్తున్న సాహిత్య ప్రక్రియలలో కథా ప్రక్రియ ప్రధానమైనది. పాఠకుల్ని సూటిగా ఆకర్షించడంలో నైతేనేమీ, సమస్యల్ని విశ్లేషించడంలో నైతేనేమీ, కథా ప్రక్రియ ప్రాచుర్యం పొందింది. ఇవాళ తెలుగులో కవిత్వం తో పాటు సమాంతరంగా అది కొనసాగుతుంది. కవులు గాని రచయితలు గాని ఊసుపోక రచనలు చేసే పరిస్థితులు కూడా లేకపోవడం ఒక కారణమైతే సామాజిక చిత్రపటం సంఘర్షణాత్మకం కావడం మరో కారణం కావచ్చు.

ఈ నేపథ్యంలో కాలానుగుణంగా వస్తున్న సామాజిక పరిణామాల్ని బాధ్యతగల రచయితలు ఎప్పటికప్పుడు విశ్లేషిస్తున్నారు. ప్రముఖ సామాజిక తత్వవేత్త, రచయిత బి.ఎస్.రాములు" కాలం తెచ్చిన మార్పు" పేరుతో 15 కథలతో కూడిన సంపుటిని వెలువరించారు. బి.ఎస్. రాములు గురించి సాహిత్య ప్రపంచానికి పరిచయం చేయాల్సిన అవసరం లేదు ఇప్పటికే ఆయన"పాలు" కథ, " బతుకు పోరు నవల" ద్వారా, అలాగే తెలంగాణ తొలి బీసీ కమిషన్ చైర్మన్ గా సుపరిచితులు. కాగా ఇది రాములు తొలినాటి ఉద్యమ జీవిత ప్రస్థానం నుంచి తాజా పరిస్థితుల వరకు చోటుచేసుకున్న పరిణామాలను శాస్త్రీయంగా విశ్లేషించారు. కాలం తెచ్చిన మార్పు అన్న ప్రధాన కథ పేరు నే తన సంపుటికి పెట్టారు. ఇందులో భూమయ్య తన తమ్ముని కొడుకు అయినా మార్కండేయులుతో గ్రామీణ జీవితంలో ముఖ్యంగా వ్యవసాయ రంగం, గ్రామీణ చేతివృత్తులు అంతరించడం మూలాన సామాజిక పరిణామాలు వ్యవస్థలోనే కాదు అందుకు పునాది అయినా కుటుంబంలోనూ వాటి ప్రభావం ఎలా ఉన్నదో ఈ కథ ద్వారా రచయిత స్పష్టంగా వివరించారు. చిన్నతనంలో తన ఎదుగుదలకు కారణమైన పెదనాయన భూమయ్యకు తన సమస్యను చెప్పుకునేందుకు వచ్చిన మార్కండేయులుతో భూమయ్య తన పరిస్థితి అంతా వివరించగా చివర్లో తన భార్య మూలాన తనెంత వ్యక్తిత్వం లేకుండా బ్రతికే పరిస్థితులు ఏర్పడ్డాయో మార్కండేయులు వివరించబోతే అందుకు జవాబుగా భూమయ్య నేను మాత్రం మీ పెద్దమ్మ గయ్యాలి తనం భరించలేదా అని వీటన్నింటినీ సామాజికంగా గుర్తించి సర్దుకు పోవడమే పరిష్కారమని చెబుతూ"ఆడోళ్లకు ఇష్టం లేకపోతే ఇంట్లో ఏది సాగది. ఇంటి పేరు ఒక్కటే మనది. మిగిలినదంతా ఆళ్ల రాజ్యమే రా"... మనం పేరుకే మొగోళ్ళం రా అంటూ తన జీవిత సత్యాన్ని బోధిస్తాడు. అలాగే పెన్షనర్‌బిహోం మేకర్ అనే కథలో డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ గా రిటైర్ అయిన రామచంద్రయ్య మాధవి భార్యాభర్తలు. ఏండ్ల కొద్దీ ఇంట్లో ఏ స్వేచ్ఛ స్వాతంత్ర్యాలు లేకుండా జీతభత్యాలు లేకుండా పిల్లల్ని కని సాకి సంరక్షించి వాళ్లను ఓ స్థితికి తీసుకొని రావడం లోనైతే నేమి, భర్త ఉద్యోగ జీవితం సాఫీగా నడవడానికి అతనికి అవసరమైన పరిచర్యల్ని చేయడంలో అయితే నేమి జీవితాంతం ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా సేవలందించడం వల్ల తనకు ఎలాంటి ఆర్థికపరమైన వెన్నుదన్నులేదని కాబట్టి ఇంతకాలం కుటుంబానికి సేవ చేసినందుకు గాను తనకు పెన్షన్ కావాలని హోం మేకర్ బాధ్యతల నుంచి వి.ఆర్.ఎస్ తీసుకుంటానంటుంది. కన్న తల్లిదండ్రులని వృద్ధాప్య దశలో నిర్దాక్షిణ్యంగా కొంతమంది రోడ్డుపైన వదిలేస్తూ మరి కొంతమంది వృద్ధాశ్రమాలలో చేర్పిస్తున్న తరుణంలో ఈ కథను సహానుభూతితో అర్థం చేసుకోవలసిన అన్వయించుకోవలసిన అవసరం ఉంది. దురదృష్టవశాత్తు 2004 తర్వాత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగులకు పెన్షన్ సౌకర్యాన్ని తొలగించాయి. అమెరికాను గుడ్డిగా అనుసరిస్తున్న ప్రభుత్వాలు అక్కడ సీనియర్ సిటిజన్స్‌ను ఎలా పట్టించుకుంటున్నారో అన్న విషయాన్ని గమనించకుండా అక్కడ పెన్షన్ లేదు కాబట్టి ఇక్కడ వద్దనుకొని ఆ సదుపాయాన్ని తొలగించింది. కాబట్టే మాధవి పరిస్థితి చివరకు ఉద్యోగస్తుడైన రామచంద్రయ్యకు దాపురించింది. ముఖ్యంగా శ్రమజీవుల్ని సంఘటితం చేసే గొప్ప కథ "పాలమూరు లేబరు తిరుగుబాటు"కథ. కరీంనగర్ జిల్లాలో శ్రీరాంసాగర్ కాలువ తవ్వక పనులలో కూలీలతో చేయించే వెట్టిచాకిరి కాంట్రాక్ట్ దారుల వాళ్ల తాబేదారుల పెద్ద మేస్త్రీల దోపిడీ ఎలా ఉండేదో ఈ కథ కళ్లకు కట్టిస్తుంది. తమ తప్పును సమర్థించుకోవడానికి ఆర్టీసీ స్టాఫ్, డాక్టర్, పండ్ల దుకాణాల వాళ్లు తమ విధులలో ఎలా లాలూచీ పడుతున్నారో ఆవిష్కరించిన కథ "ఎవరికి వారే". కాళోజి అన్నట్లు చెల్లినోనికి నేరం చెల్లుబాటు అవుతుంటే చెల్లనోనికి నేరం చేయడం తప్పక ఏర్పడితే ఈ సమాజం నేరాల పుట్టయిపోదా అన్న భావనను గట్టిగా ధ్రువీకరిస్తున్న కథ ఇది.

ఇలా వర్ధమాన దేశాలను అమెరికా సామ్రాజ్యవాదం, ప్రపంచీకరణ ప్రభావితం చేస్తున్న తరుణంలో సగటు కుటుంబ జీవితంలో సామాజిక జీవితంలోనూ చోటు చేసుకున్న పరిణామాలను వివరించిన కథల సంపుటిగా "కాలం తెచ్చిన మార్పు"ను గుర్తించవచ్చును. సంస్కరణలను మానవీయ కోణంలో తేవాలని సామాజిక విశ్లేషకులు చెబుతున్నారు. కాగా ఉద్యమ శీలి, తత్వవేత్త అయిన బిఎస్ రాములు బహుశా ఆ తపనతోనే ఈ సంపుటిని వెలువరించారు. అందుకు బి.ఎస్. ఆర్ అభినందనీయులు.



డాక్టర్ శంకరమంచి శ్యాంప్రసాద్
99 891 48 305

# మహిళా గ్రంథాలయ పాలకులు
# సమస్యలు, సవాళ్లు

గ్రంథాలయ రంగంలో మహిళలు చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోయే విధంగా ఉన్నప్పటికీ, ఈ తరం వారి కృషిని మరచిపోకూడదు. ఈ రంగంలో అనేక మంది మహిళలు తమ అసాధారణ నాయకత్వం, సామాజిక సంస్కరణల ద్వారా విద్యా, వైజ్ఞానిక రంగాల్లో చెరగని ముద్ర వేశారు. వారి సేవలు ప్రస్తుత తరం గ్రంథాలయ పాలకులకు, ముఖ్యంగా మహిళలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయి. అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన మహిళా గ్రంథాలయ నిర్వాహకులు, భారతదేశంలో స్థానిక స్థాయిలో పనిచేసిన వారు ఈ రంగంలో అనేక సవాళ్లను ఎదుర్కొని విజయం సాధించారు. వారి కృషి, సమస్యలు, సవాళ్లను అర్థం చేసుకోవడం ద్వారా ఈ రంగంలో మరింత అభివృద్ధికి దోహదపడవచ్చు. అంతర్జాతీయంగా, లూయిసా ఎఫ్. గుడ్విన్ (1832/33-1911) అమెరికాలో తొలి మహిళా రాష్ట్ర గ్రంథాలయ నిర్వాహకురాలిగా 1865-1867 మధ్య మిన్నెసోటాలో పనిచేసి, గ్రంథాలయ రంగంలో మహిళలకు కొత్త అవకాశాలను తెరిచారు. థెరిసా వెస్ట్ ఎల్మెండోర్ఫ్ (1855-1932) అమెరికన్ లైబ్రరీ అసోసియేషన్ (ఏఎల్ఏ) తొలి మహిళా అధ్యక్షురాలిగా (1911) సేవలందించి, మిల్వాకీ పబ్లిక్ లైబ్రరీలో డిప్యూటీ లైబ్రేరియన్‌గా, ఆ తర్వాత లైబ్రేరియన్‌గా పనిచేసి, పెద్ద నగరంలో గ్రంథాలయాన్ని నడిపిన తొలి మహిళగా చరిత్ర సృష్టించారు. పురా బెల్ప్రే (1899-1982) న్యూయార్క్ సిటీలో తొలి ప్యూర్టో రికన్ లైబ్రేరియన్‌గా, స్పానిష్ భాషలో పిల్లల కథలు చెప్పడం, స్పానిష్ భాషా పుస్తకాలను ప్రచారం చేయడం ద్వారా గ్రంథాలయ సేవలను విస్తరించారు. ఆమె పేరు మీద పురా బెల్ప్రే అవార్డు లాటినో రచయితలకు, ఇలస్ట్రేటర్లకు అందజేయబడుతోంది. క్లారా స్టాంటన్ జోన్స్ (1913-2012) డెట్రాయిట్ పబ్లిక్ లైబ్రరీ డైరెక్టర్‌గా పనిచేసిన తొలి ఆఫ్రికన్ అమెరికన్ మహిళగా, 1977లో ఏఎల్ఏ తొలి ఆఫ్రికన్ అమెరికన్ అధ్యక్షురాలిగా ఎన్నికైనారు. కార్లా హేడెన్ (1952) 2016లో లైబ్రరీ ఆఫ్ కాంగ్రెస్‌కు తొలి మహిళా, ఆఫ్రికన్ అమెరికన్ లైబ్రేరియన్‌గా సేవలందించి, గ్రంథాలయాలను అందరికీ అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేశారు. అడిలైడ్ హాస్ (1868-1953) ప్రభుత్వ పత్రాల వర్గీకరణ వ్యవస్థను రూపొందించి, మహిళల ఓటు హక్కు, సమాన వేతనం కోసం పోరాడారు, అయితే ఆమె నిబద్ధత వల్ల ఉద్యోగం కోల్పోయారు. బెట్టీ మోయ్స్ (1928-2002) ప్రపంచ ప్రఖ్యాత లా లైబ్రేరియన్‌గా, బెట్టీ మోయ్స్ క్లాసిఫికేషన్ సిస్టమ్‌ను రూపొందించి, చట్ట గ్రంథాలయాల కోసం విస్తృతంగా ఉపయోగించే వ్యవస్థను అందించారు.

భారతదేశంలో గ్రంథాలయ రంగంలో మహిళల కృషి గురించి నిర్దిష్ట సమాచారం పరిమితంగా ఉన్నప్పటికీ, కొందరు ప్రముఖ మహిళలు ఈ రంగంలో చెరగని ముద్ర వేశారు. శాంతి రంగనాథన్, భారత గ్రంథాలయ శాస్త్ర పితామహుడు డాక్టర్ ఎస్.ఆర్. రంగనాథన్ శ్రీమతిగా, గ్రంథాలయ విద్య, సాహిత్య సేకరణలో కీలక పాత్ర పోషించారు. డాక్టర్ కల్పనా దాస్‌గుప్తా (1911-1995) కలకత్తాలోని నేషనల్ లైబ్రరీ ఆఫ్ ఇండియాలో గ్రంథాలయ సేవల విస్తరణకు, ముఖ్యంగా పిల్లల గ్రంథాలయ సేవలకు గణనీయంగా కృషి చేశారు. సుశీలా బహన్ గ్రామీణ గ్రంథాలయాల ద్వారా విద్యా విస్తరణకు పాటుపడ్డారు, అయితే వారి సేవలు తరచూ గుర్తింపు లేకుండా మిగిలిపోయాయి.

గ్రంథాలయ రంగంలో మహిళలు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారు. పాశ్చాత్య దేశాల్లో ఈ రంగం మహిళల ఆధిపత్యంలో ఉన్నప్పటికీ (అమెరికాలో 82.8% గ్రంథాలయ నిర్వాహకులు మహిళలే), సమాన వేతనం, నాయకత్వ అవకాశాలు, వృత్తి గుర్తింపు, అవార్డులు, రివార్డులలో సమస్యలు ఎదురవుతున్నాయి. భారతదేశంలో ఈ సవాళ్లు మరింత తీవ్రంగా ఉన్నాయి. పురుషులతో సమానంగా విద్య, పరిశోధన రంగాల్లో ప్రతిభ కనబర్చినప్పటికీ, జిల్లా, మండల, గ్రామీణ స్థాయిలో వనరుల కొరత, అదనపు బాధ్యతలు మహిళా గ్రంథాలయ పాలకులను ఇబ్బంది పెడుతున్నాయి. వారి విద్యా, పరిశోధన, సామాజిక సేవలు, సాంస్కృతిక వారసత్వ సంరక్షణలో చేసిన కృషి తరచూ ఆశించిన స్థాయిలో గుర్తింపు పొందడం లేదు. ఈ గుర్తింపు కోసం ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలి. సామాజిక గౌరవం, గుర్తింపు లభిస్తే, మహిళల వృత్తి నిబద్ధత, అంకితభావం మరింత పెరుగుతుంది. భారతదేశంలో గ్రంథాలయ రంగంలో మహిళల సేవల గురించి సమాచారం పరిమితంగా ఉన్నప్పటికీ, స్థానిక స్థాయిలో వారు చేసిన కృషి గుర్తించదగినది. డాక్టర్ ఎస్.ఆర్. రంగనాథన్ జయంతి లేదా టీచర్స్ డే (సెప్టెంబర్ 5) సందర్భంగా మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో వారి సేవలను గుర్తించి, గౌరవించడం ద్వారా ఈ రంగంలో మహిళలకు స్ఫూర్తిని, ప్రోత్సాహాన్ని అందించవచ్చు. గ్రంథాలయ రంగంలో మహిళల సేవలు, సవాళ్లు, విజయాలను గుర్తించడం ద్వారా ఈ రంగం మరింత సమృద్ధమవుతుంది.



డాక్టర్ రాధికారాణి,
అసిస్టెంట్ ప్రొఫెసర్, హెచ్.ఓ.డీ.
లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్,
కాకతీయ యూనివర్సిటీ, వరంగల్.
8074317172.

# లైబ్రరీ మేనేజ్‌మెంట్: ఆధునిక ఫంక్షన్లు



లైబ్రరీలు మన సమాజంలో జ్ఞానాన్ని సంరక్షించి, పంచే ముఖ్యమైన సంస్థలు. ఒకప్పుడు లైబ్రరీలో పుస్తకాలు మాత్రమే ఉండేవి. కానీ ఇప్పుడు డిజిటల్ యుగంలో లైబ్రరీలు మారిపోయాయి. ఇంటర్నెట్, ఈ-బుక్స్, మల్టీమీడియా కంటెంట్‌తో లైబ్రరీ మేనేజ్‌మెంట్ మరింత సంక్లిష్టమైంది. ఈ వ్యాసంలో, లైబ్రరీ మేనేజ్‌మెంట్‌లోని ప్రధాన ఫంక్షన్లు అయిన ప్లానింగ్, ఆర్గనైజింగ్, స్టాఫింగ్, డైరెక్టింగ్, కంట్రో లింగ్ మొదలైన వాటిని తెలుసుకుందాం. ఇవి లైబ్రరీలను సమర్థ వంతంగా నడిపేందుకు అవసరం. మనం ఇప్పుడు ఈ ఫంక్షన్లను ఒక్కొక్కటిగా చూద్దాం.

ప్లానింగ్ లేదా ప్రణాళిక: (కార్యక్రమాలను క్రమబద్ధమైన రీతిలో రూపకల్పన చేయడం). ఇది లైబ్రరీ మేనేజ్‌మెంట్‌లో మూలస్తంభం. లైబ్రరీ మేనేజర్ ముందుగా లక్ష్యాలను నిర్ధారిస్తాడు. ఉదాహరణకు, ఒక పాఠశాల లైబ్రరీలో విద్యార్థులకు ఎలాంటి పుస్తకాలు అవసరం? డిజిటల్ రిసోర్సెస్‌ను ఎలా అందుబాటులో ఉంచాలి? బడ్జెట్ ఎంత? ఈ ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చి, దీర్ఘకాలిక, స్వల్పకాలిక ప్లాన్‌లు రూపొందిస్తారు. ఆధునిక లైబ్రరీలలో ప్లానింగ్‌లో సాఫ్ట్‌వేర్ టూల్స్ ఉపయోగిస్తారు. ఉదాహరణకు, ఇంటిగ్రేటెడ్ లైబ్రరీ సిస్టమ్ (ఐఎల్ఎస్) సాఫ్ట్‌వేర్‌తో పుస్తకాల కొనుగోలు, యూజర్ నీడ్స్ అనాలిసిస్ చేస్తారు. ఒక పబ్లిక్ లైబ్రరీలో, కమ్యూనిటీ ఈవెంట్స్, వర్క్‌షాప్‌లు ప్లాన్ చేస్తారు. ఇది లైబ్రరీని జ్ఞాన కేంద్రంగా మారుస్తుంది. ప్లానింగ్ లేకపోతే లైబ్రరీ అస్తవ్యస్తంగా మారుతుంది. కాబట్టి నిర్ధిష్ట మైన ప్రణాళిక అనేది మొదటి అడుగు.

**ఆర్గనైజేషన్ (సంస్థాగతం చేయడం):**

ఇక్కడ లైబ్రరీ రిసోర్సెస్‌ను సమర్థవంతంగా అమర్చడం జరుగుతుంది. పుస్తకాలు, జర్నల్స్, డిజిటల్ ఫైల్స్‌ను క్యాటలాగ్ చేయడం, షెల్ఫ్‌లలో అమర్చడం ఇందులో భాగం. డ్యూయ్ డెసిమల్ క్లాసిఫికేషన్ (డీడీసీ) లేదా లైబ్రరీ ఆఫ్ కాంగ్రెస్ సిస్టమ్ వంటి మెథడ్స్ ఉపయోగిస్తారు. డిజిటల్ లైబ్రరీలలో మెటాడేటా మేనేజ్‌మెంట్ ముఖ్యం. ప్రతి ఫైల్‌కు ట్యాగ్స్, కీవర్డ్స్ జత చేస్తారు. స్టాఫ్‌ను డిపార్ట్‌మెంట్లుగా విభజిస్తారు - ఒకరు సర్క్యులేషన్ డెస్క్ చూస్తారు. మరొకరు రెఫరెన్స్ సెక్షన్. ఆర్గనైజింగ్ ద్వారా యూజర్లు సులభంగా రిసోర్సెస్‌ను కనుగొనగలరు. ఉదాహరణకు, ఒక యూనివర్సిటీ లైబ్రరీలో సబ్జెక్ట్ వారీగా ఆర్గనైజ్ చేస్తే...విద్యార్థులు సమయం వృథా కాదు. ఇది లైబ్రరీని వినియోగదారులకు అనుకూలంగా చేస్తుంది.

**స్టాఫింగ్ (సిబ్బంది నియామకం):**

లైబ్రరీలు మనుషులతోనే నడుస్తాయి. మేనేజర్ సరైన సిబ్బందిని ఎంపిక చేయాలి. లైబ్రేరియన్లు, అసిస్టెంట్లు, టెక్నికల్ స్టాఫ్ - వీరంతా లైబ్రరీ సైన్స్ డిగ్రీ లేదా సంబంధిత అనుభవం కలిగి ఉండాలి. డిజిటల్ యుగంలో, ఐటీ నిపుణులు అవసరం. వారు సాఫ్ట్‌వేర్ మేనేజ్ చేస్తారు. ట్రైనింగ్ కూడా ఇవ్వటం ముఖ్యం. కొత్త స్టాఫ్‌కు క్యాటలాగింగ్, కస్టమర్ సర్వీస్ విషయాల్లో ట్రైనింగ్ ఇవ్వాలి. మోటివేషన్ కోసం ప్రమోషన్లు, ఇన్సెంటివ్స్ ఇస్తారు. ఉదాహరణకు, ఒక పబ్లిక్ లైబ్రరీలో స్టాఫ్ యూజర్లతో మాట్లాడి సహాయం చేయాలి. కాబట్టి కమ్యూనికేషన్ స్కిల్స్ ఉన్నవారిని ఎంచుకుంటారు. స్టాఫింగ్ సరిగ్గా లేకుండా లైబ్రరీ సేవలు తగ్గిపోతాయి.

**డైరెక్టింగ్ (నిర్దేశనం):**

ఇది స్టాఫ్‌ను గైడ్ చేయడం, మోటివేట్ చేయడం. మేనేజర్ లీడర్‌గా వ్యవహరిస్తాడు. కమ్యూనికేషన్ ముఖ్యం. మీటింగ్‌లలో ప్లాన్‌లు చర్చిస్తారు. డెలిగేషన్ ద్వారా టాస్క్‌లు అప్పగిస్తారు. ఉదాహరణకు, ఒక లైబ్రరీలో ఈవెంట్ ఆర్గనైజ్ చేయాలంటే, స్టాఫ్‌కు బాధ్యతలు విభజిస్తారు. మోటివేషన్ కోసం ప్రశంసలు, రివార్డ్స్ ఇస్తారు. డిజిటల్ టూల్స్‌తో డైరెక్టింగ్ సులభమవుతుంది. ఈమెయిల్, స్లాక్ వంటివి ఉపయోగిస్తారు. ఇది టీమ్‌వర్క్‌ను పెంచుతుంది.


**కంట్రోలింగ్ (నియంత్రణ):**

ఇది ప్లాన్‌లు సరిగ్గా అమలవుతున్నాయా లేదా అని చెక్ చేయడం. పెర్ఫార్మెన్స్ మెట్రిక్స్... ఎన్ని పుస్తకాలు ఇష్యూ అయ్యాయి. యూజర్స్ సంఖ్య ఎంత? వారికి సేవలు అందేలా చూస్తారు. ఆడిట్స్, ఫీడ్ బ్యాక్ సర్వేలు చేస్తారు. సమస్యలు వస్తే కరెక్టివ్ యాక్షన్ తీసుకుంటారు. ఉదాహరణకు, పుస్తకాలు దొంగిలించబడితే (ఆర్.ఎఫ్.ఐ.డీ.) ట్యాగ్స్ ఇన్‌స్టాల్ చేస్తారు. డిజిటల్ లైబ్రరీలలో సైబర్ సెక్యూరిటీ కంట్రోల్ ముఖ్యం. ఈ ఫంక్షన్లు లైబ్రరీలను డైనమిక్‌గా మారుస్తాయి. ఆధునిక సమాజంలో లైబ్రరీలు జ్ఞాన హబ్‌లుగా మారాలి. మేనేజర్లు ఈ ఫంక్షన్లను సమర్థవంతంగా అమలు చేస్తే, లైబ్రరీలు మరింత ప్రభావవంతమవుతాయి.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

## మరో ప్రపంచం!



'వాళ్లకు'నిప్పునింగినీరు
నేలగాలితోపాటు సైన్స్
కూడా వ్యాపార వస్తువే!
జనం'కష్టం'తో లాభాలు!
చూసారా వాళ్ల తెలివి!
మనంకలవకుండాఎన్నో
ఆంక్షలు వివక్షల సృష్టి!
కులాలు మతాలు
మూఢత్వం కోకొల్లలు!
విభజించి పాలించటం!
కాళ్ళు చేతులు తప్ప
పైసా పెట్టుబడిలేని
బికారిగాళ్ళను చేసారు!
కూలీలుగా మార్చారు!
దేవుణ్ణినమ్ముకోమన్నారు
ఇదేమిలోకందోపిడిలోకం
మార్క్సుఅందుకే-ప్రపంచ
కార్మికుల్నిఏకంకమ్మంటే
మనందోపిడీదారుల
వ్యూహంలోఒంటరులం!
వాళ్లలాభాలకోసంవాళ్లు
ఒకటౌతున్నారు -మనం
మన బతుకుతెరువుకై
ఒకటికాలేము!మనకు
కులాలు ముఖ్యం కదా!
వాళ్లవ్యూహంనుండి బైట
పడండి!అదేపరిష్కారం!
ఐక్యంగాపదండిముందుక
అరుణపతాకం ఎగరేద్దాం
మరోప్రపంచంనిర్మిద్దాం!

-తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్

## ఆలోచన ఆయుధం



ఆలోచన మనిషికి
దేవుడిచ్చిన వరం
ఆలోచన విజయాన్ని
నిర్ణయించే శక్తి

ఆలోచన వ్యక్తిత్వాన్ని
విలువల్ని నిర్ణయిస్తుంది
ఆలోచన ఓర్పును తీర్పును
వివేకాన్ని విజ్ఞానాన్ని విశ్లేషణ
విమర్శన శక్తికి ఆయువు పట్టు

ఆలోచనే ఆవిష్కరణలకు
ఆలంభన సకారాత్మక
ఆలోచనలు ప్రగతికి దిక్సూచి

ఆలోచన అమృతం లాంటిది
ఆలోచన మనసులో పుట్టి
మహాఅద్భుతాలు సృష్టిస్తుంది .

ఆలోచన మనిషికున్న
గొప్ప ఆయుధం
ప్రతి కూల ఆలోచనలతో
జీవితం వినాశనం

ఆరోగ్యకరమైన ఆలోచనలతో
జీవితం ఆనందం
మనసుపెట్టి చేసే ఆలోచన
మానవ మనుగడకు
తొలి మెట్టు

ఆలోచనలే సగం
సమస్యలకు కారణం
పరుల కొరకు పాటు పడే
ఆలోచనలు
సమాజానికి వెలుగు దివ్వెలు

ఆలోచనలే అభివృద్ధికి దిశ దశ

పాజిటివ్ ఆలోచనలు
ఆప్యాయతకు
మేల్కొలుపు
ఆత్మీయ ఆలోచనలు
మానవీయ విలువలకు పరిపుష్టి
అందరితో ఆలోచనలు పంచుకో
అందరిలో కలిసి పో
సదాలోచనల దారంతో
ప్రేమానురాగల మాలలు
అల్లి వసుదైక కుటుంభాన్ని
నిర్మిద్దాం
నిర్మాణాత్మక ఆలోచనతో
బంగారు భవితకు బాట వేద్దాం
భవ్య దివ్య భారత్ ను నిర్మిద్దాం

నేదునూరి కనకయ్య
అధ్యక్షులు
తెలంగాణా ఎకనామిక్ ఫోరం
తెలంగాణ ఎడ్యుకేషన్ ఫోరం
హైదరాబాద్, 9440245771


## ఒక లైక్ కొట్టు గురూ..!

పిట్టగోడ దూకి గట్టు ఎక్కేసా
రైలు పట్టాలపైన పల్టీలు కొట్టేసా
కెమెరా లెన్స్ కు చిక్కకుండా
గిరికీలు కొట్టి గెంతులు వేసేసా
పిల్ల జంతువులతో పిచ్చాపాటీ
స్టార్ హెూటల్ లో విందు చేసా
అన్నింటినీ ఫోటోలతో అలరించి
ఆల్బమ్ ను ఫేస్బుక్ లో తగలేసా
లైక్ చేసి లైక్ కొట్టు గురూ
లాఫింగ్ తో మమేకమైపోతూ
జూమ్ చేసి మరీ చూపించేసా
విన్యాసాలతో వినూత్న రీతిలో
నచ్చినవన్నీ అచ్చంగా చేసేసా
మ్యాజిక్ ల ట్రిక్కులన్నీ చేసి
బొమ్మకు ప్రాణం పోసి ఆడించేసా
నిప్పురవ్వలతో ఎర్రటి ముగ్గేసి
చూపరులకు కనువిందు చేసా
అన్నింటినీ యూట్యూబ్ లో తోచి
లైక్ ల కోసం వాకిట్లో కాపు కాచా
చిన్న చిన్న వీడియోలను
మిక్సీలో బాగా కలియబెట్టి
ఉప్పు కారం అంటించి వదిలేసా
పులితో సెల్ఫీలు దిగి
దున్నతో యుద్ధానికి సై అనేసా
చిక్కిన వాటితో నచ్చినవన్నీ చేసా
ప్రాణం విలువ తెలిసొచ్చినాక
సందేశం ఇచ్చే చక్కటి వీడియోలతో
సమాజానికి పరోక్ష సేవ చేస్తున్నా
ఒక లైక్ కొట్టు గురూ..!

- నరెద్దుల రాజారెడ్డి
సెల్ : 9666016636

# విరబూసిన బతుకు చెట్టు

(బిఎస్ రాములు 75 - అమృతోత్సవం)



భూమ్మీద పుట్టిన మనిషి వ్యక్తిత్వ నిర్మాణంలో ఎన్నో కారకాలు పనిచేస్తాయి. కుటుంబం, కులం, పరిసరాలు, చదువు, సమాజం అన్నీ శిల్పిగా మారుతాయి. ఎంతటి వారైనా అలా తీర్చిదిద్దిన ప్రభావ చట్రంలో జీవితం గడపవలసిందే. కనబడే గుండె, మెదడు కన్నా కనబడని మనసు మనిషిని ఎక్కువగా కదిలిస్తుంది. అయితే ఒక మనిషి ఉన్నతికి కృషి, ఆత్మ విశ్వాసం, కసి బాగా తోడ్పడతాయి. అవి తగిన పాళ్లలో ఉన్నవాళ్లు ఇక్కట్లను దాటుకుంటూ, విజయపరంపరలో ముందు వరుసలోకి చేరుకుంటారు. బిఎస్ రాములు తన రచనల్లో చెప్పుకున్న విషయాల ఆధారంగా ఆ రెండు అతనిపై మెండుగా ప్రభావితం చేశాయనవచ్చు. ఒక సాధారణ కుటుంబం లోంచి ఆయన ఎదిగివచ్చిన క్రమం దీనిని నిరూపిస్తోంది.

ఈ ఆగస్టు 23 నాటికి 76 ఏళ్లు నిండిన వయసుతో ఘనంగా, తనదైన అనుభవాల విజయాల తోడుగా జన్మదినం జరుపుకుంటున్న బిఎస్ రాములు జీవితంలోకి తొంగి చూస్తే బాల్యం, యుక్త వయసు ఆయన్ని ఎలా రాచి రంపాన పెట్టాయో తెలుస్తుంది. ఆనాటి జగిత్యాలలో టాకా (రేషన్ షాప్) పక్క చిన్న సందులో కత్తిరించిన బీడీ ఆకు కుప్పల మధ్య ఓ ఇల్లు. సందు చివరలో ఎడమ వైపు ఓ పాత ఇంటి వాకిట్లో ఏదో పనిలో ఉన్న తల్లీ కొడుకులు.

కులం ఒక్కటైనా అందులోనూ ఉన్నవారు, లేనివారు అనే వివక్ష తాను అనుభవించానని ఆయన ఓ చోట పేర్కొన్నారు. ఏదో శుభకార్యానికి, పిలిచిన పేరంటానికి వెళితే పంక్తిలోను, వడ్డనలోను తక్కువ చేశారని రాశారు. అందరికన్నా ఎత్తుగా ఎదగాలనే, తల ఎత్తుకొని బతకాలనే సంకల్పానికి ఇవన్నీ పునాదులే. అందరిని దాటుకుంటూ వెళ్ళడానికి ఆత్మ విశ్వాసమే అసలైన ఆయుధం. గోడ దూకితే దెబ్బ తాకుతుందా అనే సంశయం పక్కన పెట్టి, దూకాక చూద్దాం అనేదే ఆత్మవిశ్వాసం. ఎవరి కన్నా నేనేం తక్కువ అనే భావన బిఎస్ రాములును వెంటాడి, వేధించి ఆయన్ని ఉన్నత స్థాయికి చేర్చింది.

**చిన్ననాటి జీవితం**

బిఎస్ రాములు 23 ఆగస్ట్, 1949 లో ఆనాటి కరీంనగర్ జిల్లా జగిత్యాలలో చేనేత కుటుంబంలో జన్మించారు. నాన్న మిట్టపల్లి నారాయణ, అమ్మ బేతి లక్ష్మిరాజు. నాన్న చేనేత కార్మికుడు. బొంబాయిలో బట్టల మిల్లు కార్మికుడుగా పనిచేశారు. ఆ రోజుల్లో జగిత్యాల, సిరిసిల్ల, కోరుట్ల ప్రాంతాల్లోని పద్మశాలి ఇంటి పెద్దలు జీవితమంతా కుటుంబాలకు దూరంగా బొంబాయి, భీవండిలోనే గడిచేది. అక్కడి అరకొర సదుపాయాలు, వాతావరణ పరిస్థితులు, ఆహారం పడక నారాయణ ఆరోగ్యం చెడింది. వైద్య సదుపాయాలు లభించక, కుటుంబానికి దూరంగా ఉండలేక ఆయన జగిత్యాలకు తిరిగి వచ్చారు. ఆరోగ్యం కుదుటపడక తండ్రి చనిపోయే నాటికి బిఎస్‌కు ఆరేళ్లు. తమ్ముడు ఇంకా తల్లి చంకలో బిడ్డనే. బట్టల మిల్లు దుమ్ముకు రోగాల బారిన పడి, ఇంటికి తిరిగొచ్చినా ఆర్థిక సమస్యలతో, ఆరోగ్యం కుదుటపడక అర్థాంతరంగా కుటుంబాన్ని ఇలా ఏకాకి చేసిన వారెందరో ఉన్నారు.

భర్త ఎడబాటును గుండెల్లో అదుముకుని లక్ష్మీరాజు బీడీలు చేసి ముగ్గురు కొడుకులను పెంచి పెద్ద చేసింది. తల్లి తండ్రి, తోడబుట్టినవారి బలగం ఉండడం వల్ల ఆ తల్లికి కొంత ఆసరా ఉండేది. బడిలో సారు దెబ్బలకు తట్టుకోలేక పెద్ద కొడుకు రాజనర్సయ్య చదువు మానేశాడు. అప్పుడాయనను తల్లి కిరాణా షాపులో జీతం ఉంచింది. తొమ్మిదేండ్ల వయసు పిల్లవాడు కావడంవల్ల షాపులో పని వయసుకు, శక్తికి మించిన భారమైంది. ఆ పని తనవల్ల కాదని చెబితే ఇంట్లో అందరూ తిడుతుంటే, కొడుతుంటే భరించలేకపోయాడు. దేవునికోసం ముడుపు కట్టిన మట్టి గురిగి పగులగొట్టి ఆ డబ్బులతో బొంబాయి పారిపోయాడు. చేతికందాల్సిన కొడుకు అలా జారిపోయాడు.

బిఎస్ రాములుకు మాత్రం చిన్నప్పటి నుండీ చదువుపట్ల శ్రద్ధాసక్తులు మెండు. అన్న రాజనర్సయ్య ఉపాధ్యాయుల పట్ల ఉన్న భయంతో తమ్ముడిని కూడా బడికి వెళ్ళొద్దనేవాడు. బిఎస్ విద్యాభ్యాసం సాతాని అయ్యోరు పంతులు దగ్గర బాలశిక్షతో మొదలయింది. ఐదవ తరగతి వరకు మర్కజి ప్రైమరీ స్కూల్లో చదివారు. తరువాత మల్టీ పర్పస్ హైస్కూల్‌లో ఆరవ తరగతిలో చేరారు. ఆ పాఠశాలలో 12వ తరగతి వరకు ఉండేది. ఆ రోజుల్లో 9వ తరగతిలో ఎక్కువ మార్కులు వచ్చినవారిని 10వ తరగతి ఆప్షనల్స్‌లో ఎమ్‌పిసి, బైపిసి గ్రూపులలో చేర్చేవారు. తక్కువ మార్కులు వచ్చినవారిని ఆర్ట్స్ గ్రూపులో పెట్టేవారు. సైన్స్ ల్యాబ్ ఫీజు 15 రూపాయలు కట్టాలి. డబ్బులు అడిగితే అమ్మ చదువు బంద్ చేయుమన్నది. దాంతో సైన్స్‌కు బదులు ఆర్ట్ లో చేరక తప్పలేదు. 1967 మార్చిలో బిఎస్ 12వ తరగతిలో ప్రథమశ్రేణిలో పాసయ్యారు.

అప్పుడు జగిత్యాలలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ కార్యకలాపాలు జోరుగా సాగేవి. దానిని శాఖ అని పిలిచేవారు. ఆ రోజుల్లో ఆరెస్సెస్ పట్టణ మధ్యతరగతి యువతను చాలా ప్రభావితం చేసింది. గాలికి తిరగకుండా పద్దతిగా ఉంటారనే ఉద్దేశ్యంతో చాలా మంది తమ పిల్లలను శాఖ కవాతుకు పంపేవారు. బిఎస్ ఇంటిముందే ఆర్ఎస్ఎస్ వారి శాఖ నడిచేది. 9వ తరగతి నుండి ఆయన శాఖకు ఆకర్షితులయ్యారు. శాఖలో శిక్షణ పొందిన గురువులుగా చెంచు లక్ష్మయ్య, శ్రీధర్‌జీ, కళ్ళెపు విద్యాసాగర్‌జీ మొదలైన వాళ్ళు ఇతర ప్రాంతాల నుండి వచ్చి శాఖను నిర్వహించేవారు. ఇళ్లు తిరుగుతూ పిల్లలను చేర్చమని అడిగేవారు. అలా చేరిన బి ఎస్ రాములు తానే కాకుండా మిత్రులను కూడా శాఖలోకి రప్పించేవారు. అలా గుర్తింపు పొంది 1967 నుండి 1970 దాకా స్థానికంగా ఆరెస్సెస్ ముఖ్య శిక్షక్‌గా శాఖను నడిపారు. ధర్మపురిలో కూడా 1972దాకా శాఖను నడిపారు. మతం కన్నా దేశభక్తి తనను ఆర్ ఎస్ ఎస్ వైపు లాగిందని ఆయన ఇప్పటి అభిప్రాయం. అయిదేళ్ల పాటు ఆర్ ఎస్ ఎస్ ముఖ్య శిక్షక్ గా పనిచేసి 50 సంవత్సరాలు గడిచినా ఆర్ ఎస్ ఎస్ గురువులు, సహచరులు, తన దగ్గర శిక్షణ పొందినవారు ఇప్పటికీ స్నేహంగా ఉంటున్నారు. భావజాలం ఏదైనా మైత్రికి విలువనీయడం బి ఎస్ స్నేహశీలతకు నిదర్శనం.

**విప్లవోద్యమ జీవితం**

జగిత్యాల తాలూకాలో 1975 -77 కాలంలో వేళ్లూనుకున్న నక్సలైట్ ఉద్యమం 7 సెప్టెంబర్ 1978 నాడు జగిత్యాల పట్టణంలోని హైస్కూల్ గ్రౌండ్‌లో జరిగిన రైతుకూలీ సంఘం బహిరంగ సభతో లోకానికి తెలిసింది. భారత కమ్యూనిస్ట్ పార్టీ (మార్క్సిస్ట్ - లెనినిస్ట్) బ్యానర్‌పై ఆ సభ జరిగింది. ఆ రోజు గ్రామాల్లో తిరిగే బస్సులన్నీ పార్టీ నిర్వహణలోకి వెళ్లాయి. వాటికి ఎర్రజెండాలు కట్టారు. పార్టీ కార్యకర్తల ఆదేశాల మేరకు అవి టికెట్లు లేకుండా గ్రామాల్లోంచి మనుషులను సభకు తరలించాయి. పని అయిపోయాక కండక్టర్ చార్ట్‌పై 'విప్లవం వర్ధిల్లాలి' అని రాసి పంపారు. మధ్యాహ్నం 3 గంటలకు మొదలై మూడున్నర గంటలపాటు జగిత్యాల ప్రధాన వీధుల్లో సాగిన ఊరేగింపులో సుమారు 15 వేలమంది రైతులు, రైతు కూలీలు పాల్గొన్నారు. ఎర్ర జెండాలతో ఊరంతా ఎరుపెక్కింది. విప్లవ అనుకూల నినాదాలతో పట్టణం దద్దరిల్లింది. సాయంత్రం 7 గంటలకు మొదలైన సభ అర్ధ రాత్రి దాకా సాగింది. ఉపన్యాసాలు, పాటలతో వేదిక మార్మోగింది. గ్రవుండ్‌కు ఎదురుగా ఉండే విద్యానగర్‌లో ఉండే భూస్వాముల గుండెలు జారిపోయాయి. ఆ మర్నాడు ఈనాడు పత్రిక 'జగిత్యాల జైత్రయాత్ర' అనే పెద్ద అక్షరాలతో పతాక శీర్షిక పెట్టి వార్త రాసింది. ఆ సభకు అలా అదే పేరు ఖాయమైంది. చైనాలో మావో నాయకత్వంలో జరిగిన విప్లవం మాదిరి పోరాటం మన దేశంలో తేవడానికి చేస్తున్న ప్రయత్నంలో ఇదొక భాగంగా భావించాలి. నాటి జగిత్యాల మధ్యతరగతి యువతను కూడా అత్యంతంగా ప్రభావితం చేసిన సభ అది. ఆ ఊపుతో పోరాటంలో స్వయంగా పాల్గొన్నవారు కొందరైతే మిగతా వారంతా సానుభూతిపరులు అని చెప్పక తప్పదు.

అప్పటి నుండి రైటిస్ట్, లెఫ్టిస్ట్ విద్యార్థి సంఘాల ప్రవేశంతో జగిత్యాల విద్యార్థుల మధ్య వర్గభేదం ఏర్పడింది. కాలేజీ విద్యార్థులు పెద్ద ఎత్తున ఈ సంఘాల కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అలా విద్యార్థుల మధ్య కొట్లాటలు కూడా జరిగేవి. విద్యార్థుల మధ్య దాడుల మూలంగా

- బద్రి నర్సన్
ఫోన్: 9440128169

తరువాయి రేపటి సంచికలో

## భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

• రేగోడ్ తహసిల్దార్ దత్తారెడ్డి



**రేగోడు, ఆగస్టు 17 (జనంసాక్షి) :** గత మూడు, నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసిల్దార్ దత్తరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం నాడు మండల పరిధిలోని చౌదర్పల్లి గ్రామ సమీపంలోని వాగును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడు, నాలుగు రోజులుగా భారీగా కురుస్తున్న వర్షాలకు ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ముందుగా పాత ఇళ్లలో ప్రజలు ఎవ్వరు నివసించకూడదని ప్రత్యామ్నాయంగా వేరే సౌకర్యాలను చూసుకొని జాగ్రత్త పడాలని అన్నారు. గత మూడు, నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గ్రామల్లోని పెద్ద పెద్ద చెరువులు నిండి పొంగి పొర్లడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సంబంధిత అధికారులకు తెలపడంతో సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతున్నామని ఏదైనా అత్యవసర సమస్య ఉంటేనే బయటకు రావాలని ప్రజలకు సూచించారు.

## బిట్స్‌పిలానీ విల్ప్ 2025లో 8,450 మందికి పట్టాలు



**జవహర్‌నగర్, ఆగస్టు 17 (జనంసాక్షి) :** బిట్స్ పిలానీ వర్క్ ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్ ప్రోగ్రామ్స్ (విల్ప్) ద్వారా ఈ సంవత్సరం 8,450 మంది విద్యార్థులు పట్టాలు అందుకోనున్నారు. వీరిలో ఎమ్. టెక్, ఎంబీఏ , ఎమ్ ఎస్సీ, బి.టెక్ కోర్సులు పూర్తి చేసినవారు ఉన్నారు. ఈ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా 24 నగరాల్లో ఘనంగా నిర్వహించనున్నారు. ఇప్పటి వరకు 1.36 లక్షలకుపైగా ప్రొఫెషనల్స్ ఈ కార్యక్రమం ద్వారా పట్టాలు పొందగా, ప్రస్తుతం 49,000 మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారని అన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ శివకుమార్ కల్యాణరామన్, సీఈఓ, అనుసందాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ (ఏఎన్ఆర్ఎఫ్) హాజరై పట్టభద్రులను, వారి తల్లిదండ్రులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ, "బిట్స్ పిలానీ విల్ప్ దేశంలో ఉన్నత విద్యను కొనసాగిస్తూ, ప్రొఫెషనల్స్‌కు కొత్త అవకాశాలను సృష్టిస్తోంది" అని పేర్కొన్నారు.

## వీధికుక్కల దాడిలో ఆరుగురికి తీవ్ర గాయాలు



**కొడంగల్, ఆగస్టు 17 (జనం సాక్షి) :** కొడంగల్ మున్సిపల్ పరిధిలో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. పలువురిపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి.ఆదివారం తెల్ల వారుజామున విధులకు హాజరై వెళుతున మున్సిపల్ కార్మికుడు జోగు అనంతయ్య పై ఓ కుక్క దాడి చేసింది. అంతటితో ఆగక రోడ్డుపై వెళ్తున్న ఆరుగురి పై దాడి చేసింది.కుక్క దాడిలో తీవ్రంగా గాయపడిన అనంతయ్య ను చికిత్స నిమిత్తం కొడంగల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం హైదరాబాద్ లోని ఫివర్ ఆసుపత్రికి తరలించారు.ఈ విషయం తెలుసుకున్న కొడంగల్ మున్సిపల్ రెండో వార్డు తాజా మాజీ కౌన్సిలర్ మధు సూదన్ యాదవ్ మాట్లాడుతూ కొడంగల్ పట్టణంలో వీధి కుక్కల బెడద అధికమైందని కుక్కల నివారణకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

## మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై కేసులు నమోదు



**రాజేంద్రనగర్, ఆగస్టు 17 (జనం సాక్షి) :** రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం తాగుతూ వాహనాలు నడిపితే చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సిహెచ్. రాజు హెచ్చరించారు. శనివారం అర్ధరాత్రి రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో ముగ్గురు యువకులు రెండు ద్విచక్ర వాహనాలపై బండ్లగూడ నుంచి ఆరాంఘర్ చౌరస్తా వరకు యువకులు మద్యం సేవించి ఇతర వాహనదారులకు ప్రమాదకరంగా డ్రైవింగ్ చేస్తున్న వారిని ఆన్లైన్ లో వీడియోల ద్వారా సమాచార ఇవ్వగా, స్పందించిన ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో వారి వాహనాలను గుర్తించి ట్రేస్ చేసి రెడ్ హ్యాండెడ్గా పట్టుకుని వాహనాల పత్రాలను పరీక్షించి లా అండ్ ఆర్డర్ ప్రకారం మైలార్దేవపల్లి పోలీస్ స్టేషన్ కు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## 19న బీజేపీ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం



**దోమ, ఆగస్ట్ 17 (జనం సాక్షి) :** 19న బీజేపీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని బీజేపీ పార్టీ దోమ మండల బొంగు మల్లేశం తెలిపారు. మంగళవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని తేజ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు జరుగుతున్నారని చెప్పారు. ఈ సందర్భంగా జిల్లాకు ఆయన మొదటిసారి వస్తున్నారని తెలిపారు. బీజేపీ పార్టీ బలోపితంతో పాటు వచ్చే స్థానిక ఎన్నికలపై నేతలు, కార్యకర్తలను, చైతన్య పరచడం జరుగుతుందని అన్నారు.కావున సమావేశంలో అన్ని మండలాల కార్యకర్తలు, బిజెపి అభిమానులు విస్తృత స్థాయిలో పాల్గొని కార్యక్రమంలో విజయవంతం చేయాలి.

# అధికారుల తీరు మారేనా..!!

• కలెక్టరేట్ పరువు తీస్తున్న కొందరు అధికారులు
• జిల్లాకు తల వంపులు తెచ్చి ఘటనలు
• అధికారులపై ఉన్నత అధికారుల పట్టు సడలింపు
• ఇష్టారాజ్యాంగా వ్యవహరిస్తున్న అధికారులు





**వికారాబాద్ జిల్లా బ్యూరో, ఆగస్టు 17 (జనం సాక్షి) :** ఇప్పటిదాకా లంచాలకు మరిగిన అధికారులను చూశాం.. కానీ ఇప్పుడు దిగజారి నేరానికి పాల్పడే అధికారిని చూస్తున్నాం. దీంతో రోజు రోజుకు కలెక్టరేట్ పరువు దిగజారుతోంది. తాజాగా వరుస సంఘటనలు చూస్తుంటే జిల్లా పరిపాలన గాడి తప్పినట్లు స్పష్టమైన సంకేతాలు ప్రజల్లోకి వెళ్తున్నట్లు స్పష్టమవుతుంది. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. వికారాబాద్ జిల్లా కలెక్టరేట్ రెవిన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న సుజాత లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు దొరికిన సంఘటన మరువకముందే కలెక్టరేట్లో పని చేస్తున్న మరో అధికారి సంఘటన జరిగింది. కోపరేటివ్ డిపార్ట్మెంట్లో పనిచేస్తున్న పరిగికి చెందిన సురేందర్ శ్రీ కృష్ణాష్టమి రోజున ఒక చిన్నారిపై పార్కులో అసభ్యంగా ప్రవర్తించిన వైనం వెలుగు చూసింది . కలెక్టరేట్లో విధులు నిర్వహిస్తూ తప్ప తాగిన మైకంలో చిన్నారిపై వికృష్ట చేష్టలకు పాల్పడ్డాడు. ఫలితం జనం చేతిలో తన్నులు తిని ముళ్లపదల్లో దాచుకొని ప్రాణాలు రక్షించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. శ్రీకృష్ణాష్టమి రోజున సెలవు కావడంతో చిన్నారులంతా కలెక్టరేట్ ఎదురుగా ఉన్న పార్కులో ఆడుకుంటుండగా ఈ సంఘటన జరిగింది. ఈ విషయమై చిన్నారి తల్లిదండ్రులు వికారాబాద్ జిల్లా పోలీసులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. అవినీతికి పాల్పడి ఏసీబీకి చిక్కిన జూనియర్ అసిస్టెంట్ సుజాత కోఆపరేటివ్ డిపార్ట్మెంట్ కు చెందిన జూనియర్ అసిస్టెంట్ నరేందర్ ఇద్దరు జిల్లాకు చెందిన అధికారులే. పరిగి ప్రాంతానికి చెందిన వారు ఒక రైతే తాండూరు పట్టణానికి చెందిన మరో అధికారి. వీరిద్దరూ జూనియర్ అసిస్టెంట్లు కావడం విశేషం. ఇకపోతే కలెక్టరేట్లో పని చేస్తే కొందరి అధికారుల వల్ల కలెక్టరేట్ పరువుతోపాటు జిల్లా పరువు పోతుందని చర్చ జరుగుతుంది. ప్రతిరోజు కలెక్టరేట్లో కలెక్టర్ విధులు నిర్వహిస్తుండగా ఇలాంటి సంఘటనలు జరగడం చర్చకు దారి తీస్తుంది. జిల్లా కలెక్టరేట్లో జిల్లా స్థాయి అధికారులంతా ఎప్పుడు అందుబాటులో ఉంటారు. ఆయా శాఖలలో పనిచేస్తున్న కిందిస్థాయి అధికారుల పనితీరును జిల్లా స్థాయి అధికారులు గుర్తించలేకపోతున్నారు. ఒకవేళ గుర్తించిన తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని చర్చ జరుగుతుంది. కిందిస్థాయి అధికారులు అవినీతికి పాల్పడిన. మద్యం తాగి వచ్చిన. సమయపాలన పాటించక పోయిన. పై అధికారులు పట్టించుకోని కారణంగా ఆయా శాఖలో ఆడిందే ఆట పాడింది పాటగా సాగుతుంది. కలెక్టరేట్లో జరిగిన వరస సంఘటనలే ఇందుకు సాక్ష్యంగా పేర్కొనవచ్చు. కిందిస్థాయి అధికారుల పనితీరు అంత తెలిసిన రివ్యూ మీటింగ్ లో ఈ విషయాలన్నీ జిల్లా కలెక్టర్ దృష్టికి జిల్లా అధికారులు తీసుక రాకపోవడం కోస మెరుపు. తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాలో ఇలాంటి సంఘటనలు జరగడం పట్ల ప్రజల్లో రాజకీయ నాయకుల్లో చర్చ జరుగుతుంది. జిల్లా నుంచి ఇద్దరు ప్రతినిధులు రాష్ట్రస్థాయిలో ఉన్నప్పుడు జిల్లాలోని అన్ని శాఖలపై అజమయిషి ఉండాలి. కానీ మండల స్థాయి నుంచి జిల్లా స్థాయికి వరకు పాలనయంతరంగం గాడి తప్పినట్లు కనిపిస్తోంది. జిల్లాలోని కొన్ని శాఖల్లో విచ్చలవిడిగా లంచగొండితనం ఉన్న కారణంగా ఏసీబీ అధికారులు దాడి చేయడం. కొందరు ఆయా శాఖల కార్యాలయాల ముందు ఆత్మహత్యయత్నానికి చేయడం. ఆందోళన చేయడం వంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఇందుకు ఉదాహరణంగా కలెక్టరేట్లో ఏసీబీ దాడులు అయితే కుల్కచర్లలో రైతు ఆత్మహత్యాయత్నం. తాండూర్ సబ్ రిజిస్టర్ ఆఫీస్ లో అవినీతి వంటి సంఘటనలు వెలుగులోకి వచ్చాయి. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ జిల్లా స్థాయి అధికారులతో పాటు కలెక్టరేట్లో పనిచేసే కిందిస్థాయి అధికారులతో రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేసి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అంతేకాకుండా కలెక్టరేట్ తో పాటు డివిజన్ మండల స్థాయి అధికారుల వల్ల మరో సంఘటన జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. అప్పుడే జిల్లా పాలన గాడి తప్పడం లేదన్న విశ్వాసం ప్రజల్లో కలుగుతుందని అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారుల్లో మార్పు రావాలని అందరం ఆశిద్దాం...

## సీపీఐ రాష్ట్ర మహాసభ ఏర్పాట్లను పరిశీలన




**కుత్బుల్లాపూర్, ఆగస్టు 17 (జనం సాక్షి) :** సిపిఐ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలు ఈ నెల 20 వ తేదీ నుండి 22 వ తేదీ వరకు కుత్బుల్లాపూర్ నియోజక వర్గం గాజులరామారం లో జరగనున్న ఏర్పాట్లను ఆదివారం సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడా వెంకటరెడ్డి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాట వీరుల పోరాటాలు, సిపిఐ చేసిన త్యాగలు వెలకట్టలేనివని,గత చరిత్ర నేటి ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందని అన్నారు. మహాసభలో ఎగ్జిబిషన్ ద్వారా వాటిని ప్రదర్శించి నున్నట్లు ఆయన పేర్కొన్నారు కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలను, లోపాలను చర్చించడం జరుగుతుందన్నారు. పార్టీ భవిష్యత్తు ప్రణాళికను రూపొందించుకొని మరింత బలోపేతం చేసుకోవడానికి రాష్ట్ర మహాసభలు ఉపయోగపడుతాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. రాష్ట్ర మహాసభల జయప్రదం కోసం అన్ని వర్గాల వారు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆహ్వాన సంఘం అధ్యక్షులు యూసఫ్,ప్రధాన కార్యదర్శి స్వామి,గౌరవ అధ్యక్షులు ఏసురత్నం,డి.హెచ్.పి.ఎస్ రాష్ట్ర కార్యదర్శి అనిల్,జిల్లా కార్యదర్శి ఉమా మహేష్,మండల కార్యదర్శి స్వామి, ఏఐటీయూసీ కార్యదర్శి శ్రీనివాస్, సిపిఐ నాయకులు శ్రీకాంత్,వెంకటేష్, ప్రవీణ్, దుర్గయ్య, సహదేవ రెడ్డి, బాబు, వెంకటేష్,రాజు, జంబూ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి



**శామీర్‌పేట్, ఆగస్టు 17 (జనం సాక్షి) :** ఆర్య వైశ్య సంఘాల అభివృద్ధి కి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత అన్నారు. ఆదివారం జగన్ గూడలోని ఆర్య వైశ్య సంఘంలో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకరానికి ముఖ్య అతిథిగా చైర్మన్ సుజాత హాజరై మొక్కను నాటారు. ఆర్య వైశ్య సంఘం నూతన అధ్యక్షులు గట్టు హరి శంకర్, మీడియా కమిటీ చైర్మన్ గా గుడాల ప్రవీణ్ కుమార్‌తో పాటు కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమం లో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి



**షాబాద్, ఆగస్టు 17 (జనం సాక్షి) :** ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని మల్లారెడ్డి గూడ లో మల్లన్న స్వామి బోనాల ఉత్సవాల్లో కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ... బోనాల పండగ తెలంగాణ సంస్కృతి అని అన్నారు. ఆషాడ మాసంలో, శ్రావణమాసంలో ఎంతో భక్తి శ్రద్ధలతో బోనాలు జరుపుకుంటారు అని అన్నారు మల్లన్న స్వామి ఆశీస్సులు తెలంగాణ రాష్ట్ర ప్రజలపై ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీ సభ్యులు గుండాల అశోక్, మాజీ సర్పంచులు ప్రతాప్ రెడ్డి, మహేందర్ గౌడ్, బోకుల లింగం, శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సుభాష్ రెడ్డి, కిషోర్ నాయక్, సూర్య భాయ్, దేవుల నాయక్, రాఘవేంద్ర స్వామి, బడుగు మల్లేష్ యాదవ్, దండు రాహుల్ గుప్తా, మాణిక్యం, మాధవరెడ్డి, కుమ్మరి బాలయ్య, కావలి శ్రీరాములు, ప్రభాకర్ రెడ్డి, అనంతరెడ్డి, యాదయ్య, సదానందం తదితరులు పాల్గొన్నారు.

## నీటి మట్టాన్ని అంచనా వేసి చర్యలు చేపట్టాలి

• మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**పాపన్నపేట,ఆగస్టు 17 (జనంసాక్షి) :** నీటి మట్టాన్ని అంచనా వేస్తూ,అనుగుణంగా చర్యలు చేపట్టాలని అధికారులకు కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. ఆదివారం ఎల్లాపూర్ వంతెన,నీటి వరద ప్రవాహాన్ని కలెక్టర్ పరిశీలించారు. వర్షాలతో సామాన్య ప్రజలకు,రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. కాగా.. సింగూరూ ప్రాజెక్ట్ నుండి 50 వేల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేయడంతో ఎలాంటి ప్రమాదం లేదని,లక్ష క్యూసెక్కుల నీరు విడుదల చేసిన పక్షంలో వరద ఉధృతితో ఎక్కువ తాకిడి ఉంటుందని ఆర్అండ్ బి అధికారులు కలెక్టర్‌కు వివరించారు.

## సీఎంని కలిసిన కోడంగల్ ముదిరాజ్ నాయకులు



**కొడంగల్, ఆగస్టు 17 (జనం సాక్షి) :** హైదరాబాద్ సీఎం రేవంత్ రెడ్డిని మరియు పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ ని కొడంగల్ ముదిరాజ్ నాయకులు కలిసి ముదిరాజ్ లను బీసి- డి నుండి బీసి-ఏ లోకి తెచ్చిన జీవ నం.15 ను వెంటనే అమలు చేయడానికి తగు చర్యలు తీసుకోవాలని వినతిపత్రం సమర్పించారు.సీఎం సానుకూలంగా స్పందించి మౌకిక ఆదేశాలు జారి చేశారు.ఈ విషయంలో సీఎం స్పందన చూసి ముదిరాజ్ నాయకులు ఆనందం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో నారాయణ పేట జిల్లా అధ్యక్షులు వేణు గోల్ ముదిరాజ్,కోస్గి మండల అధ్యక్షులు తుడుం శ్రీనివాస్ ముదిరాజ్, కోడంగల్ మండల అధ్యక్షులు న్యాయవాది బోయిని వెంకటయ్య ముదిరాజ్, తాలూకా ఉపాధ్యక్షులు గుండాల నర్సప్ప ముదిరాజ్, తాలూకా ప్రధాన కార్యదర్శి బాలయ్య ముదిరాజ్, దుద్యాల మెరుగు వెంకటయ్య ముదిరాజ్, పోలేపల్లి ఎల్లమ్మ గుడి చైర్మెన్ జయరాములు ముదిరాజ్, అన్నారం పకిరప్ప ముదిరాజ్, నర్సిములు నాయుడు ముదిరాజ్ ,శ్రీకాంత్ ముదిరాజ్, నీరటి క్రిష్ణ ముదిరాజ్, జినిగెలి పకిరప్ప ముదిరాజ్, నాగారం నారాయణ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని అనుసరించాలి



**ఘట్కేసర్, ఆగస్ట్ 17 (జనంసాక్షి) :** ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని ప్రజలు తీసుకెళ్లడానికి 227వవారం నిత్య పూలమాల కార్యక్రమం నిర్వహించబడింది. ముఖ్యఅతిథిగా చిలుగూరి ఆనంద్ (మాజీ వార్డు సభ్యుడు, మర్పల్లిగూడ) విచ్చేసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళు లు అర్పించారు. చిలుగూరి ఆనంద్ మాట్లాడుతూ.. సర్దార్ సర్వాయి పాపన్న మహారాజ్ 350 సంవత్సరాలు ముందే బహుజన రాజ్యాధికారాన్ని నెలకొల్పటం జరిగింది, దాన్ని మనం అందరం కూడా ఆదర్శనంగా తీసుకొని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలని ఏకం చేసి మనం అందరం కూడా బహుజన రాజ్యాధికార దిశగా అడుగులు వేయాలని తెలియజేస్తున్నా. లాల్‌నీల్ కలిసి రాజ్యాధికారం సాధించాల్సిన అవసరం ఉంది. అందరూ కూడా అంబెద్కర్ ఆలోచన విధానాన్ని అనుసరించాలి అని పిలుపునిచ్చారు. ఇలా ప్రజలని చైతన్యపరుస్తున్న యం.అరుణ్ కుమార్ కి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. సర్దార్ సర్వాయి పాపన్న మహారాజ్ 375వ జయంతి సందర్భంగా అయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా యం.అరుణ్ కుమార్ మాట్లాడుతూ ఆ బహుజన యోధుడి చరిత్ర తెలియజేయటం జరిగింది. పాపన్న 1650 ఆగస్ట్ 18న వరంగల్ జిల్లా ఖిలాషాపూర్ గ్రామంలో గౌడ కులంలో పుట్టారు. పాపన్న తండ్రి చిన్నతనంలోనే చనిపోతే తల్లి సర్వమ్మ అన్నీ తానై పెంచింది. పాపన్న కల్లు గీత వృత్తి కొనసాగిస్తూ యుక్త వయసులోనే భూస్వాములు, దేశముఖ్‌ల దాష్టీకాలను సహించలేక, మూఢ సాంప్రదాయాలను ఎదిరించి పోరుబాట పట్టాడు. 350 సంవత్సరాలు ముందే బహుజన రాజ్యాధికారాన్ని నెలకొల్పటం జరిగింది., ఆ బహుజన యోధుడి చరిత్ర తెలియజేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో మేకల దాస్(అంబేద్కర్ యువజన సంఘం), బండారి రాందాస్ (అధ్యక్షుడు, అంబేద్కర్ యువజన సంఘం, ఇడబ్ల్యూఎస్ కాలనీ), కె.సత్యం, మీసాల రాజేష్ కుమార్(ఎస్సి సెల్ ప్రెసిడెంట్, బిఆర్ఎస్ పార్టీ, పోచారం మున్సిపాలిటీ), కడప రవి, డి శ్రీకాంత్, జి అంజయ్య, బాలనగరం గణేష్ గౌడ్, పోతగాని శేఖర్, ఇ విష్ణు, వివేక్, జె అఖిల్, లలిత్, సోము విహాన్ తదితరులు పాల్గొన్నారు.

# పేద ప్రజల గొంతుక సీపీఐ

● 20 నుంచి 22 వరకు రాష్ట్ర మహాసభలు



**రేవల్లి, ఆగస్టు 17 (జనంసాక్షి) :** పేద ప్రజల గొంతుక సిపిఐ అని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కే. శ్రీరామ్ అన్నారు. ఆదివారం గోపాల్ పేట మండల కేంద్రంలో సిపిఐ నాలుగవ రాష్ట్ర మహాసభల గోడపత్రికలను వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి రమేష్, కార్యవర్గ సభ్యుడు జే. చంద్రయ్య తో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1925, డిసెంబర్ 26న ఉత్తరప్రదేశ్ రాష్ట్రం కాన్పూర్ లో ఆవిర్భవించిన సిపిఐ వందేళ్లుగా పేద ప్రజల హక్కుల కోసం పోరాడుతూ వస్తుందన్నారు. స్వాతంత్రం కోసం పిలుపునిచ్చిన తొలి పార్టీ సిపిఐ అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో 4500 మంది త్యాగాలు చేసిన చరిత్ర సిపిఐ కి ఉందన్నారు. భూమికోసం, భుక్తి కోసం, వెట్టి నుంచి ప్రజల విముక్తి కోసం పోరాడిందన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలకపాత్ర పోషించిందన్నారు. పేదలకు భూముల పంపిణీ, రైతుకు గిట్టుబాటు ధర, నిరుద్యోగులకు ఉద్యోగం ఉపాధి, పేదలకు నిలువ నీడ కోసం ఇల్లు కల్పించాలని, దేశ సంపదలో ప్రజలకు వాటా దక్కాలన్నదే సిపిఐ లక్ష్యమన్నారు. అనేక సంక్షేమ పథకాలు సిపిఐ పోరాటం వల్లే ప్రజలకు లభించాయన్నారు. అన్యాయం జరిగిన ప్రతి ఒక్కరూ ఎర్ర జెండా పట్టాల్సిందే అన్నారు. బిజెపి ప్రజా వ్యతిరేక మతోన్మాద విధానాలు దేశ ఐక్యతకు ప్రమాదం అన్నారు. వ్యతిరేకంగా సిపిఐ పోరాడుతుందని ప్రజలు అందుకు సిద్ధం కావాలన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన 6గ్యారంటీలు అమలు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రజల అభివృద్ధి సంక్షేమం కోసం రాష్ట్ర మహాసభల్లో పలు తీర్మానాలు ఆమోదించటం జరుగుతుందన్నారు. మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం గాజుల రామారాం లో ఈనెల 20 నుంచి 22 వరకు రాష్ట్ర మహాసభలు జరుగుతాయని ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గోపాల్ పేట మండల కార్యదర్శి మంగలి శాంతయ్య, గ్రామ కార్యదర్శి కురుమూర్తి, నాయకులు సుదర్శన్, బంగారి, రాజు, మొగిలి, అఖిల్, సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

## యూరియా కోసం వర్షాన్ని సైతం లెక్కచేయని రైతులు



**నర్వ, ఆగస్టు 17 (జనంసాక్షి) :** నర్వ మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘంవద్ద యూరియా కోసం వర్షాన్ని లెక్కచేయకుండా పడిగాపులుకాస్తున్న రైతులు,యూరియా కోసం ఆధార్ కార్డులు,పాస్ బుక్కులు క్యూలో పెట్టి అన్నదాతలు పడిగాపులు పడ్డారు.సాయంత్రం వరకు సింగిల్ విండో కార్యాలయం వద్ద యూరియాకు రైతులు ఎగబడ్డారు.రైతులు,సిబ్బంది మధ్య చిన్నపాటి తోపులాట చోటు చేసుకుంది. నర్వ సింగిల్విండో కార్యాలయం వద్ద ఆదివారం రోజు యూరియా కోసం రైతులు పడిగాపులు కాశారు. సహకార సంఘంలో యూరియా నిల్వ ఉన్నదని సమాచారం తెలుసుకున్న రైతులు ఉదయం 6 గంటల నుండే ఒక్కసారిగా రైతులు ఎగబడ్డారు.యూరియా కొరకు కార్యాలయం వద్దకు దూసుకరావడంతో గందరగోళం ఏర్పడింది.పలుకుబడి ఉన్నవారికే యూరియాను ఇస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని రైతులు సిబ్బందిపై మండిపడ్డారు.

## సింగూర్ ప్రాజెక్ట్ గండిని పరిశీలించిన మంత్రి దామోదర్



**సంగారెడ్డి ప్రతినిధి, ఆగస్టు 17 (జనం సాక్షి) :** సింగూరు ప్రాజెక్టు పుల్కల్ మండలం ఇసోజుపేట గ్రామం వద్ద రాజనర్సింహ ప్రధాన కాల్వకు గండి పడిన విషయం తెలుసుకున్న రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ దామోదర్ రాజనర్సింహ స్వయంగా సంఘటన స్థలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్యతో కలిసి పరిస్థితిని పరిశీలించారు. కాల్వకు పడిన గండిని వెంటనే మరమ్మతు చేయాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తక్షణమే పనులు ప్రారంభించాలని మంత్రి ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. అలాగే భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఇరిగేషన్, రెవెన్యూ శాఖలు పూర్తి అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. రైతుల సమస్యలు నివారించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుంటోందని మంత్రి స్పష్టం చేశారు.

# ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలి

● జిల్లా కలెక్టర్ కె. హైమావతి



**నంగునూరు, ఆగస్టు 17 (జనం సాక్షి) :** భారీ వర్షాలు నేపథ్యంలో జిల్లాలో ఉన్న వాగుల వద్ద నేటి ప్రవాహం పెరిగినప్పుడు అధికారులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ హైమావతి సూచించారు.ఆదివారం జిల్లా కలెక్టర్ నంగునూరు, కోహెడ, చిన్నకోడూరు మండలాల్లో పర్యటించిలో లెవెల్ బ్రిడ్జిలు, కాజ్వేల వద్ద వర్షం నీరు ప్రవాహంను ఆర్ అండ్ బి డి వెంకటేష్‌తో కలిసి పరిశీలించారు. ముందుగా నంగునూరు మండలంలోని అక్కినేపల్లి వద్ద మోయతుమ్మెదవాగుపై లెవెల్ బ్రిడ్జిని, బద్దిపడగ వద్ద ఊర చెరువు మత్తడి కింద రోడ్ , కోహెడ మండలం గుండారెడ్డిపల్లి వద్ద నక్కవాగు మరియు తంగళ్ళపల్లి వద్ద పిల్లివాగు వాగు, చిన్న కొండూరు మండలం సికింద్లాపూర్, ఇబ్రహీంనగర్ నగర్ల వద్ద గల స్థానిక వాగుల పై గల లోలెవల్ కాజ్వేలను పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతానికి ఆయా వాగులలో సాధారణంగా నీటి ప్రవాహం ఉందని కానీ కంటిన్యూగా వర్షాలు పడితే లో లెవెల్ బ్రిడ్జిలు, కాజ్వేల్ పై నుండి వర్షం నీరు ప్రవహించే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండి అవసరమైనప్పుడు ప్రజలను అప్రమత్తం చేసి ఆయా కాజ్వేలు, బ్రిడ్జిలపై రాకపోకలను ఆపివేయాలని ఆర్ అండ్ బి డిఇ వెంకటేష్ కు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆదిశిలా క్షేత్రాన్ని దర్శించుకున్న ఎస్ఐ కుటుంబసభ్యులు



**మల్దకల్, ఆగస్టు 17 (జనంసాక్షి) :** మండల కేంద్రంలోని శ్రీ స్వయంభు లక్ష్మి వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని గద్వాల పట్టణ ఎస్సై కళ్యాణ్ కుమార్ కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు.ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతంపలికి దేవాలయంలోని ప్రత్యేక పూజలు చేశారు.తన పుట్టినరోజు సందర్భంగా స్వామివారిని దర్శించుకోవడం జరిగిందన్నారు.స్వామి వారి ఆశీస్సులు,ఆయురా ఆరోగ్యాలతో ఉండాలని అర్చకులు మధుసూదనాచార్యులు, రవి ఆశీర్వదించారు.ఎస్ఐకి కుటుంబ సభ్యులకు అరవిందరావు శేష వస్త్రంతో సన్మానించారు. ఈకార్యక్రమంలో చంద్రశేఖర రావు,పూజారులు అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా శ్రీ కృష్ణస్వామి రథోత్సవం, బ్రహ్మోత్సవాలు



**మల్దకల్, ఆగస్టు 17 (జనంసాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం సద్దలోనిపల్లి గ్రామంలోని ఆదివారం స్వయంభు శ్రీకృష్ణ స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరిగాయి.స్వామివారికి పంచామృతం,అష్టోత్తర పూజ, బలి మహానైవేద్యం, స్వామి వారి ఉట్లుత్సవం,పల్లకి సేవ, కుంభం స్వామివారి రథోత్సవం,సర్కారీ సేవ,తీర్థ ప్రసాదములు జరిగాయి. మూడు రోజులపాటు జరిగే బ్రహ్మోత్సవాలకు దేవాదాయ ధర్మాదాయ శాఖ అన్ని ఏర్పాట్లును పూర్తి చేసింది. ఆయాగ్రామాల నుండి భక్తులు భక్తాదులు స్వామివారిని దర్శించుకోవడానికి ఇక్కడ వచ్చి మొక్కుబడులను తీర్చుకున్నారు. ఆలయ ఈవో పురేందర్ కుమార్ గ్రామ ప్రజ లు ఆధ్వర్యంలో రథోత్సవం వేడుకలు ఘనంగా జరిగింది.స్వామి వారిని దర్శించుకోవడానికి భక్తులు వివిధ ప్రాంతాల నుండి భారీ ఎత్తున తరలివచ్చారు.రథోత్సవం తిలకించడానికి వివిధ ప్రాంతాల నుండి భక్తులు తరలివచ్చారు.రాత్రి శ్రీమన్నారాయణ కళామండలి వారిచే భజన కార్యక్రమం జరిగింది. చిన్నారులచే దేవాలయ ఆవరణంలోని కోలాటం భక్తులను ఆకట్టుకుంది.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● కలెక్టర్ రాహుల్ రాజ్



**టేక్మాల్, ఆగస్ట్ 17 (జనం సాక్షి) :** భారీ వర్షాలు, వరదల కారణంగా సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులకు ఆదేశించారు. ఆదివారం టేక్మాల్ మండలంలో కలెక్టర్ విస్తృతంగా పర్యటించి పెద్ద చెరువు అలుగు పారి టేక్మాల్ టు ధనురా రోడ్డు వరద ప్రవాహనికి గురైన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కురుస్తున్న భారీ వానల నేపథ్యంలో ప్రాజెక్టులు చెరువులు నిండుకుండలా మారాయని ఉదృతంగా ప్రవహిస్తున్నందున ముంపు ప్రాంతాల ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ ప్రజలకు రాకపోకలు ఇబ్బంది కాకుండాచూస్తున్నామన్నారు. ప్రమాదకరంగా పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు దాటే ప్రయత్నం చేయవద్దని ప్రజలను అప్రమత్తం చేయాలని తెలిపారు. రోడ్ల మీద నీరు పూర్తి స్థాయిలో తగ్గే వరకూ ప్రజలు బయటకు రాకూడదని, సహాయక చర్యల్లో ప్రజలు అధికారులకు సహకరించాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో టేక్మాల్ తాసిల్దార్ తులసీరామ్, ఆర్ అండ్ బి ఈ సర్దార్ సింగ్, ఈ.ఈ ఇరిగేషన్ శ్రీనివాసులు, సంబంధిత పంచాయతీ సెక్రటరీలు, తదితరులు పాల్గొన్నారు.

## మగ్దుంపూర్‌లో ఘనంగా పోచమ్మ బోనాలు

● పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించిన గ్రామస్తులు



**నంగునూరు, ఆగస్టు 17 (జనం సాక్షి) :** నంగునూరు మండలంలోని మగ్దుంపూర్ గ్రామంలో ఆదివారం శ్రావణమాసం బోనాల పండగ నిర్వహించారు. గత ఆదివారం కురుమ సంఘం ఆధ్వర్యంలో బీరప్ప బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. తిరిగి ఈ ఆదివారం గ్రామస్తులంతా పోచమ్మ తల్లి బోనాలు నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఇంటి నుంచి బోనం ఎత్తుకొని మహిళలు ఆలయానికి తరలివెళ్లారు. అనంతరం అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు. యువకుల కేరింతల మధ్య బోనాలు, ఊరేగింపు నిర్వహించారు. గ్రామస్థులంతా పోచమ్మ తల్లి ఆలయానికి చేరుకున్నారు. పంబాల వారి సాంప్రదాయక పూజల మధ్య వర్షాలు బాగా కురిసి ప్రజలు సుఖ సంతోషాలతో ఉండేలా చూడాలని మొక్కుకున్నారు.

# మర్రిపల్లిలో ఘనంగా బోనాల పండగ



**చారకొండ, ఆగస్టు 17 (జనంసాక్షి) :** మండలంలోని మర్రిపల్లిలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రతి సంవత్సరంలాగే ఈ ఏడాది కూడా బోనాల పండుగను అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. మహిళలు, చిన్నారులు, పెద్దలు అనే తేడా లేకుండా అందరూ కలిసి అమ్మవారికి బోనాలు సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. ఘనంగా గ్రామదేవతలకు ఒకపొద్దులతో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. గ్రామ యువకులు డబ్బు సప్పులతో నృత్యాలు చేస్తూ ఉత్సవాన్ని రెట్టింపు చేశారు. పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ ఈ పండుగలో పాల్గొని గ్రామదేవతల ఆశీర్వాదం కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో కొండల్, మాజీ సర్పంచ్ నరేష్ నాయక్, విజయ్, సంజీవ, కొండల్, పాండు, లాలు, రాజు గ్రామ ప్రజలు, మహిళలు యువకులు తదితరులు ఉన్నారు.

## నర్మేటలో గ్రామంలో ఘనంగా పోచమ్మ బోనాలు



**నంగునూరు, ఆగస్టు 17 (జనం సాక్షి) :** నంగునూరు మండలం నర్మేట గ్రామంలో ప్రజలు పోచమ్మ తల్లి కి బోనాలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం రోజు గ్రామంలో అన్ని కుల సంఘాల ప్రజలు పోచమ్మ తల్లికి ఉపవాసాలతో బోనాలు వండి పోచమ్మ ఆలయాంలో బోనాలతో నైవేద్యాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. గుడి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మాట్లాడుతూ వర్షాకాలంలో వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండి అధిక దిగుబడులు రావాలని, తమ కుటుంబాలు చల్లగా ఉండాలని గ్రామ దేవతలైన పోచమ్మ,మైసమ్మ దేవతలకు పూజలు నిర్వహించి బోనాల సమర్పిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, కుల సంఘాల పెద్దలు, మహిళలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 17న మూకుమ్మడి నిరాహార దీక్షలు

● చేర్యాల డివిజన్ సాధనే లక్ష్యంగా జేఏసీ అడుగు
● జేఏసీ చైర్మన్ డాక్టర్ పరమేశ్వర్



**చేర్యాల, ఆగస్టు 17 (జనంసాక్షి) :** సెప్టెంబర్ 17 అనేది తెలంగాణ ప్రాంతానికి, ప్రజానీకానికి చరిత్రత్మకమైన దినం రోజున డివిజన్ ఉద్యమంలో భాగంగా జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు చేర్యాలను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ప్రకటించాలని మరింత తీవ్రతరం చేయడానికి ఉద్యమ స్ఫూర్తిని గ్రామీణ స్థాయిలో బలోపేతం చేయడం కు కోసం సెప్టెంబర్ 17వ రోజున చేర్యాల ప్రాంత పరిధిలోని అన్ని గ్రామాలలో ఊరురా–వాడవాడలా ఉదయం 10గంటల నుండి 2గంటల వరకు జరిగే ముకుమ్మడి రిలే నిరాహార దీక్షలు చేయడానికి ప్రజలు ముందుకు వచ్చి విజయవంతం చేయాలని జేఏసీ చైర్మన్ డా. రామగల్ల పరమేశ్వర్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక జేఏసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఈ జేఏసీ ఇచ్చిన పిలుపులో చేర్యాల ఉనికి అస్తిత్వం, ఆత్మ గౌరవం కోసం జరిగే పోరాటంలో యువకులు మరింత క్రియాశీలకమైనటువంటి పాత్ర పోషించి ఈ ప్రాంత ఆత్మగౌరవానికి, పూర్వ వైభవాన్ని సాధించడానికి యువకులు, విద్యావంతులు, మేధావులు నిరార దీక్షలకు ప్రజలను సమయత్తం చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జేఏసీ అందె అశోక్, అందె బీరయ్య, బుట్టి సత్యనారాయణ, గడిపె బాలనర్సయ్య, పోలోజు వెంకటాద్రి, కూడిక్యాల బాల్ మోహన్, నంగి కనకయ్య, బూరుగు సత్తయ్య, మల్లం అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలు వింటూ.. నష్టాన్ని పరిశీలిస్తూ

- వరద ప్రభావిత ప్రాంతాల్లో కలెక్టర్, ఎస్పీల పర్యటన



**ఆదిలాబాద్ ప్రతినిది. (జనంసాక్షి):** శనివారం భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో జిల్లాలోని పలు వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆదివారం జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ కలిసి అధికారులతో వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. పట్టణంలోని హ్యాండీక్యాప్డ్ కాలనీ, జిఎస్ ఎస్టేట్ కాలనీలలో పర్యటించి జరిగిన నష్టాన్ని స్వయంగా పరిశీలించి బాదితులను అడిగి తెలుసుకున్నారు. అంతేకాదు ఆ ప్రాంతంలో వెంటనే వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి అంటు రోగాలు ప్రబలకుండా తగు నివారణ చర్యలను చేపట్టారు. కల్వర్టులు బ్రిడ్జిలు వద్ద పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో డిడిఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్ బృందాలు పూర్తి సిద్ధంగా ఉన్నట్లు, ఎలాంటి అత్యవసర పరిస్థితుల్లోనైనా వెంటనే స్పందించేందుకు ఏర్పాట్లను పూర్తి చేసినట్లు తెలిపారు.

# బస్టాండ్ అభివృద్ధి హామీలు ఎటు పాయే..?

- బస్టాండ్ ప్రాంగణంలో నాటు వేసి నిరసన



**గూడూరు, ఆగస్టు17 (జనంసాక్షి):** గతంలో గూడూరు బస్టాండ్‌ను అభివృద్ధి చేస్తామని ప్రజాప్రతినిధులు మంత్రుల ద్వారా ఇచ్చిన హామీలన్ని ఎటు పాయే అని ఎంసిపిఐ(యు)పార్టీ మహబూబాబాద్ జిల్లా సహా కార్యదర్శి నూకల ఉపేందర్ అన్నారు. గూడూరు మండల కేంద్రంలో జాతీయ రహదారి వెంబడి ఉన్న ఆర్టీసీ ప్రాంగణంలో ఆదివారం స్థానిక నాయకులతో కలసి బురదలో నాటు వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్బంగా ఉపేందర్ మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన వర్షాలకు బస్టాండ్ ప్రాంగణం మొత్తం బురదమయం కావడంతో నిత్యం భద్రాచలం, హైదరాబాద్, వరంగల్, మంచిర్యాల, కరీంనగర్, భూపాలపల్లి ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు బస్సు ఎక్కాలంటే చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు,పురుషులు బస్సు ఎక్కలేని దయానియమైన స్థితిలో బస్టాండ్ ఉందని అన్నారు. ఇట్టి విషయంపై గతంలో అనేక పత్రికలు, మీడియా,సంస్థలు కథనాలు ప్రచురించడం జరిగిందని,స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు బస్టాండ్ అభివృద్ధి కొరకు ప్రజాప్రతినిధులు మంత్రుల ద్వారా సిసి మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారాని, కానీ నేటి వరకు సిసి ఏర్పాటు చేయకపోవడం వలన బస్టాండ్ ప్రాంగణంలో మొత్తం బురద ఉండటంతో ప్రయాణికులు నడవలేని పరిస్థితి ఏర్పడి బస్టాండ్ దారుణంగా తయారైందని, నిత్యం ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు,స్పందించి గూడూరు బస్టాండ్ ప్రాంగణంలో సీసీ ఏర్పాటు చేసి, ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఈసం రామయ్య,కటకం బుచ్చిరామయ్య, గుండ గాని సత్తయ్య, పాల్గొన్నారు.

## ఆకెనపల్లి వాగు నుంచి జోరుగా ఇసుక అక్రమ రవాణా



**బెల్లంపల్లి, ఆగష్టు 17, (జనంసాక్షి):** బెల్లంపల్లి మండలం ఆకెనపల్లి వాగు నుంచి ప్రతి 50 నుంచి 60 ట్రాక్టర్ల ఇసుక అక్రమంగా రవాణా అవుతుంది. ప్రతి నిత్యం ఇలా ఇసుక మాఫియా దర్జాగా ఇసుక దోపిడీకి పాల్పడుతున్న కట్టడి చేయాల్సిన అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు. ఇప్పటికే శాంతిఖని గని వల్ల భూగర్భ జలాలు అడుగంటి పోయిన తరుణంలో కనీసం కాస్తో కుస్తో ఉన్న భూగర్భ జలాలను అందకుండా చేస్తున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆకెనపల్లి వాగు ప్రతి నిత్యం ఇలా అక్రమంగా ఇసుక రవాణా జరుగుతుందని సంబంధిత అధికారులకు ఎన్ని సార్లు పిర్యాదు చేసినా పట్టించుకున్న పాపాన పోలేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆకెనపల్లి వాగు నుంచి అక్రమ ఇసుక రవాణా నిరోదించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# వరద ప్రభావిత ప్రాంతాల్లో ఉన్నత అధికారుల పర్యటన

- కడెం- ప్రాజెక్టు పాండాపూర్ రాంపూర్ వంతెనలు పంట పొలాలను పరిశీలించిన ప్రత్యేక అధికారి హరి కిరణ్, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**కడెం: ఆగస్టు 17(జనంసాక్షి):** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రత్యేక అధికారి హరికిరణ్, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌తో కలిసి ఆదివారం కడెం ప్రాజెక్టు, పాండాపూర్ - రాంపూర్ వంతెనలు, పంట పొలాలను పరిశీలించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో గ్రామస్తులను కలసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి హరి కిరణ్ మాట్లాడుతూ... జిల్లాలో గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో లోతట్టు ప్రాంతాలలో వరద నీరు చేరిందని తెలిపారు. ఈ నెల 20 వరకు వర్షాలు కొనసాగే అవకాశం ఉన్నందున ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పంటలకు నష్టం వాటిల్లితే రైతులకు తగిన సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని అన్నారు .కడెం, స్వర్ణ, శ్రీరాంసాగర్ తదితర ప్రాజెక్టుల్లో నీరు అధికంగా చేరుతుండడంతో దిగువకు నీటిని విడుదల చేస్తున్నారని చేపలు పట్టేవారు, రైతులు, పశువుల కాపరులు లోతట్టు ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. భారీ వర్షాల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశముందని, ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వైద్యశాఖ ప్రత్యేక శిబిరాలు నిర్వహించి అవసరమైన సేవలు అందించాలని ఆదేశించారు. రెవెన్యూ, వ్యవసాయ, నీటిపారుదల, వైద్యశాఖ అధికారులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటూ అత్యవసర పరిస్థితుల్లో తగిన సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ. భారీ వర్షాలతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రజలను అప్రమత్తం చేస్తూ, సహాయక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రాజెక్టులలోకి భారీగా వరద నీరు చేరుతుండడంతో సమీప గ్రామాల ప్రజలకు ముందస్తు సమాచారం అందిస్తూ నీటిని దిగువకు వదలడం జరుగుతుందని తెలిపారు. అవసరమైన ప్రతి మండలంలో ఎన్‌డి ఆర్ఎఫ్, బెటలియాన్, పోలీస్, రెస్క్యూ టీములు సిద్ధంగా ఉన్నాయని, 24 గంటలు కంట్రోల్ రూమ్ (9100577132) అందుబాటు లో ఉందని తెలిపారు. వాగులు, నది పరివాహక ప్రాంతాల ప్రజలు, రైతులు, మత్స్యకారులు, అప్రమత్తంగా ఉంటూ లోతట్టు ప్రాంతాలకు ఎట్టి పరిస్థితుల్లో వెళ్ళవద్దని కలెక్టర్ ఈ సందర్భంగా సూచించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ పరిశీలనలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల, అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్న కళ్యాణి, జిల్లా అధికారులు గోవింద్, శ్రీనివాస్, అంజిప్రసాద్, డా.రాజేందర్ పాల్గొన్నారు.

# కోల్‌మైన్స్ అధికారుల సమస్యలు పరిష్కరించాలి

- అసోసియేషన్ నేతలు లక్ష్మీపతి గౌడ్, పెద్ది నరసింహులు
- భూపాలపల్లిలో బ్రాంచ్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం
- నల్లబ్యాడ్జిలు ధరించి నిరసన




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి) :** కోల్ మైన్స్ అధికారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోల్ మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (సిఎంఓఏఐ) శాఖ అధ్యక్షులు తాళ్లపెల్లి లక్ష్మీపతి గౌడ్, జనరల్ సెక్రటరీ పెద్ది నరసింహులు అన్నారు. సింగరేణి శాఖకు చెందిన కోల్ మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆదివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాకేంద్రంలో బ్రాంచ్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అన్ని ఏరియాల ఆఫీసర్స్ ప్రతినిధులు పాల్గొని నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. సమావేశంలో అసోసియేషన్ శాఖ అధ్యక్షులు తాళ్లపెల్లి లక్ష్మీపతి గౌడ్, జనరల్ సెక్రటరీ పెద్ది నరసింహులు మాట్లాడుతూ పర్ఫార్మెన్స్ రిలేటెడ్ పే (పిఆర్‌పి) అంశాన్ని ప్రధాన ఎజెండాగా తీసుకుని, కోల్ ఇండియాలో ఇప్పటికే గత కొంత కాలం క్రితమే రిలేటెడ్ పే చెల్లింపులు జరిపిన ప్పటికీ, సింగరేణి అధికారులకు ఇలాంటివి ఇంకా చెల్లించకపోవడం విచారకరం అని అన్నారు. ఇది అధికారుల వేతనంలో ఒక భాగం కాబట్టి తక్షణమే చెల్లించాలని కోరారు. పిఆర్‌పి ప్రస్తుత పరిస్థితిపై విశ్లేశించి, త్వరితగతిన చెల్లింపులు జరిగేలా అసోసియేషన్ తగు చర్యలు తీసుకుంటుందని వివరించారు. అధికారుల సమస్యల పరిష్కారానికి సంబంధించి కొనసాగుతున్న ఆందోళనల్లో భాగంగా నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అన్ని ఏరియాల ఆఫీసర్స్, ప్రతినిధుల సూచనలు తీసుకుని నల్ల బ్యాడ్జిలు ధరించడం కొనసాగించాలని ఏకగ్రీవ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఈ నెల 31 వరకు ఈ బ్యాడ్జిలు ధరించడం కొనసాగుతుందని, తరువాత కార్యాచరణను సమయానుకూలంగా తెలియజేస్తామనివారు చెప్పారు. పై అధికారుల నుండి ఎలాంటి హామీ రాలేదు కాబట్టి, ప్రస్తుతం ఆందోళనను శాంతియుతంగా నల్ల బ్యాడ్జిలు ధరించి కొనసాగించడం జరుగుతుందని తెలియజేశారు. ఈ సమావేశంలో రాష్ట్రం లోని అన్ని సింగరేణి ప్రాంతాల ఆఫీసర్స్ ప్రతినిధులు, సీఎంఓఏఐ సింగరేణి ప్రతినిధులు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు. సమస్యల పరిష్కారానికి వేగవంతమైన చర్యలు చేపట్టాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు పొనుగోటి శ్రీనివాస్, సహాయ కార్యదర్శి సిహెచ్ రాజగోపాల్, నాయకులు నజీర్, అన్ని ప్రాంతాల సింగరేణి ఆఫీసర్స్ ప్రతినిధులు, సీఎంఓఏఐ ప్రతినిధులు పాల్గొన్నారు.

# మధ్యవర్తిత్వం ద్వారా కోర్టులలోని కేసులను గణనీయంగా తగ్గించాలి

- హైకోర్టు న్యాయమూర్తి ,ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ పి.సామ్ కోషి





**వరంగల్ ఎంజీఎం, ఆగస్టు 17(జనంసాక్షి):** మధ్యవర్తిత్వం ద్వారా కోర్టులలోని కేసులను గణనీయంగా తగ్గియాలని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి పి.సామ్‌కోషి పిలుపునిచ్చారు. ఉమ్మడి వరంగల్ జిల్లా, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, జనగామ మహబూబాబాద్ జిల్లాలకు సంబంధించి ఆయా జిల్లాల న్యాయ సేవా సంస్థలు గుర్తించిన మధ్యవర్తిత్వం యొక్క భావన మరియు సాంకేతికతలపై సాధికారత పొందిన న్యాయవాదులకు “40” గంటల శిక్షణా కార్యక్రమం యొక్క వివరణ కార్యక్రమంలో హైకోర్టు జస్టిస్ పాల్గొన్నారు. సుబేదారిలోని డి.సి.సి. బ్యాంక్‌లో జస్టిస్ పి. సామ్ కోషి, తెలంగాణ రాష్ట్ర హైకోర్టు మరియు తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ, హైదరాబాద్ కార్యనిర్వాహక చైర్మన్ మాట్లాడుతూ “మధ్యవర్తిత్వం ప్రపంచీకరించబడిందని, మధ్యవర్తిత్వం కోర్టుల భారాన్ని చాలా వరకు తగ్గిస్తుందని వ్యక్తం చేశారు. శిక్షణ పొందిన మధ్యవర్తులు వారి అపారమైన అనుభవంతో న్యాయవాదులను మధ్యవర్తిగా మెలకువలు నేర్పుతారని సూచించారు. మధ్యవర్తిత్వం మొత్తం చట్టపరమైన ప్రక్రియ ద్వారా వెళ్ళకుండానే పార్టీల వివాదాలను పరిష్కరించడానికి అవకాశాలను అందిస్తుంది. కార్పొరేట్లు, వ్యాపారాలు కంపెనీలు మొదలైనవన్నీ వారి వివాదాల పరిష్కారం కోసం మధ్యవర్తిత్వాన్ని ఆశ్రయిస్తున్నారు అని తెలిపారు. మధ్యవర్తిత్వం, రాజీ అనేది రెండు పార్టీల మధ్య వివాదాన్ని పరిష్కరించడానికి సమర్థవంతమైన సాధనం, ఇరువైపుల నుండి ఎటువంటి బాహ్య ఒత్తిళ్లు లేకుండా వారి వివాదాలను పరిష్కరించుకోవడానికి వారికి ఒక వేదికను అందిస్తుంది అని తెలిపారు. మధ్యవర్తిత్వం ద్వారా సమయం, డబ్బు ఆదా అవుతుంది, వారి మధ్య శాంతి ,సామరస్యాన్ని తెస్తుంది. ఇది కక్షిదారులకు చాలా ప్రయోజనం చేకూరుస్తుంది. గ్రామీణ ప్రాంతాలలో మధ్యవర్తిత్వం వేగంగా అభివృద్ధి చెందడానికి ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు సేవలను అందించాలని సూచించారు. ఈ 40 గంటల శిక్షణ కార్యక్రమాన్ని న్యాయ వాదులు సద్వినియోగపరచుకొని, మెళకువలు నేర్చుకొని కోర్టులలోని కేసుల కక్షిదారులను మధ్యవర్తిత్వం ద్వారా రాజీ కుదుర్చుకునే విధంగా ప్రయత్నించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి జే శ్రీనివాసరావు మాట్లాడుతూ “ కక్షిదారులు తమంతట తామే వాళ్ల కోపతాపాలను వదిలిపెట్టుకొని, సమస్యలను పరిష్కరించే విధంగా మధ్యవర్తిత్వం పనిచేస్తుందని తెలిపారు. మధ్యవర్తిత్వం అత్యధిక వివాదాలను పరిష్కరించుకోవడానికి సహాయపడుతుంది అని తెలిపారు . మధ్యవర్తిత్వం ద్వారా వాణిజ్య సంబంధాలు, వ్యక్తిగత సంబంధాలు చెడిపోకుండా ఉంటుంది అని తెలిపారు .ఈ కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు వి.బి.నిర్మలా గీతాంబ, డాక్టర్ బి పట్టాభిరామా రావు ఇతర జిల్లా న్యాయమూర్తులు నారాయణ బాబు, మనీషా శ్రావణ్ ఉన్నమ్, వరంగల్, హనుమకొండ జిల్లాల న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శులు ఎం.సాయి కుమార్, క్షమా దేశ్ పాండే, బార్ కౌన్సిల్ మెంబర్లు దుస్స.జనార్ధన్, బైరపాక జయా కర్,, వరంగల్ హనుమకొండ జిల్లాల న్యాయవాదుల సంఘం అధ్యక్షులు వలుస సుధీర్, పాల్గొన్నారు.

# జిల్లాలో విస్తృతంగా పర్యటించిన కలెక్టర్



**మహబూబాబాద్ ప్రతినిధి, ఆగస్టు 17 (జనంసాక్షి):** మహబూబాబాద్ జిల్లాలోని గార్ల బయ్యారం డోర్నకల్ మరిపెడ మండలాలలో ఆదివారం జిల్లా (ఇన్చార్జి) కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో, (రెవెన్యూ) అదనపు కలెక్టర్ కె.అనిల్ కుమార్ జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యం జిల్లాలో వరదల వలన సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్ స్థాయి నుండి ప్రత్యేక అధికారులు, గ్రామస్థాయి సిబ్బంది వరకు క్షేత్రస్థాయిలోనే ఉంటూ స్థానిక పరిస్థితులను గమనిస్తూ ముందస్తు చర్యలు తీసుకొని సిద్ధంగా ఉండాలని ప్రభుత్వం, మంత్రి ఆదేశించినందున ఆదివారం అందరూ వారికి కేటాయించిన ప్రదేశాలలో విధులలో ఉన్నారు. కలెక్టర్ గార్ల మండలం రామాపురంలో లెవెల్ వంతెన సీతంపేట పెద్ద చెరువులను సందర్శించి వరద పరిస్థితిని సమీక్షించారు. ఎలాంటి ఇబ్బందికర పరిస్థితులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రత్యేక అధికారి హరి ప్రసాద్ తహసిల్దార్ ఎంపీడీవోలకు సూచించారు, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.అనిల్ కుమార్, బయ్యారం మండలం, పెద్ద చెరువు, నామాలపాడు (లో లెవెల్ వంతెన) గార్ల, డోర్నకల్ మండలం ములకలపల్లి వంతెన, మరిపేడ పురుషోత్తమాయగూడెం బ్రిడ్జి, ఎడ్జెర్ల, పెద్ద చెరువు,సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. జిల్లాలోనే (18) మండలాల ప్రత్యేక అధికారులు మండల స్థాయి బృందంతో కలిసి చెరువులు, కుంటలు ,వాగులు, వంతెనలు, బ్రిడ్జిలు అన్ని సమస్య ఆత్మక ప్రాంతాలు తనిఖీ చేస్తూ ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించడం జరుగుతుందని, సామాన్య ప్రజలు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం జరుగుతుంది. జిల్లాలో రేపటి వరకు రెడ్ అలర్ట్ ఉన్నందులో ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని ఇప్పటికే రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సూచించినందున అందరూ అప్రమత్తంగా ఉంటూ చర్యలు తీసుకోవడం జరుగుతుందా అన్నారు. ఇప్పటికే జిల్లాలో విపత్తుల నివారణ సిబ్బంది ఎన్‌డిఆర్ఎఫ్ ఎస్డిఆర్ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉన్నాయని అధికారులు హెడ్ క్వార్టర్ మైంటైన్ చేస్తూ ఉన్నారని పూర్తిస్థాయిలో ప్రస్తుతానికి జిల్లాలో ఎలాంటి ఇబ్బందికర పరిస్థితులు లేవని కలెక్టర్ అన్నారు. ఈ పర్యటనలో ప్రత్యేక అధికారులు శ్రీనివాసరావు హరిప్రసాద్ డాక్టర్ కిరణ్ కుమార్ స్థానిక తహసీల్దారులు నాగరాజు కృష్ణ వేణిశారద ఎంపీడీవోలు సంబంధిత ఇరిగేషన్ ఆర్అండ్‌బి సిబ్బంది ఉన్నారు.

# ఆర్కేపి ఏరియా ఆసుపత్రిలో మెడికల్ క్యాంప్

- కార్మికుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



**రామకృష్ణాపూర్, ఆగస్ట్ 17 (జనంసాక్షి):** సింగరేణిలో పనిచేస్తున్న కార్మికులపై యాజమాన్యం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని మందమర్రి ఏరియా జిఎం దేవేందర్ అన్నారు. ఏరియా ఆసుపత్రి డివైసీఎంవో ప్రసన్న కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం కార్మికులకు సింగరేణి ఆసుపత్రిలో మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిఎం దేవేందర్ మాట్లాడుతూ ఉత్పత్తి ఉత్పాదకతకు ప్రాధాన్యత కల్పిస్తూనే సింగరేణిని అగ్రగామిగా నిలుపుతున్న కార్మిక, వారి కుటుంబాలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండటం కొరకే ఈ క్యాంప్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. హైదరాబాద్ కార్పొరేట్ ఆసుపత్రుల నుండి కార్డియాలజిస్ట్, న్యూరాలజిస్ట్, యూరాలజిస్ట్, గాస్ట్రో వైద్య నిపుణులను ప్రత్యేక రప్పించి కార్మికులకు వైద్య పరీక్షలు చేసినట్లు తెలిపారు. పరీక్షల్లో సమస్యలు ఉన్న వారికి మెరుగైన వైద్యం అందించబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యామ్ సుందర్, ఏఐటియుసి సెంట్రల్ సెక్రటరీ అక్బర్ అలీ, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# యూరియా కోసం రైతుల ఆందోళన



**బెల్లంపల్లి, ఆగష్టు 17, (జనంసాక్షి):** బెల్లంపల్లి నియోజకవర్గం నెన్నెల మండలం మైలారం గ్రామంలో డీసీఎంఎస్ వద్ద ఆదివారం రైతులు యూరియా కోసం ఆందోళన చేపట్టారు. డీసీఎంఎస్ వద్ద రైతులకు సరి పడ యూరియా ఉన్నప్పటికీ రైతులకు పంపిణీ చేయకుండా తాత్సరం చేస్తున్నారని వెంటనే యూరియా పంపిణీ చేయాలని, యూరియా పంపిణీ చేసేంత వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని ఆందోళన చేపట్టారు. మండల వ్యవసాయ అధికారిణి సృజనకు రైతులు పిర్యాదు చేయడంతో ఆమె వెంటనే ఏఈఓ రాంచందర్ తో కలిసి మైలారం చేరుకొని పోలీసుల సహకారంతో యూరియా సరఫరా సజావుగా జరిగేలా చేశారు. యూరియా సజావుగా పంపిణీ జరగడంతో రైతులు ఆందోళన విరమించారు.

# అప్రమత్తంగా ఉండండి

- అధికారులకు మంత్రి జూపల్లి ఆదేశం



**నిర్మల్ బ్యూరో, ఆగస్టు17 (జనంసాక్షి):** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించారు. జిల్లాల్లో నెలకొన్న పరిస్థితులపై ఆదిలాబాద్, నిర్మల్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పరిస్థితిని సమీక్షించారు. శాఖల వారీగా తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. రిజర్వాయర్లకు సంబంధించిన ఇన్ ఫ్లో అవుట్ ఫ్లోల గురించి ఆరా తీశారు. క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టంపై నివేదిక తయారు చేయాలని సూచించారు. చెరువులకు, కాల్వలకు గండ్లు పడినట్లైతే వెంటనే వాటిని పూడ్చివేయాలని, రోడ్ల మరమ్మత్తులు చేపట్టాలని చెప్పారు. ఎగువన కురుస్తున్న భారీ వానల నేపథ్యంలో పెన్ గంగా ఉధృతంగా ప్రవహిస్తున్నందున ముంపు ప్రాంతాల దృష్టి పెట్టాలన్నారు. వరద నీరు నిలిచి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదమున్నందున పారిశుధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు. వైద్యారోగ్య శాఖ అవసరమైన చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అలానే త్వరతగతిన సహాయక చర్యలు చేపట్టాలని, ప్రభావిత మండలాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. ఆర్ డబ్ల్యుఎస్, హెల్త్ అధికారులు క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉండాలని చెప్పారు. ప్రమాదకరంగా పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు దాటే ప్రయత్నం చేయవద్దని ప్రజలను అప్రమత్తం చేయాలని తెలిపారు. రోడ్ల మీద నీరు పూర్తి స్థాయిలో తగ్గే వరకూ ప్రజలు బయటకు రాకూడదని, సహాయక చర్యల్లో ప్రజలు అధికారులకు సహకరించాలని మంత్రి కోరారు.

## అపార నష్టం కలిగించిన వర్షం

- ఆదుకోవాలని రైతుల వేడుకోలు



**బెల్లంపల్లి, ఆగష్టు 17 (జనంసాక్షి) :** బెల్లంపల్లి నియోజకవర్గంలో శనివారం కురిసిన భారీ వర్షం అన్నదాతలకు అపార నష్టం కలిగించింది. బెల్లంపల్లి, కాసిపేట, తాండూర్, నెన్నెల, బిమిని, కన్నెపల్లి, వేమనపల్లి మండలాల్లో వేలాది ఎకరాలు పంటలు ముంపుకు గురైంది. ఆరుగాలం కష్టపడిన రైతుకు భారీ వర్షం నిరాశ మిగిల్చింది. పంట చేను దూరంగా ఉందని ఎరువులు చేన్ల వద్ద ఉంచితే అవి కూడా కొట్టుకు పోయాయని, అసలే ఎరువుల కొరత ఉందని, అయినా ఏదో కష్టపడి సంపాదించుకుంటే అవి కూడా వర్షర్పణం అయినాయని రైతులు వాపోతున్నారు. లేకపోతే తమకుటుంబాలు అప్పుల తీర్చలేక ఆత్మహత్యలు చేసుకునే ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# కడెం ప్రాజెక్టులో గల్లంతైన వ్యక్తి

- ఎస్పీ ఆధ్వర్యంలో ముమ్మర గాలింపు
- రెస్క్యూ ఆపరేషన్‌లో ఎన్డి ఆర్ఎఫ్ బృందం



**కడెం: ఆగస్టు 17(జనంసాక్షి):** కడెం ప్రాజెక్టు దిగువ బాగాన శనివారం రోజున చేపలు పట్టడానికి వెళ్లిన కడెం మండలంలోని కన్నాపూర్ గ్రామానికి చెందిన టీ గంగాధర్ అనే జాలరి వరద ప్రవాహంలో కొట్టుకోవడంతో శనివారం రోజున వెంటనే పోలీసుల ఆధ్వర్యంలో గాలింపు చర్యలు మొదలు పెట్టినప్పటికీ ఎంత ప్రయత్నించిన గంగాధర్ ఆచూకీ తెలియకపోవడంతో ఆదివారం రోజున జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ ఆధ్వర్యంలో డ్రోన్ల సహాయంతో ప్రత్యేక ఎన్‌డిఆర్ఎఫ్ రెస్క్యూ టీంలను ఏర్పాటు చేసి ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ దగ్గరుండి అక్కడి పరిస్థితిని డోన్ల సహాయంతో పర్యవేక్షించడం జరిగింది. గజ ఈతగలను రంగంలోకి దించినప్పటికీ నీటి ప్రవాహం ఎక్కువ ఉండటం వల్ల ఆచూకీ దొరకడం లేదంటు వారు వెతికే ప్రయత్నంలో ఉన్నారని అన్నారు. అలాగే గంగాధర్ కుటుంబ సభ్యులను కలిసి అధైర్య పడకండి అంటూ ధైర్యం చెబుతూ వీలైనంత తొందరగా వెతికి పట్టుకోమంటామని వారికుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ఇచ్చారు. ఈ ఆపరేషన్‌లో జిల్లా పోలీస్‌యంత్రాంగం సిఐలు ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## నీల్వాయి ఎస్సై సస్పెండ్



**బెల్లంపల్లి , ఆగస్టు 17 (జనంసాక్షి) :** బెల్లంపల్లి నియోజకవర్గం వేమనపల్లి మండలం నీల్వాయి పోలీస్ స్టేషన్ ఎస్సై సురేష్ సస్పెండ్ అయ్యాడు. భార్యా భర్తలకు సంబంధించిన విషయంలో జోక్యం చేసుకొని బాధితున్ని లంచం డిమాండ్ చేసి ఇవ్వకపోవడంతో చితకబాదిన నేపథ్యంలో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జైపూర్ ఏసిపి వెంకటేశ్వర్లు విచారణ నిర్వహించగా నిర్ధారణ కావడంతో సస్పెన్షన్‌కు అయ్యాడు. సదరుఎస్సై పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయి నెల రోజులు కాకముందే అనవసర విషయాల్లో జోక్యం చేసుకొనివ లువురుని చితకబాదినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంపుటం గ్రామానికి చెందిన అల్లా ను కిష్టయ్య ఫిర్యాదు మేరకు ఎస్సైని సస్పెండ్ చేశారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
18 ఆగస్టు 2025

# పోలీస్ శాఖకు పింకీ జాగిలం (ట్రాకర్) అందించిన సేవలు మరువలేనివి

- జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్

**నల్గొండ బ్యూరో, ఆగష్టు 17 (జనం సాక్షి) :** నేర పరిశోధనలో సాటి లేని జాగిలం, వాసన పసిగట్టిందంటే వదిలి పెట్టని నైజం అనేక కీలక కేసులలో నేరస్థులను కనిపెట్టి పోలీస్ శాఖకు వెన్ను దన్నుగా నిలిచి దాదాపు 12 సంవత్సరాల కాలం పాటు విధి నిర్వహణలో విశేష సేవలు అందించి అనారోగ్య కారణంగా మరణించడం చాలా బాధాకరం అని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ అన్నారు. జిల్లా పోలీస్ శాఖలో డాగ్ స్క్వాడ్ లో విధులు నిర్వర్తిస్తున్న పోలీస్ జాగిలం పింకీ అనారోగ్యంతో బాధపడుతూ ఈ రోజు తుది శ్వాస విడిచింది. 2014 సంవత్సరంలో ఐఐటీ మొయినాబాద్ లో 9 నెలల పాటు డాగ్ హ్యాండ్లర్ నాగరాజు తో పాటు శిక్షణ పొంది శిక్షణా కాలంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించింది.

**పింకీ సాధించిన ఘనతలు**



ఉమ్మడి నల్లగొండ జిల్లాలో విధినిర్వహణలో భాగంగా నల్లగొండ 1 టౌన్ పరిదిలో బొట్టుగూడ లో ఒక వ్యక్తిని ముక్కలు ముక్కలుగా చేసి పలు చౌరస్తాలలో తల మొండెం వేరు చేసిన సంచలన హత్య కేసులో కీలకమైన పాత్ర పోషించింది. నల్లగొండ జిల్లా కేంద్రం లో జూలకంటి ఇంద్రారెడ్డి ఫంక్షన్ హాల్ వద్ద జరిగిన 1 కోటి 40 లక్షల రూపాయల చోరీ కేసులో గంటల వ్యవధిలో నిందితుల జాడలను తెలిపింది. గుండాల మండలం లోని వంగాల గ్రామం లో ఒక వ్యక్తిని చంపి బావిలో పడవేసిన వారం రోజుల తరువాత విషయం తెలుసుకున్న తరువాత ఈ డాగ్ తో అన్వేషణ చేస్తే నిందితుల ఇండ్ల లోకి వెళ్లి పసిగట్టింది. ఇలా పింకీ విధినిర్వహణలో చేసిన సేవలు మరువలేనివి. కాగా విధి నిర్వహణలో అనేక సేవలు అందించిన పింకీ జాగిలం భౌతిక కాయానికి ఆదివారం జిల్లా ఎస్పీ సూచనల మేరకు అడిషనల్ ఎస్పీ రమేష్ పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం శ్రద్ధాంజలి ఘటించి అధికార లాంఛనాలతో అంత్య క్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్ఐ సంతోష్, ఆర్ ఎస్సై రాజీవ్, డాగ్ హ్యాండ్లర్ నాగరాజు, డాగ్ స్క్వాడ్ సిబ్బంది కరుణాకర్, సంపత్, సతీష్, గోపాల్, మహేంద్ర, నరేష్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అగ్రికల్చర్ యూనివర్సిటీ కోసం స్థల పరిశీలన



**హుజూర్‌నగర్, ఆగస్టు 17 (జనంసాక్షి) :** అగ్రికల్చరల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసేందుకు శనివారం హుజూర్ నగర్ నియోజక వర్గంలో వివిధ చోట్ల భూములు పరిశీలించారు. హుజూర్ నగర్‌లోని మగ్దూంనగర్, పాలకీడు మండలం రాఘవపురం లోని వ్యవసాయ కళాశాల భూములను తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాధ ఉత్తమ్ కుమార్ రెడ్డి భూములను పరిశీలించారు. అగ్రికల్చరల్ యూనివర్సిటీ కోసం భూసేకరణ, మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన అంశాలను అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నందు లాల్ పవర్, అగ్రికల్చర్ వైస్ ఛాన్సలర్ జానయ్య, ఆర్డీఓ శ్రీనివాసులు, అధికారులు, సిబ్బంది, పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు వారి వెంట ఉన్నారు.

# భారీ వర్షాలతో ప్రజావాణి రద్దు

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్ బ్యూరో, ఆగస్టు 17 (జనం సాక్షి) :** జిల్లాలో మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో సోమవారం నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్టు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.వర్షాల కారణంగా జిల్లాలోని పలు మండలాల్లో నీటి ముట్టడి, రహదారుల దెబ్బతినడం వంటి సమస్యలు తలెత్తడంతో సంబంధిత శాఖల అధికారులు అవసరమైన సహాయక చర్యలు చేపడుతున్నారని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమం వచ్చే సోమవారం యథావిధిగా నిర్వహించబడుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు.

# విద్యుత్ ఆర్డినెన్స్‌ను కన్వెన్షన్ చేయాలి

- టీజియూఈఈయూ జిల్లా కార్యదర్శి కోటగిరి వెంకట నారాయణ

**మునగాల, ఆగస్టు 17 (జనంసాక్షి) :** రాష్ట్ర విద్యుత్ సంస్థలో గత 20 సంవత్సరాలుగా పనిచేస్తున్న 20వేల మంది కార్మికులను కన్వర్షన్‌గా జేఎల్ఎం, ఎల్డిసి, సబ్ ఇంజనీరింగ్ చెయ్యాలని టీజియూఈఈయూ సిఐటియు అనుబంధం జిల్లా కార్యదర్శి కోటగిరి వెంకటనారాయణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సిఐటియు కార్యాలయంలో తెలంగాణ యూనైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (టీజియూఈఈయూ) సిఐటియు అనుబంధ సంఘం 2వ మండల మహాసభ చందా సైదిరెడ్డి అధ్యక్షతనలో జరిగిన మహాసభలో టీజియూఈఈయూ జిల్లా కార్యదర్శి కోటగిరి వెంకటనారాయణ పాల్గొని మాట్లాడుతూ, విద్యుత్ సంస్థలోని మీటర్ రీడర్స్ ను, బిల్ కలెక్టర్లకు నెలసరి వేతనాలు చెల్లించాలని కోరారు. అనంతరం యూనియన్ నూతన కమిటీని తొమ్మిది మందితో ఎన్నుకోవడం జరిగింది. యూనియన్



గౌరవాధ్యక్షులుగా బచ్చలకూర స్వరాజ్యం, అధ్యక్షులుగా చింత సతీష్, కార్యదర్శిగా ఎం నాగరాజు, కోశాధికారిగా పి. కిరణ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బచ్చలకూర స్వరాజ్యం, యూనియన్ కంపెనీ కమిటీ ఆర్గనైజర్ సెక్రెటరీ సైదిరెడ్డి, యూనియన్ జిల్లా అధ్యక్షులు చిత్తలూరి నాగేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు మామిడి గోపయ్యలు పాల్గొన్నారు.

# జాతీయస్థాయి కబడ్డీ పోటీలలో జిల్లాకు పేరు తేవాలి

- క్రీడాకారులను అభినందించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**కోదాడ, ఆగస్టు 17 (జనం సాక్షి) :** జాతీయ, మరియు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో సూర్యాపేట జిల్లాకు పేరు తేవాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం హుజూర్ నగర్ లో యువ ప్రో కబడ్డీ పోటీల్లో రాష్ట్రస్థాయిలో ఎంపికైన సూర్యాపేట జిల్లా క్రీడాకారులను అభినందించారు. గ్రామీణ క్రీడాకారుల్లో ప్రతిభను ప్రోత్సహిస్తున్న సూర్యాపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు అల్లం ప్రభాకర్ రెడ్డి, నామ నరసింహారావులను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ఉన్నారు.

# ఆర్మీ మేనేజర్ నరేష్‌కు సన్మానం



**ఘట్‌కేసర్, ఆగస్ట్ 17 (జనంసాక్షి) :** భారతదేశ ప్రధాని మోడీ దృడ సంకల్పం,నిర్ణయాత్మక నాయకత్వానికి సాయుధ దళాల శక్తి మేళవింపే మహిళల సింధూరం నుండి మండిన భాస్వరం,ప్రపంచ యువనికపై ఈ దేశం ఎవ్వరికి ఎట్టి పరిస్థితుల్లోనూ తల వంచదు అని చాటి చెప్పిన గొప్ప యుద్ధ విజయం ఆపరేషన్ సింధూర్ అని కొనియాడిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడ్చల్ నియోజకవర్గ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి ఏనుగు సుదర్శన్ రెడ్డి. గతవారం రోజులుగా బీజేపీ పార్టీ నిర్ణయం మేరకు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమాలకు కొనసాగింపుగా ఆపరేషన్ సింధూర్ లో పాల్గొని సత్తా చాటిన నారపల్లి వాస్తవ్యులు మాజీ ఎంపీటీసీ సబ్యులు పల్లె మాధవి బిక్షపతి కుమారుడు ఆర్మీ మేజర్ నరేష్ కు స్వగృహంలో ఘణంగా సన్మానించారు. ఈ సందర్భంగా మేజర్ నరేష్, మోడీ అధికారం చేపట్టిన తరువాత త్రివిధ దళాలకు అందిస్తున్న అధునాతన యుద్ధ సామాగ్రి అనుక్ష త్రివిధ దళాలకు అన్ని వేళలా ఫ్రీ హ్యాండ్ ఇవ్వడం వల్ల సైన్యం యొక్క నైతిక స్థైర్యం ఏ విధంగా పెరిగి శత్రు మూకలకు దీటైన సమాధానం చెప్పగలుగుతున్నామో తెలుపుతూ సంతోషాన్ని వ్యక్తం చేశారు.

# శ్రీచౌడమ్మ తల్లికి ఘనంగా బోనాలు

- హాజరైన ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి

**జడ్చర్ల, ఆగస్టు 17 (జనంసాక్షి) :** జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో శ్రీ చౌడమ్మ తల్లి దేవతకు కావేరమ్మపేట యాదవ కులస్తులు బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం కావేరమ్మపేట నుండి ప్రారంభమైన యాదవ కులస్తుల బోనాల ర్యాలీ పట్టణ పురవీధుల గుండా ఇంద్రనగర్‌లో ఉన్న శ్రీచౌడమ్మ తల్లి దేవాలయానికి చేరుకున్నారు. బోనాల సందర్భంగా యాదవ మహిళలు చౌడమ్మ దేవాలయం దగ్గర నిర్వహించే బోనాల ఉత్సవం కోసం అవసరమైన పూజ సామాగ్రిని పసుపు, కుంకుమలతో అలంకరించిన కొత్త గంపలో పెట్టుకొని పోతురాజుల విన్యాసాలతో ర్యాలీగా బయలుదేరి వెళ్లి బోనాన్ని ముస్తాబు చేసి చౌడమ్మ తల్లికి సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పొట్టేళ్లను సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. బోనాల మహోత్సవంలో ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ పుష్పలత హాజరై యాదవ కులస్తులకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపి చౌడమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే



యాదవ కులస్తులు ప్రత్యేకంగా వాయించే డోలును (డిల్లెంపళ్లెం) మోగించి వారిలో ఆనందాన్ని నింపారు. మాజీ మంత్రి లక్ష్మారెడ్డి హాజరై చౌడమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి, యాదవ కులస్తులకు బోనాల పండుగ శు భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బోనాల ఉత్సవ కమిటీ అధ్యక్షులు చటమోని రమేష్ యాదవ్, యాదవ కులస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష ఆదరణ

- 472 మందికి వైద్య పరీక్షల నిర్వహణ



**చండూరు, ఆగష్టు 17 (జనం సాక్షి) :** మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాలకు భారీ స్పందన వస్తోంది. కాగా ఇప్పటి వరకు నిర్వహించిన ఆరు ఉచిత కంటి వైద్య శిబిరాలలో 4,355 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి 1051 మందికి కంటి శస్త్ర చికిత్సలు విజయవంతంగా పూర్తి చేశారు. ఇదిలా వుండగా ఆదివారం గట్టుప్పల మండల కేంద్రంలో నిర్వహించిన ఏడవ విడత ఉచిత కంటి వైద్య శిబిరాన్ని స్థానిక నాయకులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం కోమటిరెడ్డి సుశీలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అయితే ఈ ఏడో విడత ఉచిత వైద్య శిబిరంలో 472 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 87 మంది కంటి శస్త్ర చికిత్సలకు ఎంపికయ్యారు. శస్త్ర చికిత్సలకు ఎంపికైన వారిని వెంటనే హైదరాబాదులోని శంకర కంటి ఆసుపత్రికి తరలించడం జరిగింది. కాగా కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫీనిక్స్ ఫౌండేషన్, శంకర కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఈ ఉచిత కంటి వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నారు.

# కోటగుళ్లలో జిల్లా కలెక్టర్ కుటుంబసభ్యుల పూజలు

**గణపురం, ఆగష్టు 17 (జనం సాక్షి) :** కాకతీయుల కళాక్షేత్రం శ్రీభవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్ళ లో ఆదివారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, సతీమణి వారి కుటుంబ సభ్యులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని కోట గుళ్ళు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు వారిని ఆహ్వానించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వారు ఆలయ విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. పూజా కార్యక్రమాల



అనంతరం అర్చకులు నాగరాజు వారికి ఆశీర్వచనాలు తీర్థప్రసాదాలను అందజేసి శాలువాలు పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

# బీజేపీ జిల్లా కోశాధికారిగా కాసాల జనార్దన్ రెడ్డి



**చండూరు, ఆగష్టు 17 (జనం సాక్షి) :** భారతీయ జనతా పార్టీ నల్లగొండ జిల్లా కోశాధికారిగా చండూరు మండలం గుండ్రపల్లి గ్రామానికి చెందిన కాసాల జనార్దన్ రెడ్డి నియామకమయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం చండూరు మండల కేంద్రంలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ నాపై నమ్మకంతో నన్ను జిల్లా కోశాధికారిగా నియమించిన రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ గంగిడి మనోహర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డి మరియు సహకరించిన పార్టీ పెద్దలకు అందరికీ పేరు పేరునా ధన్యవాదాలు తెలియజేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం తన శక్తి వంచన లేకుండా పనిచేస్తానని, బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేసే దిశగా కృషి చేస్తానని, నిరంతరం పార్టీ కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. అలాగే బీజేపీ తోనే అభివృద్ధి సాధ్యమని, రాబోయే రోజుల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# ఏడేళ్ల ఎడారి జీవితం... స్వదేశంలో సుఖాంతం..

- మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవ...
- గ్రామానికి చేరుకున్న గల్ఫ్ కార్మికుడు...
- తాళ్లపల్లి ఈశ్వర్ గాథ..

**భీమదేవరపల్లి, ఆగష్టు 17 (జనం సాక్షి) :** వలస జీవితం ఎవరికి తీయనిది కాదు. స్వగ్రామం, స్నేహితులు, కుటుంబం కోసం వలసదారులు అనుభవించే వేదన వర్ణనాతీతం. అలా ఒక కూలీ, ఒక భర్త, ఒక తండ్రి, ఒక కుమారుడి గాథే తాళ్లపల్లి ఈశ్వర్‌ది. ఏడేళ్ల ఎడారి తపన ముగిసి ఆదివారం ఆయన స్వదేశపు మట్టి ముద్దాడాడు.

**సౌదీ చేరిన ఈశ్వర్... కష్టాల బాట**

భీమదేవరపల్లి మండలం కొప్పూర్ గ్రామానికి చెందిన తాళ్లపల్లి ఈశ్వర్ 2017లో ఉపాధి కోసం సౌదీ అరేబియాకు వెళ్లాడు. మొదట హౌస్ డ్రైవర్‌గా పనిచేశాడు. కానీ ఆ పని కొద్ది నెలల్లోనే పోవడంతో బలవంతంగా ఒక ఖర్జూర తోటలో కూలీగా చేరాడు. అక్కడ అతని జీవితం బానిసత్వానికంటే తక్కువేమీ కాదు. ఎండిన రొట్టెలు, చిత్తడి నీళ్లు, కఠినమైన ఎడారి వాతావరణం అన్నీ అతని దినచర్యలే. "ఒక రోజు నా పల్లెలో అడుగుపెడతా" అనే కల ఒక్కటే అతనికి బతికే బలమైంది.

**భార్య, పిల్లల కష్టాలు**

ఈశ్వర్ భార్య లత ఇద్దరు చిన్నారులతో స్వగ్రామం కొప్పూర్‌లో కష్టాల పాలైంది. భర్త కోసం రాత్రింబగళ్లు ఎదురుచూసింది.నాన్న ఎప్పుడు వస్తాడు అమ్మా" అని పిల్లలు అడిగినప్పుడు కన్నీళ్లు



మింగేసేది. పండుగలు వచ్చినా, పుట్టిన రోజులు వచ్చినా ఈశ్వర్ జ్ఞాపకమే వారికి తోడు. గ్రామంలో ఈశ్వర్ కోసం ఎదురుచూస్తున్న కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు కూడా "ఎప్పుడో వస్తాడేమో" అనే ఆశతో ఆతృతగా గడిపారు. గ్రామస్తులు తరచూ ఆయన ఇంటి దగ్గరకి వచ్చి ధైర్యం చెప్పి వెళ్ళేవారు.

**ప్రభుత్వ చొరవ... పొన్నం సహాయం**

ఈశ్వర్ భార్య లత 2025 జూన్ 27న తన ఇద్దరు కుమార్తెలతో కలిసి హైదరాబాద్ ప్రజాభవన్‌లోని 'సీఎం ప్రవాసీ ప్రజావాణి' కౌంటర్ వద్ద వినతిపత్రం సమర్పించింది. ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి ఈ సమస్య వెళ్లింది. 'సీఎం ప్రవాసీ ప్రజావాణి' నోడల్ ఆఫీసర్ దివ్యా దేవరాజన్ ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. జీఏడి ఎన్నారై విభాగం ద్వారా రియాద్‌లోని ఇండియన్ ఎంబసీ, ఢిల్లీ విదేశాంగ మంత్రిత్వ శాఖకు లేఖలు రాయబడ్డాయి. ఎన్నారై అడ్వయిజరీ కమిటీ వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి కుటుంబానికి అండగా నిలిచారు. ఇదే సమయంలో గ్లోబల్ తెలంగాణ ఫోరం అధ్యక్షుడు మహ్మద్ జబ్బార్ రియాద్ ఇండియన్ ఎంబసీతో సమన్వయం చేస్తూ చివరకు మార్గాన్ని సుగమం చేశారు.

**స్వగ్రామంలో ఆనంద భాష్పాలు**

ఈశ్వర్ ఆదివారం రావడంతో కొప్పూర్ గ్రామమంతా పండగలా మారింది. చిన్నప్పటి స్నేహితులు, బంధువులు అందరూ వచ్చారు. ఏడు సంవత్సరాల తర్వాత ఇంటికి అడుగుపెడతాడన్న సంతోషంతో తల్లి ముద్దాడే క్షణం కోసం ఆసన్నమైనది. భార్య లత, ఇద్దరు కుమార్తెలతో కలిసి ఆయనను ఆప్యాయంగా ఆహ్వానించారు.

**సుఖాంతానికి సాక్ష్యం**

ఎడారి నేలపై తీయని ఖర్జూరాలు పండించినా, అతని హృదయం మాత్రం ఎప్పుడూ మాతృభూమి కోసం ఆరాటపడుతూనే ఉంది. ఆదివారం సౌదీ నుంచి హైదరాబాద్ చేరుకొని స్వగ్రామం కొప్పూర్ కు వచ్చారు. ఏడేళ్ల కష్టతరమైన వలస జీవితం ముగిసి, తల్లి ఒడిలోకి చేరే క్షణం కోసం ఎదురుచూస్తున్న అతని గాథ ఎన్నో వలస కార్మికులకు ధైర్యం నింపుతోంది.

ఏడేళ్ల ఎడారి జీవితం... చివరికి మాతృభూమి ఒడిలో సుఖాంతం తాళ్లపల్లి ఈశ్వర్ కథ అంతే కాదు, ఇది వలస కూలీల కలలకు కొత్త వెలుగునిచ్చే స్ఫూర్తిదాయక గాథ.

# పెళ్లి ఇంటా విషాదం..

- గుండెపోటుతో పెళ్లి కుమార్తె తల్లి మృతి
- కుటుంబంలో అలముకున్న విషాదఛాయలు



**కామేపల్లి, ఆగస్టు 17 (జనంసాక్షి) :** పచ్చని పెళ్లి పందిరితో కలకలలాడిన పెళ్లి ఇంటా విషాదం చోటు- చేసుకున్న సంఘటన మండల పరిధిలోని అబ్బాస్‌పురం గ్రామంలో ఆదివారం చోటు- చేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అబ్బాస్ పురం గ్రామానికి చెందిన భానోత్ కళ్యాణి(40)మోహిలాల్ పెద్ద కుమార్తె(సింధు) వివాహం ఆదివారం జరిగింది. వివాహం అనంతరం తన కుమార్తె అత్తగారింటికి వెళుతుందని తల్లి బానోతు కళ్యాణి అలింగం చేసుకొని అప్పగింతలు చేస్తున్న తరుణంలో తల్లి ఒక్కసారిగా కుప్పకూలడంతో అప్రమత్తమైన కుటుంబసభ్యులు కళ్యాణిని ముచ్చర్ల గ్రామీణ వైద్యుల వద్దకు తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు- వైద్యులు చెప్పారు. దీంతో పెళ్లి ఇంటా విషాద ఛాయలు అలముకున్నాయి. గ్రామస్తులు కళ్యాణి మృతదేయాన్ని సందర్శించి కంటతడి పెట్టుకున్నారు.




## కవాసకి బైక్ ఇప్పుడు మరింత చవకగా..



### రూ.1.30 లక్షలు తగ్గిన కవాసకి 'కేఎల్ఎక్స్230'

**న్యూఢిల్లీ,జనంసాక్షి:**భారతదేశంలో అత్యంత ప్రజాదరణ పొందిన కవాసకి 'కేఎల్ఎక్స్230' బైకును రూ. 1.99 లక్షల (ఎక్స్-షోరూమ్, ఇండియా) ధరకు అందిస్తోంది. గత ఏడాది ఇండియన్ మార్కెట్లో లాంచ్ అయిన ఈ బైక్ ధర రూ.3.30 లక్షలు. అంటే సంస్థ ధరను లోకలైజేషన్ కారణంగా ఇప్పుడు రూ. 1.30 లక్షలు తగ్గించింది.స్థానికరణ కారణంగానే కంపెనీ తన కేఎల్ఎక్స్230 ధరను చాలా తగ్గించింది. ఇప్పుడు దేశీయ మార్కెట్లో ఈ బైక్ హీరో %శజూబశ్రీంవ% 210, కేటీఎం 390 ఎండ్యూరో ఆర్ వంటి వాటికి ప్రత్యర్థిగా ఉంటుంది.కంపెనీ తన కేఎల్ఎక్స్230 బైకును స్థానీకరణ చేయడం మాత్రమే కాకుండా.. కొన్ని యాంత్రిక మార్పులను కూడా చేసింది. ముందు భాగంలో 20 మిమీ, వెనుక 27 మిమీ సస్పెన్షన్ తగ్గించింది. అయితే రెండు చివర్లలో ఇప్పుడు పెద్ద డిస్క్ బ్రేక్‌లు ఉన్నాయి. 233 సీసీ సింగిల్-సిలిండర్ ఇంజిన్ 19 హార్స్ పవర్, 19 ఎన్ఎమ్ టార్క్ ప్రొడ్యూస్ చేస్తుంది. ఇంజిన్ 6 స్పీడ్ గేర్‌బాక్స్ పొందుతుంది.

## దేశంలోనే రెండో అత్యంత ఖరీదైన నగరంగా నిలిచిన హైదరాబాద్



హైదరాబాద్ స్థిరాస్తి రంగం ఖరీదైపోయింది. ఒకప్పుడు దేశంలోనే అందుబాటు ఇళ్ల ధరల మార్కెట్‌లో హైదరాబాద్ ముందు వరసలో నిలవగా.. ప్రస్తుతం నేషనల్ క్యాపిటల్ రీజియన్ (ఎన్ సీఆర్) తర్వాత దేశంలోనే అత్యంత ఖరీదైన రెండో నగరంగా అభివృద్ధి చెందింది. ఆధునిక వసతులు, విలాసవంతమైన జీవన శైలి, కొనుగోలుదారుల అభిరుచుల్లో మార్పులు, నిర్మాణ వ్యయాలు, భూములు, నిర్మాణ సామగ్రి ధరల పెరుగుదల వంటివి నగరంలో ఇళ్ల ధరల పెరుగుదలకు ప్రధాన కారణాలుగా నిలుస్తు న్నాయి. నగరంలో ఇళ్ల అమ్మకాల్లో విలాసవంతమైన గృహాలే ఆధిపత్యం చెలాయిస్తున్నాయి.



- దేశంలో ఎన్‌సీఆర్ తర్వాత మనదే ఖరీదైన నగరం
- విలాసవంతమైన ఇళ్ల కొనుగోళ్లకు పెరిగిన ఆసక్తి
- రూ.3 కోట్ల కంటే ఎక్కువ ధర గృహాల కొనుగోలు
- జనవరి-జూన్ మధ్య 30,553 యూనిట్ల అమ్మకం
- ఇందులో 35 శాతం వాటా లగ్జరీ గృహాలదే
- క్రెడాయ్- సీఆర్ఈ మ్యాట్రిక్స్ నివేదికలో వెల్లడి

**హైదరాబాద్,జనంసాక్షి:** ఈ ఏడాది తొలి అర్ధభాగంలో మొత్తం విక్రయాలలో రూ.3 కోట్ల కంటే ఎక్కువ ధర ఉన్న ఆస్తుల వాటా మూడో వంతు కంటే ఎక్కువగా ఉండటమే ఇందుకు ఉదాహరణ. క్రెడాయ్, సీఆర్ఈ మ్యాట్రిక్స్ తాజా గణాంకాల ప్రకారం.. జన వరి-జూన్ మధ్య కాలంలో నగరంలో రూ.56,345 కోట్ల విలువైన 30,553 ఇళ్ల విక్రయాలు జరిగాయి. ఇందులో రూ.3 కోట్ల కంటే ఎక్కువ ధర ఉన్న గృహాల విలువలో 35 శాతం వాటాను కలిగి ఉన్నా యి. రూ.1.5 కోట్ల నుంచి రూ.3 కోట్ల మధ్య ధర ఉన్న ప్రీమియం ఫ్లాట్ల వాటా మరో 34 శాతంగా ఉంది. కరోనా మహమ్మారి తర్వాత నగరంలో లగ్జరీ గృహాల మార్కెట్ పూర్తిగా మారిపోయింది. ఒక రకంగా చెప్పాలంటే కోవిడ్ లగ్జరీ ప్రాపర్టీ విభాగానికి బూస్ట్ లాగా మారింది. దీంతో నగరంలో ఏటా గృహాల ధరలు శరవేగంగా పెరుగుతు న్నాయి. సగటు టికెట్ పరిమాణం పరిశీలిస్తే.. 2024 ప్రారంభంలో రూ.1.62 కోట్లుగా ఉండగా.. ఇప్పుడది ఏకంగా రూ.1.84 కోట్లకు చేరుకుంది. ఏడాదిలో రూ.20 లక్షల వరకూ ధరలు పెరిగాయి. ఎన్‌సీఆర్ తర్వాత దేశంలో రెండో అత్యంత ఖరీదైన మార్కెట్‌గా హైదరాబాద్ అవతరించింది. నగరంలో సగటు కొనుగోలుదారుకు ఇంటి యాజమాన్యం అందుబాటులో ఉండటం లేదు. సరసమైన గృహాలు దాదాపు కనుమరుగయ్యాయి. రూ.70 లక్షల కంటే తక్కువ ధర ఉన్న ఫ్లాట్ల అమ్మకాల విలువలో కేవలం 3 శాతమే ఉండటమే ఉదాహరణ. ఇవి కూడా ఎక్కువగా ఇస్నాపూర్, ఆదిభట్ల, కిస్మత్‌పూర్, ఘట్‌కేసర్ వంటి శివారు ప్రాంతాల్లోనే కేంద్రీకృతమై ఉన్నాయి. నగరంలో అందుబాటు గృహాల కొరత తీవ్రంగా ఉంది. చాలా మంది కొనుగోలుదారులు కార్యాలయాలు, పాఠశాలలు, ఆసుపత్రులు వంటి సౌకర్యాలకు సమీపంలో ఉన్న లగ్జరీ గృహాల వైపు మొగ్గు చూపిస్తున్నారు. మాదాపూర్, హైటెక్ సిటీ వంటి పశ్చిమ హైదరాబాద్‌లో అపార్ట్‌మెంట్ కొనాలంటే చదరపు అడుగు ధర కనిష్టంగా రూ.10వేలుగా ఉండగా.. ఇతర ప్రాంతాలలో రూ.8 వేలుగా ఉంది.

## ఈ 12 యాప్స్.. చాలా ముఖ్యం



**న్యూఢిల్లీ,జనంసాక్షి:**
టెక్నాలజీ విస్తరిస్తోంది.. ప్రపంచం పరుగెడుతోంది. సమయం చాలా ముఖ్యమైపోయింది. ఇలాంటి సమయంలో స్మార్ట్‌ఫోన్ ఉపయోగించే ప్రతి ఒక్కరూ తప్పకుండా కొన్ని ప్రభుత్వ యాప్స్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఇవి మీ సమయాన్ని మాత్రమే కాకుండా.. అవసరమైన గవర్నమెంట్ సర్వీసులను ఉపయోగించుకోవ డానికి కూడా అనుమతిస్తాయి.

**ఉమాంగ్ :**
(యూనిఫైడ్ మొబైల్ అప్లికేషన్ ఫర్ న్యూ ఏజ్ గవర్నెన్స్) కేంద్ర ప్రభుత్వ సంస్థల నుంచి స్థానిక ప్రభుత్వ సంస్థల వరకు దేశవ్యాప్త ఈ-గవర్నమెంట్ సేవలను యాక్సెస్ చేయడానికి 'ఉమాంగ్' యాప్ చాలా ఉపయోగపడుతుంది. ఇందులో పీఎఫ్ క్లెయిమ్స్ అప్లై చేసుకోవడం దగ్గర నుంచి.. యుటిలిటీ బిల్లులు చెక్ చేసుకోవడం వరకు ఉన్నాయి. ఇది సుమారు 1500 కంటే ఎక్కువ ప్రభుత్వ సేవలకు ఒక ప్లాట్‌ఫామ్.

**పన్ను చెల్లింపుదారుల కోసం ఏఐఎస్:**
ఏఐఎస్ యాప్ అనేది.. భారత ప్రభుత్వ ఆదాయపు పన్ను శాఖ అందించే ఫ్రీ మొబైల్ అప్లికేషన్. యాన్యువల్ ఇన్ఫర్మేషన్ స్టేట్‌మెంట్ కు సంబంధించిన సమాచారాన్ని అందించడమే ముఖ్య ఉద్దేశ్యంగా ఈ యాప్ పనిచేస్తుంది. ఇందులో పన్ను చెల్లింపుదారులు తమ అభిప్రాయాలను అందించవచ్చు.

**డిజిలాకర్:**
డిజిలాకర్ అనేది.. భారతదేశంలో ప్రభుత్వ మద్దతుతో పనిచేసే అప్లికేషన్. డిజిటల్ ఇండియా కార్యక్రమం కింద ఎలక్ట్రానిక్స్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ దీనిని ప్రారంభించారు. పేపర్‌లెస్ పాలనను ప్రోత్సహించ డానికి ప్రారంభించిన ఈ అప్లికేషన్ ముఖ్యమైన డాక్యు మెంట్స్ (ఆధార్, పాన్, డ్రైవింగ్ లైసెన్స్ మొదలైనవి) స్టోర్ చేసుకోవడానికి ఉపయోగపడుతుంది. ఇందులో డాక్యుమెంట్స్ ఉంటే ఫిజికల్ కాపీలను చూపించాల్సిన అవసరం లేదు.

**డిజియాత్ర:**
విమానాశ్రయాలలో వేగవంతమైన చెక్-ఇన్‌ల కోసం డిజియాత్ర చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ప్రస్తుతం ఇది అనేక ప్రధాన నగరాల్లో పనిచేస్తుంది.

**ఆర్‌బీఐరిటైల్ డైరెక్ట్:**
బ్రోకర్ అవసరం లేకుండా నేరుగా ప్రభుత్వ సెక్యూరిటీలలో పెట్టుబడి పెట్టడానికి ఇది పయోగపడుతుంది. ఇదిచాలాసురక్షితమైనది, పారదర్శకమైనది. అంతే కాకుండా పెట్టు బ డికి సంబంధించిన మొత్తం ప్రక్రియ ఆన్‌లైన్‌లోనే ఉంటుంది.

**పోస్ట్ఇన్ఫో:**
పోస్ట్ఇన్ఫో అనేది ఇండియా పోస్ట్ యాప్. దీని ద్వారా స్పీడ్ పోస్ట్‌లను ట్రాక్ చేయవచ్చు. పోస్టల్ ధరలను చెక్ చేసుకోవచ్చు. మీకు సమీపంలో ఏ పోస్టాఫీసులు ఉన్నాయనే విషయాన్ని తెలుసుకోవడానికి ఇది ఉపయోగపడుతుంది.

**స్వయం:**
స్వయం యాప్ ద్వారా అగ్రశ్రేణి సంస్థల నుంచి పాఠశాల విద్య నుంచి ఉన్నత విద్య వరకు ప్రతిదానిని కవర్ చేయవచ్చు. ఇందులో ఫ్రీ ఆన్‌లైన్ కోర్సులను పొందవచ్చు. విద్యార్థులకు ఇది చాలా ఉపయోగకరంగా ఉంటుంది.

**112 ఇండియా:**
పోలీసులు, అగ్నిమాపక అంబులెన్స్ సేవలను తక్షణమే పొందటానికి 112 ఇండియా యాప్ ఉపయోగపడుతుంది. ఇది ఆండ్రాయిడ్ బేస్డ్ యాప్, దీనిని పౌరులు అత్యవసర సమయంలో సహాయం కోరడానికి ఉపయోగించవచ్చు.

**భీమ్ యూపీఐ:**
భీమ్ యూపీఐ అనేది నగదు రహిత లావాదేవీలను అనుమతిస్తుంది. ఇది ప్రభుత్వ యూపీఐ యాప్. ఇది సింపుల్ అండ్ సెక్యూర్ కూడా.

**నెక్స్ట్‌జెన్ ఎంపరివాహన్:**
ఆర్‌సీ, డీఎల్ యొక్క డిజిటల్ వెర్షన్‌లను యాక్సెస్ చేయడానికి మాత్రమే కాకుండా.. చలాన్‌లను చెక్ చేయడానికి నెక్స్ట్‌జెన్ ఎంపరివాహన్ యాప్ ఉపయోగపడుతుంది.

**దీక్ష :**
దీక్ష అనేది పాఠశాల విద్యార్థులు.. ఉపాధ్యాయుల కోసం ఉపయోగపడే ఒక ఇ-లెర్నింగ్ యాప్. ఇది పాఠ్యాంశాలకు అనుగుణంగా నాణ్యమైన విద్యా కంటెంట్‌ను అందిస్తుంది.

**జన్ ఔషధి సుగం:**
సరసమైన ధరలకు జనరిక్ మందులను, సమీపంలోని జన్ ఔషధి కేంద్ర స్థానాలను సులభంగా కనుగొనడానికి 'జన్ ఔషధి సుగం' యాప్ ఉపయోగపడుతుంది.

## గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
| --- | --- |
| ₹ 4.85 | ₹ 4.87 |

### బంగారం ధరలు (10 గ్రాములు)
హైదరాబాద్

| ₹ 92,900 (22 క్యారెట్లు) | ₹ 1,01,180 (24 క్యారెట్లు) |
| --- | --- |

### వెండి ధరలు (కేజీ)
హైదరాబాద్

₹ 1,26,200

## గవర్నర్ X స్టాలిన్..



## మరోసారి భగ్గుమన్న విభేదాలు

**చెన్నై,జనంసాక్షి:** తమిళనాడు సర్కార్‌కి, గవర్నర్ ఆర్ఎన్ రవికి మధ్య అభిప్రాయ భేదాలు మరోసారి భగ్గుమన్నా యి. తాజాగా గవర్నర్‌పై ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.ప్రతిపక్షాల కంటే గవర్నర్ చౌకబారు రాజకీయాలు చేస్తున్నారంటూ దుయ్యబట్టారు. విభేదాలు మరోసారి బహిర్గతం అవ్వడంతో ఆ రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం కలిగిస్తోంది. ఆదివారం ఆయన ధర్మపురిలో ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతూ.. గవర్నర్‌పై తీవ్రస్థాయిలో నిప్పులు చెరిగారు.'ప్రతిపక్షాలు చేసే విమర్శలపై తనకు ఆందోళన లేదన్న స్టాలిన్.. అవన్నీ రాజకీయాల్లో సహజమన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నియమించిన గవర్నర్ రవి.. వారి కంటే చౌకబారు రాజకీయాలు చేస్తున్నారంటూ వ్యాఖ్యానించారు. రాజ్‌భవన్‌లో ఉండి అధికార డీఎంకేకు వ్యతిరేకంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రభుత్వం ప్రతిపాదించిన బిల్లులను గవర్నర్ ఆమోదించకపోవడంపై స్టాలిన్ మండిపడ్డారు. తమిళ గీతాన్ని కూడా అగౌరవ పరుస్తారంటూ గవర్నర్‌పై ఆయన విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు, మహిళ భద్రత, విద్యారంగంపై గవర్నర్ ఆధారాలు లేని ఆరోపణలు చేశారంటూ స్టాలిన్ మండిపడ్డారు. తమిళనాడు దేశంలోనే అగ్ర రాష్ట్రమని కేంద్ర గణాంకాలే చెబుతున్నాయని స్టాలిన్ కౌంటర్ ఇచ్చారు."తమిళనాడు ప్రజల కోసం మా ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు దేశానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయి. కానీ కొంతమంది అసత్య ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారు" అంటూ స్టాలిన్ మండిపడ్డారు.



## నిమిషానికి లక్ష టికెట్లు

### రైలు టికెట్లు రయ్‌మని బుక్ అయ్యేలా.. కొత్త అప్‌గ్రేడ్ వస్తోంది

**న్యూఢిల్లీ,జనంసాక్షి:**దేశవ్యాప్తంగా కోట్లాది మంది ప్రయాణికులు ఉపయోగించే ఇండియన్ రైల్వే టికెట్ బుకింగ్ వ్యవస్థలో భారీ మార్పులు చోటుచేసుకుంటున్నాయి. రైల్వే శాఖ కొత్తగా తీసుకొస్తున్న డిజిటల్ అప్‌గ్రేడ్ ద్వారా టికెట్ బుకింగ్ వేగం నాలుగు రెట్లు పెరగనుంది. పండుగ కాలాల్లో, ప్రత్యేక రైళ్ల సమయంలో, లేదా జనరల్ టికెట్ల కోసం పోటీ ఎక్కువగా ఉండే సందర్భాల్లో ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఆలస్యం, సాంకేతిక సమస్యలు తగ్గనున్నాయి. కొత్త పాసింజర్ రిజర్వేషన్ సిస్టమ్ ద్వారా నిమిషానికి 1 లక్ష టికెట్లు బుక్ చేయగల సామర్థ్యం కలుగుతుంది. పీఆర్ఎస్‌కు ప్రస్తుతం నిమిషానికి 25,000 టికెట్లు బుక్ చేసే సామర్థ్యం ఉంది. ఈ అప్‌గ్రేడ్‌లో భాగంగా క్లౌడ్ ఆధారిత సాఫ్ట్‌వేర్, మెరుగైన నెట్‌వర్క్, భద్రతా వ్యవస్థలు, ఆధునిక హార్డ్‌వేర్ అమలు చేయబోతున్నారు.ప్రయాణ అనుభవాన్ని మరింత సులభతరం చేయడానికి రైల్వే శాఖ రైల్‌వన్ అనే కొత్త సూపర్ యాప్‌ను కూడా ఇటీవల ప్రారంభించింది. ఈ యాప్ ద్వారా ప్రయాణికులు రిజర్వేషన్, పీఎన్ఆర్ స్టేటస్, కోచ్ పొజిషన్, ఫుడ్ ఆర్డర్, ఫీడ్‌బ్యాక్ వంటి సేవలను ఒకే చోట పొందగలుగుతారు. రైల్‌వన్ యాప్‌లో సింగిల్ సైన్-ఆన్ విధానం అమలులో ఉంది. దీని ద్వారా బయోమెట్రిక్ లేదా ఎంపిన్ ద్వారా లాగిన్ చేయవచ్చు. పలు ప్రాంతీయ భాషల మద్దతుతో, ఈ యాప్ గ్రామీణ, ప్రాంతీయ ప్రయాణికులకు మరింత సౌలభ్యం కలిగిస్తోంది.అడ్వాన్స్ రిజర్వేషన్ పీరియడ్ పరిమితిని కూడా రైల్వే శాఖ ఇదివరకే తగ్గించింది. అప్పటివరకు ప్రయాణానికి 120 రోజుల ముందు టికెట్ బుక్ చేసుకునే అవకాశం ఉండగా, నవంబర్ 1, 2024 నుంచి దీన్ని 60 రోజులకు పరిమితం చేసింది. ఇక దీపావళి, ఛత్ పూజా వంటి పండుగల సందర్భంగా ప్రయాణికులకు ఊరట కలిగించేందుకు, రైల్వే శాఖ ఫెస్టివల్ రౌండప్ ట్రిప్ స్కీమ్‌ను ప్రవేశపెట్టింది. ఈ స్కీమ్ కింద అక్టోబర్ 13-26, నవంబర్ 17-డిసెంబర్ 1 మధ్య రిటర్న్ టికెట్లపై 20% డిస్కౌంట్ అందిస్తోంది.

## పాక్ పట్టాలు తప్పిన రైలు..

### ఒకరు మృతి, పలువురికి గాయాలు

**ఇస్లామాబాద్,జనంసాక్షి:** పాకిస్తాన్‌లో ఓ రైలు పట్టాలు తప్పింది. ఆదివారం నాడు లోధ్రాన్ జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది. పెషావర్ నుండి కరాచీకి వెళ్తున్న అవామ్ ఎక్స్‌ప్రెస్ రైలు లాహోర్‌కు దాదాపు 400 కి.మీ దూరంలో పట్టాలు తప్పింది. ఈ ప్రమాదంలో నాలుగు కోచ్‌లు చెల్లాచెదురయ్యాయి. డిప్యూటీ కమిషనర్ లుబ్నా నజీర్ విలేకరులతో మాట్లాడుతూ ఈ ప్రమాదంలో ఒక ప్రయాణికుడు ప్రాణాలు కోల్పోగా, మరో 25 మంది గాయపడ్డారని, వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నదన్నారు.ప్రమాదం జరిగిన వెంటనే రెస్క్యూ బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని, గాయపడిన వారిని ఆసుపత్రులకు తరలించాయి. అధికారులు దెబ్బతిన్న కోచ్‌లను పక్కకు తొలగిస్తున్నారు. ట్రాక్‌ను పునరుద్ధరించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఈ నెలలో పాక్‌లోని పంజాబ్‌లో ఇది మూడవ రైలు ప్రమాదం. కొన్ని రోజుల క్రితం ముసా పాక్ ఎక్స్‌ప్రెస్ రైవిండ్ వద్ద పట్టాలు తప్పింది. ఈ ప్రమాదంలో ఐదుగురు ప్రయాణికులు గాయపడ్డారు. ఆగస్టు ప్రారంభంలో ఇస్లామాబాద్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పింది. నాడు 10 కోచ్‌లు బోల్తాపడి, 30 మంది గాయపడ్డారు. వరుస రైలు ప్రమాదాలు ఆందోళనకు గురిచేస్తున్నాయి.



## భారత్ వ్యక్తిని పెళ్లాడిన బ్రెజిలియన్ ముద్దుగుమ్మ..!





ప్రేమ అంటే ఇదేరా అనేలా ఉండేలా ఎన్నో లవ్ స్టోరీలను చూశాం. వాటన్నింటిలో ప్రేమ ప్రేమే. దాని కోసం ఏం చేయడానికైనా రెడీ అన??ట్లుగా సిద్ధపడుతున్న ప్రేమికులు గాథల వింటుంటే ఆశ్చర్యంగా ఉంటుంది.ఎల్లలు, సరిహద్దు దాటి ఎన్నో ప్రయాసలు పడి ఒక్కటైన జంటలెందరినో చూశాం. కానీ ఇక్కడ ఈ జంట అంత కష్టాలు చవి చూడకపోయినా..వీరిద్దరూ ఒక్కటైనా విధం చూస్తే..ఎక్కడైన లవ్వు..లవ్వే కథ అనిపిస్తుంది. మరి ఆ జంట అందమైన కథేంటో చకచక్క చదివేయండి మరి..బ్రెజిలియన్ మహిళ తైనాషా భారతీయ వ్యక్తిని పెళ్లాడింది. ఎలా తమ ప్రేమ చిగురించి పెళ్లిపీటలక్కెందో సోషల్ మీడియా వేదికగా షేర్ చేసుకుంది. తామిద్దరం విభిన్న సంస్కృతి, సంప్రదాయాలకు చెందిన వాళ్లం. కానీ తాను ఆ గుజరాతి వ్యక్తితో ఆశ్చర్యకరంగా ప్రేమలో పడిపోయానని అంటోంది. 2020 కోవడిడ్ 19 సమంయంలో ఇద్దరు ఆన్‌లైన్ కలుసుకున్నారు.ఇంకా అప్పటికీ టీకాలు వేయించుకోని క్రిటికల్ టైంలో ఆమెను కలవాలని గుజరాతీ భర్త పడిన ప్రయాసను చూసి..ఫస్ట్ మీట్‌లోనే అతని ప్రేమకు ఫిదా అయి లవ్‌లో పడిపోయిందట. ప్రేమలో పడిన ఐదునెలలకే ఇద్దరు పెళ్లిచేసుకున్నాం అని పేర్కొంది. తమ వివాహం బ్రెజిల్‌లోనే జరిగిందని, తమ పెళ్లిని తన భర్త తరుపు భారతీయ కుటుంబం కూడా అంగీకరించిందని చెప్పుకొచ్చింది తైనా.తామిద్దరిది వేర్వేరు నేపథ్యమే అయినా..మా మధ్య ఉన్న అభిమానం, ప్రేమ రోజు రోజుకి మరింతగా బలపడుతుందని, ఇంతవరకు తమ దాంపత్య జీవితాన్ని విజయవంతంగా లీడ్ చేయగలిగేలా చేసినా ఈ విశ్వానికి సదా కృతజ్ఞతలు అని చెబుతోంది తైనా. ఆ దంపతుల ప్రేమ కథ నెటిజన్లను తెగ ఆకర్షించడమే గాక, ఎక్కడైన ప్రేమ.. ప్రేమే..దానికున్న శక్తి అనంతం, అజేయం అంటూ ఆ జంటని ప్రశంసిస్తూ ఆశీర్వదించారు.

## ఎన్డీఏ ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ఎన్డీయే తరఫున ఉప రాష్ట్రపతి అభ్యర్థి ఎవరనే ఉత్కంఠకు తెరపడింది. ఇవాళ దిల్లీలో సమావేశమైన భాజపా పార్లమెంటరీ పార్టీ బోర్డు దీనిపై కీలక నిర్ణయం తీసుకుంది. ఎన్డీఏ ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్ పేరును ఖరారు చేసినట్టు భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ప్రకటించారు. 1957 మే 4న జన్మించిన సీపీ రాధాకృష్ణన్.. తమిళనాడులోని కోయంబత్తూరు లోక్‌సభ స్థానం నుంచి రెండు సార్లు భాజపా తరుపున ఎంపీగా ఎన్నికయ్యారు. తమిళనాడు భాజపా రాష్ట్ర అధ్యక్షుడిగానూ పనిచేశారు. 2016 నుంచి 2019 వరకు ఆల్ ఇండియా కాయర్ బోర్డ్ ఛైర్మన్‌గా సేవలందించారు. తమిళనాడు భాజపా సీనియర్ నాయకుల్లో ఒకరిగా గుర్తింపు పొందారు.

## పిల్లలు కనడానికి సిద్ధమవుతున్న రోబోలు!



**న్యూఢిల్లీ,జనంసాక్షి:**స్త్రీ, పురుషుల కలయికతో పిల్లలు పుట్టడం సర్వసాధారణం. ఇప్పుడు టెక్నాలజీ పెరగడంతో టెస్ట్ ట్యూబ్ బేబీలు పుడుతున్నారు. సరోగసీ ద్వారా కూడా పిల్లలను కంటున్నారు.అయితే శిశువు పుట్టడానికి మనిషి గర్భమే అవసరం లేదంటూ.. చైనా శాస్త్రవేత్తలు పరిశోధనలు చేస్తున్నారు. దీనికోసం ప్రత్యేకంగా 'గర్భధారణ రోబోట్'లను సృష్టిస్తున్నారు. వినడానికి ఇది వింతగా ఉన్నా.. దీనికి సంబంధించిన మరిన్ని ఆసక్తికరమైన విషయాలు తెలుసుకోవాలంటే, ఈ కథనం చదవాల్సిందే.. ప్రపంచంలోనే మొట్టమొదటి 'గర్భధారణ రోబోట్'పై చైనా శాస్త్రవేత్తలు పని చేస్తున్నారని, ఇది సజీవ శిశువుకు జన్మనిస్తుందని ది టెలిగ్రాఫ్ నివేదించింది. ఈ టెక్నాలజీ గర్భధారణ నుంచి ప్రసవం వరకు గర్భధారణకు కావలసిన అన్ని విషయాలను అనుకరిస్తుందని నిపుణులు పేర్కొన్నారు.పిండం అనేది గర్భధారణ రోబో.. కృత్రిమ గర్భంలోనే పెరుగుతుంది. పిండాలకు కావలసిన పోషకాలు అన్నీ కూడా ట్యూబ్స్ ద్వారా అందిస్తారు. అయితే అండం, స్పెర్మ్ ఎలా.. ఎక్కడ ఫలదీకరణం అవుతుందనే విషయాలను ప్రస్తుతానికి శాస్త్రవేత్తలు వెల్లడించలేదు. సింగపూర్‌లోని నాన్యాంగ్ టెక్నలాజికల్ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్త డాక్టర్ 'జాంగ్ కిఫెంగ్' నేతృత్వంలోని గ్వాంగ్‌జౌకు చెందిన కైవా టెక్నాలజీ ఈ రోబోను అభివృద్ధి చేస్తోంది.ఈ టెక్నాలజీ విజయవంతమైతే.. సంతానం లేని జంటలకు లేదా జీవసంబంధమైన గర్భధారణ చేయించుకోవడానికి ఇష్టపడని వారికి చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ప్రస్తుతం ఈ టెక్నాలజీ పరిణతి చెందిన దశలో ఉందని డాక్టర్ జాంగ్ పేర్కొన్నారు. పిండం.. రోబోట్ కృత్రిమ గర్భంలో పెరగడానికి కావలసిన జాగ్రత్తలు తీసుకుంటున్నాము. ఈ రోబోట్ నమూనా 2026 నాటికి అందుబాటులోకి రానున్నట్లు సమాచారం.మనిషి గర్భంతో పనిలేకుండా రాబోయే టెక్నాలజీ బాగానే ఉంది. కానీ ఇది ప్రతికూల ప్రభావాలకు దారి తీస్తుందేమో అని కొందరు అభిప్రాయపడుతున్నారు. తల్లి, బిడ్డల పేగు బంధం లేకపోతే.. పిల్లల మానసిక ప్రభావం ఎలా ఉండబోతుందో అని ఆందోళన చెందుతున్నారు. అంతే కాకుండా ఇది చట్టపరంగా సాధ్యమేనా?, చట్టాలు దీనికి ఒప్పుకుంటాయా అనే అనుమానాలు కూడా వ్యక్తం చేస్తున్నారు.




# చెరువుల్లా... రహదారులు

## రోడ్లపైనే వర్షపు నీరు, మురుగు నీరు

**సహజసిద్ధమైన కాలువలను పునరుద్ధరించాలని కోరుతున్న ప్రజలు**

**నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో సహజసిద్ధ కుంటలు, కాలువలు రియల్టర్ల స్వార్థంతో కనుమరుగై, రహదారులు వర్షపు నీటితో జలమయమై, చెరువులను తలపిస్తున్నాయి. ఉయ్యాలవాడ, గీతాంజలి కళాశాల వెనుక, పాత ఆర్టీఓ కార్యాలయం సమీపంలోని కుంటలు అక్రమ నిర్మాణాల కింద మాయమయ్యాయి. నెల్లికొండ చౌరస్తా వద్ద కుంటలను ధ్వంసం చేసి, మట్టి నింపినా అధికారుల నిర్లక్ష్యం హృదయాలను కలచివేస్తోంది. వర్షపు నీరు పొలాలు, ఇళ్లలో నిలిచి, రహదారులపై మురుగునీరు ప్రవహిస్తూ ప్రజల జీవనాన్ని దుర్భరం చేస్తోంది. బస్ డిపో సమీపంలోని బ్రిడ్జి వద్ద కాలువలను పూడ్చి, అక్రమ ఫెన్సింగ్‌లతో నీటి ప్రవాహం అడ్డుకోవడం వాహనదారులకు, రైతులకు కష్టాలను మిగిల్చింది. ప్రకృతి సంపదను కాపాడాల్సిన అధికారుల నిర్లక్ష్యంపై ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తూ, కాలువల పునరుద్ధరణ కోసం కోరుతున్నారు.**

**నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో, ఆగస్టు 14(జనంసాక్షి):** నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంతో పాటు పరిసర మున్సిపల్ పరిధిలోని గ్రామాలలో గల కుంట కట్టలను రియాల్టర్లు ధ్వంసం చేసి ప్లాట్లు గా మార్చడంతో రోడ్లపైనే వర్షపు నీరు మురుగునీరు ప్రవహిస్తోంది. ఉయ్యాల వాడ శివారులోని సుమారు మూడు కుంటలు రియాల్టర్ల దెబ్బకు కను మరుగయ్యాయి. దీనికి తోడు సహజ సిద్ధంగా కుంటలలోకి వర్షపు నీరు చేరాల్సిన కాలువలను సైతం ధ్వంసం చేసి అక్రమంగా నిర్మాణాలు చేపట్టారు. అదేవిధంగా కుంటల అలుగులను ధ్వంసం చేసి ఆ కాలువలను సైతం పూడ్చి వేసి ప్లాట్లుగా మార్చారు. గీతాంజలి జూనియర్ కళాశాల వెనుక భాగం లోని కుంటతోపాటు పాత ఆర్టిఓ కార్యాలయం వద్ద ఉన్న కుంట సైతం ధ్వంసం చేసి ప్లాట్లు మార్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. అదేవిధంగా హౌసింగ్ బోర్డ్ పరిసర ప్రాంతాలలో సైతం గతంలో ఉన్న కుంటలు కుంటలకు సంబంధించి రెవెన్యూ , ఇరిగేషన్ శాఖ నక్ష లో ఉన్న కుంటలు కాలువలు సైతం ధ్వంసం చేసి నిర్మాణాలు చేపట్టడం ద్వారా వర్షపు నీరు పంట పొలాలు ఇళ్ల మధ్య నిలవడమే కాకుండా ప్రధాన రహదారులు అన్నీ జలమయంగా మారుతున్నాయి. సహజ సిద్ధంగా ఉన్న కాలువలను కాపాడాల్సిన అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడం వల్లే ఈ విధ్వంసం జరుగుతుందన్న ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. నెల్లికొండ గ్రామంలోని కుంటను కొందరు రియాల్టర్లు స్వార్థంతో కబ్జాలకు పాల్పడి ప్లాట్లుగా మార్చినా అధికార యంత్రాంగం పట్టించుకోక పోవడం లో అంతర్యం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అక్రమార్కులు అంతటితో ఆగకుండా కుంటలో నీరు నిలవకుండా కట్టను ధ్వంసం చేసి మార్కెట్ యార్డ్ ముందు భాగం నుంచి నీరు పోయే విధంగా గండి కొట్టడం వల్ల నెల్లికొండచౌరస్తా రోడ్డుకు ఇరువైపులా చెరువులను తలపించే విధంగా నీరు నిల్వ ఉండడం వల్ల ప్రజలు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

సాక్షాత్తు నెల్లికొండ చౌరస్తా వద్ద కుంట ను ధ్వంసం చేసి అక్రమార్కులు మట్టిని నింపిన అధికారులకు చీమకుట్టినట్లు కూడా లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ నీరు సైతం ఆ పరిసర ప్రాంతాలలో నిలువ ఉండడం వల్ల చెరువును తలపిస్తుంది.

దీనికి తోడు బస్ డిపో సమీపంలోని బ్రిడ్జి కి ఇరువైపులా సహజ సిద్ధంగా నీరుపో వెళ్లాల్సిన కాల్వలను పూడ్చివేసి వ్యాపారాలకు అనుకూలంగా మలుచుకోవడానికి మట్టి నింపడం వల్ల ప్రధాన రహదారిపై నీరు చేరి వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కొందరు అక్రమార్కులు అంతటితో ఆగకుండా తమ భూమి కంటే ముందు వరకు ఫెన్సింగ్ చేసుకొని నీరు వెళ్లకుండా మట్టినింపడం వల్ల రోడ్డుపై వర్షపు నీరు చేరి ఇబ్బందులు పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అధికార యంత్రాంగం స్పందించి సహజసిద్ధమైన కాలువలను పునరుద్ధరించాలని అక్రమార్కులు కుంటలకు కొట్టిన గండ్లను పూడ్చి నీరు నిల్వ ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.







# జిల్లా ఉత్తమ సహకార అధికారిగా సర్దార్ సింగ్

- **రూ.6 కోట్లతో సహకార సంఘాలలో అభివృద్ధి పనులు**



**ములుగు ప్రతినిధి, ఆగస్టు 16(జనంసాక్షి) :** ములుగు జిల్లా డిసిఓ సర్దార్ సింగ్‌కు 79వ స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకొని జిల్లా ఉత్తమ అధికారి అవార్డు వరించింది. ఈ అవార్డును పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క చేతుల మీదుగా అందుకు న్నారు. వృత్తినే దైవంగా భావించే ఆ అధికారికి అవార్డు రావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా సహకార అధికారిగా విధుల్లో చేరినప్పటి నుండి ములుగు జిల్లాలో ఉన్న పిఏసిఎస్ ల పనితీరు మెరుగుపడింది. డిసిఓ గా సర్దార్ సింగ్ బాధ్యతలు స్వీకరించినప్పటి నుండి ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 12 సహకార సంఘాలలో సుమారు 6 కోట్లతో పక్కా కార్యాలయ భవనాలు, గోదాములు నిర్మించారు. మల్లంపల్లి కొత్త మండల కేంద్రంలో పిఏసిఎస్ కార్యాలయ భవనము, 500 మెట్రిక్ టన్నుల గోదాము, వెంకటాపూర్ మండల కేంద్రంలో మూడంతస్తుల కార్యాలయ భవనము, నల్లగుంటలో 500 మెట్రిక్ టన్నుల గోదాము, ఇంచెర్ల లో కార్యాలయ భవనము, గోవిందరావుపేట మండలంలోని చల్వాయిలో 500 మెట్రిక్ టన్ల గోదాము, పస్రా లో 1000 మెట్రిక్ టన్నుల గోదాము, ములుగు జిల్లా కేంద్రంలో 1000 మెట్రిక్ టన్ల గోదాము, తాడ్వాయి మండలం కాటాపూర్ లో కార్యాలయ భవనము, 300 మెట్రిక్ టన్నుల గోదాము, ఏటూరునాగారం లో ఆఫీసు నిర్మాణానికి ఐదు గుంటల స్థలం కేటాయింపు, మంగపేట మండలంలో మూడంతస్తుల బిల్డింగు, ఆఫీస్ కాంప్లెక్స్ 1000 మెట్రిక్ టన్నుల గోదాము, రాజుపేటలో ఆఫీస్ బిల్డింగు, వాజేడు లో 8 ఎకరాల ల్యాండ్ కేటాయింపు, నర్సాపూర్ లో ఆఫీసు కార్యాలయం భవనం పై అంతస్తు నిర్మాణం, అలాగే ములుగు సొసైటీలో గోల్డ్ లోను, మంగపేట సొసైటీలో గోల్డ్ లోను ఇచ్చేలా చర్యలు తీసుకున్నారు. అలాగే తెలంగాణ రాష్ట్రంలోనే అత్యధిక పర్సంటేజీ 12 సంఘాలకు, 8 సంఘాలను ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ గా ఏర్పాటు చేయడం జరిగింది ఒక్కొక్క సొసైటీకి ఇప్పటికే రూ. 3 లక్షలు వారి అకౌంట్లో జమ కావడం జరిగింది. అలాగే మొత్తము కేంద్ర ప్రభుత్వం నుండి మరో 30 లక్షల వరకు సొసైటీలకు లబ్ధి చేకూరనుంది. ములుగు డిసిఓ సర్దార్ సింగ్ నిత్యం విధినిర్వహణలో ఉంటూ రైతులకు ఎలాంటి సమస్యలు వచ్చినా ముందుండి వారి సమస్యలు పరిష్కరించేందుకు ఎంతో నిబద్ధతతో వ్యవహరిస్తున్నారు. ప్రతి ఏటా ఖరీఫ్, రబి సీజన్లలో సీఎంఆర్ ధాన్యం విక్రయించడంలో రైతులకు ఇబ్బందులు కలగకుండా చూస్తున్నారు.

**రైతులు ప్రతి ఒక్కరు మెంబర్ షిప్ కలిగి ఉండాలి :**
**ములుగు డిసిఓ సర్దార్ సింగ్**

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ఉన్న రైతులు ప్రతి ఒక్కరు మెంబర్ షిప్ పొంది ఉండాలని ములుగు డిసిఒ సర్దార్ సింగ్ సూచించారు. రైతులు భూసారాన్ని కాపాడేందుకు గాను రసాయన ఎరువుల వినియోగం తగ్గించి సేంద్రియ ఎరువుల వినియోగం పెంచాలని ఆయన అన్నారు.



# మూడున్నరేండ్ల తర్వాత గెలిచిన సర్పంచ్

**సుప్రీంకోర్టు ఆదేశంతో ఈవీఎం ఓట్ల రీ కౌంటింగ్**

"న్యాయవ్యవస్థపై ఇంకా ఆశలున్నాయి. సుప్రీం కోర్టు తీర్పుతో మేం పూర్తిగా సంతృప్తి చెందాం. ఈ నిర్ణయంతో న్యాయవ్యవస్థపై మా నమ్మకం మరింత బలపడింది" సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈవీఎంలను తిరిగి లెక్కించి, తనను సర్పంచ్ పదవికి ఎన్నికైనట్టు ప్రకటించిన సందర్భంగా హరియాణాకు చెందిన మోహిత్ కుమార్ ఈ వ్యాఖ్యలు చేశారు. మూడేళ్ల కిందట వెల్లడైన ఎన్నికల ఫలితం పొరపాటున జరిగిందా? లేదా ఉద్దేశపూర్వకమా అనేది చెప్పడం కష్టమని, దీనిపై దర్యాప్తు జరగాలని మోహిత్ కుమార్ డిమాండ్ చేశారు. దాదాపు మూడేళ్ల న్యాయ పోరాటం తర్వాత, ఆగస్టు 11న వెల్లడైన సుప్రీంకోర్టు తీర్పు మేరకు హరియాణాలోని పానిపట్ జిల్లాలో బువానా లఖు గ్రామానికి చెందిన మోహిత్ కుమార్ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో 51 ఓట్ల తేడాతో గెలిచారు. ఈ పంచాయతీకి 2022 నవంబర్ 2న జరిగిన ఎన్నికల్లో ఏడుగురు అభ్యర్థులు పోటీచేయగా కుల్దీప్ సింగ్ అనే అభ్యర్థిని విజేతగా ప్రకటించారు.

# సిపిఐ రాష్ట్ర మహాసభ ఏర్పాట్లను పరిశీలించిన సిపిఐ జాతీయ నాయకులు చాడా వెంకట్ రెడ్డి




**కుత్బుల్లాపూర్ ఆగస్టు 17 (జనం సాక్షి) :** సిపిఐ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలు ఈ నెల 20 వ తేదీ నుండి 22 వ తేదీ వరకు కుత్బుల్లాపూర్ నియోజక వర్గం గాజులరామారం లో జరగనున్న ఏర్పాట్లను ఆదివారం సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడా వెంకటరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాట వీరుల పోరాటాలు, సిపిఐ చేసిన త్యాగలు వెలకట్టలేనివని, గత చరిత్ర నేటి ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందని అన్నారు. మహాసభలో ఎగ్జిబిషన్ ద్వారా వాటిని ప్రదర్శించి నున్నట్లు ఆయన పేర్కొన్నారు కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలను , లోపాలనుచర్చించడం జరుగుతుందన్నారు. పార్టీ భవిష్యత్తు ప్రణాళికను రూపొందించుకొని పా మరింత బలోపేతం చేసుకోవడానికి రాష్ట్ర మహాసభలు ఉపయోగపడుతాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. రాష్ట్ర మహాసభల జయప్రదం కోసం అన్ని వర్గాల వారు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆహ్వాన సంఘం అధ్యక్షులు యూసఫ్,ప్రధాన కార్యదర్శి స్వామి,గౌరవ అధ్యక్షులు ఏసురత్నం,డి. హెచ్. పి. ఎస్ రాష్ట్ర కార్యదర్శి అనిల్,జిల్లా కార్యదర్శి ఉమా మహేష్,మండల కార్యదర్శి స్వామి,ఏఐటీయూసీ కార్యదర్శి శ్రీనివాస్,సిపిఐ నాయకులు శ్రీకాంత్,వెంకటేష్, ప్రవీణ్, దుర్గయ్య, సహదేవ రెడ్డి, బాబు, వెంకటేష్, రాజు, జంబూ తదితరులు పాల్గొన్నారు.

# పేదల స్వంత ఇంటి కలను నెరవేర్చే.. ప్రజా ప్రభుత్వం

**ఇందిరమ్మ ఇళ్ల పూజా కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్**



**వేములవాడ, ఆగస్టు 17 (జనంసాక్షి):** వేములవాడ పట్టణంలోని బాలానగర్‌లో ఇందిరమ్మ ఇళ్ల కడప పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ఈ పూజలో పాల్గొని, లబ్ధిదారులకు చీర సారెను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల స్వంత ఇంటి కలను నెరవేర్చే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ఒక మహాయజ్ఞంలా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను చేపట్టిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజలు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో మోసపోయారని, కానీ నేడు ప్రతి అర్హుడికీ నిజంగా ఒక స్థిర నివాసం కలిగేలా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం వేములవాడ నియోజకవర్గం వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగంగా కొనసాగుతున్నాయని, పట్టణం నుంచి గ్రామాల దాకా పండుగ వాతావరణం నెలకొన్నదని తెలిపారు. ఇప్పటికే చాలా లబ్ధిదారుల ఇళ్లకు బేస్మెంట్ పనులు పూర్తవగా, కొందరి ఇళ్లు స్లాబ్ దశలో ఉన్నాయని, వారి ఖాతాల్లో నిధులు నేరుగా జమ అవుతున్నాయని అన్నారు. ఇందిరమ్మ పట్టాల పంపిణీ సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం, నియోజకవర్గం అంతటా ప్రతి లబ్ధిదారుని ఇంటికి వెళ్లి చీరె సారె అందజేస్తున్నట్టు చెప్పారు. లబ్ధిదారుల కళ్లలో కనిపిస్తున్న ఆనందాన్ని చూశాక, ఎంత ధనం పెట్టినా ఆ సంతోషాన్ని కొనలేమని పేర్కొన్నారు. ఒకనాడు గుడిసెల్లో, రేకుల షెడ్లలో నివసించిన ప్రజలు నేడు తమకు ఇల్లు మంజూరైనందుకు గర్వంగా భావిస్తున్నారని చెప్పారు. నాడు ఇందిరమ్మ ఇంటి రూపంలో ప్రజలకు ఆశను అందించిన విధంగా నేడు మళ్లీ అదే స్థాయిలో ఆదరణ లభిస్తోందన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని ముఖ్య లక్ష్యంగా పెట్టుకొని ముందుకు సాగుతోంది. నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం, 200 యూనిట్ల ఉచిత కరెంట్, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం వంటి పథకాలను విజయవంతంగా అమలు చేస్తూ, తెలంగాణను దేశానికి ఒక రోల్ మోడల్‌గా నిలిపిందని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల తరఫున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్టు పేర్కొన్నారు.

# వ్యవసాయ పరికరాల రాయితీకి దరఖాస్తుల ఆహ్వానం

**కోనరావుపేట(జనంసాక్షి):** వ్యవసాయ యాంత్రికరణ సంవత్సరానికి గాను రాయితీపై వ్యవసాయ పరికరాలను పొందడానికి రైతులు దరఖాస్తు చేసుకోవాలని కోనరావుపేట వ్యవసాయ శాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రాయితీ ఎస్సీ, ఎస్టీ రైతులు, మహిళా రైతులు ఐదు ఎకరాలు లోపల గల సన్న చిన్న కారు రైతులకు 50 శాతం ఇతర రైతులకు 40 శాతం రాయితీతో వ్యవసాయ పనిముట్లు అందజేయడం జరుగుతుందన్నారు. బ్యాటరీ స్ప్రేయర్, పవర్ స్ప్రేయర్, రోటవేటర్స్, సీడ్ కం ఫర్టిలైజర్ డ్రిల్, కల్టివేటర్, పవర్ టిల్లర్, స్ట్రాబెలర్ వంటి పరికాలు అందుబాటులో ఉన్నాయన్నారు. రాయితీ పొందడానికి రైతులు దరఖాస్తు ఫారం తో పాటు పట్టాదారు పాసు బుక్, ఆధార్ కార్డు, రెండు పాస్పోర్ట్ సైజు ఫోటోలతో ఆగష్టు 23 లోగా సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలని సూచించారు.







# వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో హౌస్ టు హౌస్ సర్వే

**జాండీస్ నిర్ధారణ చేసిన పరీక్షలు వైద్య బృందం డాక్టర్ శ్రవణ్ కుమార్, డాక్టర్ వరుణ**

**వీణవంక ఆగస్టు 17 (జనం సాక్షి) :** వీణవంక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని బేతిగల్ సబ్ సెంటర్లో జాండీస్ అవుట్ బ్రేక్స్ నిర్ధారణలో భాగంగా హౌస్ టు హౌస్ హౌస్ సర్వేలో భాగంగా 38 ఇండ్ల లో సర్వే నిర్వహించగా అందులో83 మంది జనాభాకి స్క్రీన్ నిర్వహించారు, సర్వేలో అందులో రెండు ఫీవర్ కేసెస్ లభించగా వాళ్ళకి బ్లడ్ శాంపిల్స్ తీసి మలేరియా నిర్ధారణ కోసం ల్యాబ్ కు పంపించారు. అదేవిధంగా రాపిడ్ డయాగ్నొస్టిక్ టెస్ట్ ద్వారా డెంగ్యూ లక్షణాలు ఏమైనా ఉన్నాయని14 మందికి టెస్ట్ చేయగా వారికి నెగటివ్ అని నిర్ధారణ చేరింది. నెల కాల వ్యవధిలో వచ్చిన జాండీస్ కేసులకి కారణం టైఫాయిడ్ లేక వైరల్ జ్వరాలకి ట్రీట్మెంట్ సరిగ్గా తీసుకోకపోవడం ద్వారానే అని ప్రాథమిక నిర్ధారణంగా భావిస్తూ,శానిటేషన్ పై ప్రత్యేక శ్రద్ధ చేయాలని డ్రైనేజీలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని,ఇంటి చుట్టుపక్కల నిలవనీటి ఉండకుండా చూసుకోవాలని,జలుబు దగ్గు తలనొప్పి ఒళ్ళు నొప్పులతో లక్షణాలు ఎవరికైనా కనిపిస్తే ఆశా,ఏఎన్ఎం సిబ్బంది దగ్గర రాపిడ్ కిట్ పరీక్ష ద్వారా డెంగి లక్షణాలని చూసుకొని అవసరమైతే సమీప పిహెచ్సిలో మందులకి సంప్రదింప చేయాలని సూచించారు.రాబోయే ఐదు రోజులు గ్రామంలో మెడికల్ క్యాంపు నిర్వహిస్తామని,గ్రామ ప్రజలు ఈ సేవలు వినియోగించుకోవాలని కోరారు.ఈ హౌస్ సర్వేలో వైద్య బృందం డాక్టర్ శ్రావణ్ కుమార్,డాక్టర్ వరుణ,డాక్టర్ రజనీకాంత్,ఎం ఎల్ హెచ్ పి,రత్నమాల,ఎం ఎల్ హెచ్ పి,డి అనిల్ కుమార్,హెల్త్ సూపర్వైజర్,ఏఎన్ఎం పద్మ,ఆశా వర్కర్లు గ్రామస్తులు తదితరులు పాల్గొనడం జరిగింది.

# మున్సిపల్ కార్మికుల సమస్యలపై నిరంతరం ఉద్యమాలు

**రాష్ట్ర కార్యదర్శి జనగామ రాజమల్లు**




**మంథని, (జనంసాక్షి) :** తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా నాలుగవ మహాసభలు మంథనిలో ఘనంగా నిర్వహించారు పాత పెట్రోల్ బంక్ నుండి ఫ్రెండ్స్ క్లబ్ వరకు ర్యాలీ, కోలాటాల ప్రదర్శన నిర్వహించారు. రాష్ట్ర జిల్లా నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. మహాసభలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జనగామ రాజమల్లు మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికుల మహాసభలు మంథని పట్టణంలో ఒక పండుగలాగా కార్మికులు నిర్వహించుకోవడం అభినందనీయమని అన్నారు అనేక సంవత్సరాలుగా మున్సిపల్ కార్మికులు సమస్యల పరిష్కారం కొరకు నిరంతరం పోరాడుతూ అనేక సమస్యలను పరిష్కరించుకున్నారని అన్నారు రాబోయే కాలంలో ఈ జిల్లాలో అన్ని మున్సిపాలిటీల కార్మికులు ఐక్యంగా నిలబడి తమ సమస్యల పరిష్కారం కొరకు పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రవెల్లి ముత్యంరావు ,యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మహేష్, వెంకటస్వామి, సిఐటియు నాయకులు బూడిద గణేష్ మున్సిపల్ యూనియన్ నాయకులు చింతల గోవింద్, వడ్లకొండ రాజయ్య, ప్రజాసంఘాల నాయకులు ఆర్ల సందీప్, గోరెంకల సురేష్, మంథని లింగయ్య, బావు రవి, యూనియన్ నాయకులు గడిపెల్లి మల్లేష్, చిప్పకుర్తి చందు, సింగారం గట్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలకు విరుద్ధంగా డీజేలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు

**వేములవాడ పట్టణ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్**



**వేములవాడ, ఆగస్టు 17 (జనంసాక్షి):** వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని డి.జే యజమనుల తో సమావేశం నిర్వహించారు. డి.జే యజమానులు పోలీస్ వారి సూచనలు బేఖాతరు చేస్తూ నిబంధనలకు విరుద్ధంగా డి.జే నిర్వహించి నట్లు అయితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సి.ఐ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా డి.జే లు నిర్వహించిన ,యాంప్లిఫైయర్ తో బాక్స్ లు ఏర్పాటు చేసిన కఠిన చర్యలు తీసుకుంటామని, గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో మండపాల వద్ద కానీ,శోభయాత్రలో కానీ డీజేలు కానీ యాంప్లిఫైయర్ తో బాక్స్ లు ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బంది కలిగించిన డి.జే యజమానులతో పాటుగా నిర్వహకులపై కఠినచర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. గణేష్ మండపాల వద్ద పోలీస్ అధికారుల అనుమతితో చిన్న స్పీకర్లు మాత్రమే ఏర్పాటు చేసుకోవాలని అదికూడా రాత్రి 10 గంటల వరకు మాత్రమే అని,అధిక శబ్దాలు చేసే డి.జే ల వలన చిన్న పిల్లలు,విద్యార్థుల చదువుకు,వృద్ధులు ఆరోగ్యనికి ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో డి.జే నిర్వహకులపై డయల్100 కాల్స్ వస్తున్నాయని అన్నారు. వేములవాడ పట్టణ పరిధిలో ఎట్టి పరిస్థితుల్లో డి.జే లకు అనుమతి లేదు అని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డిజె సౌండ్స్ యజమానులు తదితరులు ఉన్నారు..



# మద్యం మత్తులో యువ అథ్లెట్లపై దాడి

## కొండాపూర్‌లో గుర్తుతెలియని వ్యక్తుల దౌర్జన్యం

**కొండాపూర్, ఆగస్టు 17 (జనంసాక్షి):** చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం మత్తులో గుర్తుతెలియని వ్యక్తులు యువ అథ్లెట్లపై దాడి చేసిన ఘటన జరిగింది. గచ్చిబౌలి స్టేడియంలో అథ్లెటిక్స్ శిక్షణ పొందుతున్న రాథోడ్ యుగేందర్, ఆదిత్యలు శనివారం సాయంత్రం చందానగర్‌లోని పీజేఆర్ స్టేడియంలో రన్నింగ్ కోసం వచ్చారు. పరుగు పూర్తిచేసి సమీపంలోని ఓ షాపు వద్ద నిలబడ్డారు. అప్పుడు అక్కడికి వచ్చిన ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తుల్లో ఒకరైన కార్తీక్, రాథోడ్‌ను ఇక్కడ ఏం చేస్తున్నారని ప్రశ్నించాడు. అథ్లెటిక్ శిక్షణలో ఉన్నామని, రన్నింగ్ కోసం వచ్చామని తెలిపినా, కార్తీక్ కోపోద్రిక్తుడై అసభ్య పదజాలంతో దూషిస్తూ దాడి చేశాడు. మరో ఏడుగురిని పిలిచి, రాథోడ్, ఆదిత్యలను తీవ్రంగా కొట్టారు. స్థానికులు అడ్డుకునే ప్రయత్నం చేసినా, మద్యం మత్తులో విచక్షణారహితంగా దాడి కొనసాగించారు. ఈ ఘటనలో ఆదిత్య దంతం విరిగి, రక్తస్రావం జరిగింది, అతని మెడలోని సిల్వర్ చైన్ కనిపించకుండా పోయింది. రాథోడ్ ఫిర్యాదు మేరకు చందానగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# అభిషేక్ టాప్.. అట్టడుగున గిల్

**హైదరాబాద్, ఆగస్టు 17 (జనంసాక్షి):** ఇంగ్లండ్ సిరీస్ ముగిసిన వెంటనే ఆసియా కప్ 2025 స్క్వాడ్ ఎంపికపై అభిమానుల్లో ఉత్కంఠ నెలకొంది. టీ20 ఫార్మాట్‌లో దూసుకెళ్తున్న ఓపెనింగ్ జోడీని మారుస్తారా? సూర్యకుమార్ యాదవ్ స్థానంలో శుభ్‌మన్ గిల్‌కు కెప్టెన్సీ ఇస్తారా? అనే చర్చలు జోరందుకున్నాయి. మాజీ క్రికెటర్లు కొందరు ఆటగాళ్లకు స్క్వాడ్‌లో చోటు ఖాయమని ఊహాగానాలు వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది నుంచి టీ20ల్లో భారత ఆటగాళ్లు అద్భుత ప్రదర్శనలతో రికార్డులు సృష్టిస్తున్నారు. స్ట్రయిక్ రేటు ఆధారంగా చూస్తే, సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓపెనర్ అభిషేక్ శర్మ 193.84 స్ట్రయిక్ రేటుతో అగ్రస్థానంలో నిలిచాడు. టీమిండియా తరఫున బ్యాటింగ్‌తో పాటు పార్ట్‌టైమ్ స్పిన్‌తోనూ అదరగొడుతున్నాడు. రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ సంజూ శాంసన్ 171.47 స్ట్రయిక్ రేటుతో రెండో స్థానంలో, ముంబై ఇండియన్స్ బ్యాటర్ తిలక్ వర్మ 170.66తో మూడో స్థానంలో ఉన్నాడు. ఈ ఏడాది హ్యాట్రిక్ సెంచరీలతో చెలరేగిన తిలక్ దూకుడు అందరినీ ఆకట్టుకున్నాడు. యశస్వీ జైస్వాల్ 170.00 స్ట్రయిక్ రేటుతో నాలుగో స్థానంలో, శివం దూబే 167.12తో ఐదో స్థానంలో నిలిచారు. టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ 161.25 స్ట్రయిక్ రేటుతో ఆరో స్థానంలో ఉన్నాడు. అయితే, కెప్టెన్సీ రేసులో ఉన్న శుభ్‌మన్ గిల్ 129.25 స్ట్రయిక్ రేటుతో 11వ స్థానంలో నిలిచాడు. రుతురాజ్ గైక్వాడ్ (158.33), రియాన్ పరాగ్ (151.42), హార్దిక్ పాండ్యా (145.45), రింకూ సింగ్ (138.25)లు గిల్ కంటే మెరుగైన స్ట్రయిక్ రేటుతో ముందున్నారు.







**ముంబై, (జనంసాక్షి):** ఆసియా కప్ 2025 కోసం భారత జట్టు ఎంపికపై ఉత్కంఠ నెలకొంది. ఓపెనింగ్ నుంచి బౌలింగ్ యూనిట్ వరకు సమతూక జట్టును రూపొందించేందుకు చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్, హెడ్ కోచ్ గౌతం గంభీర్ తీవ్రంగా శ్రమిస్తున్నారు. టీ20 సారథి సూర్యకుమార్ యాదవ్ స్పోర్ట్స్ హెర్నియా గాయం నుంచి కోలుకుని ఫిట్‌నెస్ పరీక్షలో ఉత్తీర్ణుడైనట్లు తెలుస్తోంది. ప్రధాన పేసర్ జస్ప్రీత్ బుమ్రా కూడా ఇంగ్లండ్ టెస్టు సిరీస్‌లో మూడు మ్యాచ్‌లు ఆడి, తాను ఆసియా కప్‌కు అందుబాటులో ఉన్నానని సెలెక్టర్లకు సమాచారం ఇచ్చాడు. దీంతో ఈ ఇద్దరూ స్క్వాడ్‌లో ఉండడం దాదాపు ఖాయమనిపిస్తోంది. ఆగస్టు 19న ముంబైలో జరిగే సమావేశంలో స్క్వాడ్ ఎంపికపై సెలెక్టర్లు తుది నిర్ణయం తీసుకోనున్నారు. సెప్టెంబర్ 9 నుంచి యునైటెడ్ అరబ్

# సూర్య, బుమ్రా సిద్ధం..

## టాప్ ఆర్డర్‌లో ఎవరికి చోటు?

ఎమిరేట్స్‌లో టీ20 ఫార్మాట్‌లో ఆసియా కప్ ప్రారంభం కానుంది. సెప్టెంబర్ 14న దుబాయ్‌లో భారత్-పాకిస్థాన్ మధ్య హైవోల్టేజ్ మ్యాచ్ జరగనుంది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ టీ20కి వీడ్కోలు చెప్పడంతో టాప్ ఆర్డర్ కోసం యశస్వీ జైస్వాల్, సంజూ శాంసన్, శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ, తిలక్ వర్మ మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఇంగ్లండ్ టెస్టు సిరీస్‌లో అద్భుతంగా రాణించిన గిల్‌కు కెప్టెన్సీ అప్పగించాలనే చర్చ జరుగుతోంది. అయితే, ఫిట్‌నెస్ సాధించిన సూర్యకుమార్ యాదవ్‌కే కెప్టెన్సీ దక్కే అవకాశం ఉంది. ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ఎన్‌సీఏలో ఫిట్‌నెస్ చాటుకోవాల్సి ఉంది. రెండో వికెట్ కీపర్‌గా సంజూ శాంసన్‌కు బ్యాకప్‌గా ఇషాన్ కిషన్, జితేశ్ శర్మల్లో ఒకరిని ఎంచుకునే అవకాశం ఉంది.

# ఐపీఎల్‌లో కొత్త నిబంధనలు

## షార్ట్ రన్, రిటైర్డ్ హర్ట్‌పై బీసీసీఐ కీలక నిర్ణయం



**ముంబై, (జనంసాక్షి):** భారత క్రికెట్ నియంత్రణ మండలి ఐపీఎల్‌తో పాటు దేశవాళీ క్రికెట్‌లో కీలక మార్పులకు శ్రీకారం చుట్టింది. గాయపడిన ఆటగాళ్ల రక్షణ కోసం రీప్లేస్‌మెంట్ ప్లేయర్‌లను అనుమతించేందుకు బోర్డు ఆమోదం తెలిపింది. షార్ట్ రన్, రిటైర్డ్ హర్ట్ బ్యాటర్లు, వన్డే మ్యాచ్‌లలో బంతుల వినియోగంపై కూడా ముఖ్య నిర్ణయాలు తీసుకుంది. టీ20 మ్యాచ్‌లలో, ముఖ్యంగా ఐపీఎల్‌లో, వికెట్లు పడినప్పుడు ప్రధాన బ్యాటర్లు ఓవర్ చివరి బంతికి సింగిల్ తీసేందుకు ప్రయత్నిస్తారు. టెయిలెండర్లు వికెట్ కాపాడలేకపోవడంతో, బ్యాటర్లు రెండు రన్స్ తీసేందుకు కష్టపడతారు. కొందరు ఉద్దేశపూర్వకంగా నాన్-స్ట్రయికింగ్ క్రీజులో బ్యాట్‌ను పూర్తిగా పెట్టకుండా షార్ట్ రన్ తీస్తారు. ఇకపై ఇలాంటి షార్ట్ రన్‌లకు అవకాశం లేదని బీసీసీఐ స్పష్టం చేసింది. ఉద్దేశపూర్వక షార్ట్ రన్ తీస్తే, స్ట్రయిక్‌లో ఎవరు ఉండాలో ఫీల్డింగ్ జట్టు కెప్టెన్ నిర్ణయిస్తాడనే కొత్త నిబంధనను ప్రవేశపెట్టింది. వన్డే మ్యాచ్‌లలో రెండు బంతుల నియమాన్ని ఐసీసీ రద్దు చేసిన నేపథ్యంలో, బీసీసీఐ కూడా ఈ విధానాన్ని అనుసరిస్తూ, 34 ఓవర్ల తర్వాత ఒకే బంతిని మార్చేందుకు అనుమతించనుంది. ఈ నియమం విజయ్ హజారే ట్రోఫీ నుంచి అమల్లోకి రానుంది. రిటైర్డ్ హర్ట్‌గా డగౌట్‌కు వెళ్లిన బ్యాటర్లను మళ్లీ మైదానంలోకి అనుమతించబోమని బీసీసీఐ తేల్చిచెప్పింది. అయితే, క్లాజ్ 25.4.2 ప్రకారం కొన్ని వెసులుబాట్లు ఉంటాయని పేర్కొంది. ఈ కొత్త నిబంధన ప్రకారం, ప్రత్యర్థి కెప్టెన్ అనుమతించినా, రిఫరీ ఆమోదం లేకుండా రిటైర్డ్ హర్ట్ బ్యాటర్లు బ్యాటింగ్‌కు రాలేరు. ఈ నియమం అన్ని ఫార్మాట్‌లకూ వర్తిస్తుందని బీసీసీఐ వెల్లడించింది.

# అశ్విన్ భవిష్యత్ కోచ్

## సచిన్ బ్యాట్ల జాగ్రత్తలో మొదటి స్థానం: పూజారా

**ముంబై, (జనంసాక్షి):** ఇంగ్లండ్ టెస్టు సిరీస్‌లో తొలి రెండు మ్యాచ్‌ల్లో ఓటములతో హెడ్ కోచ్ గౌతం గంభీర్‌పై విమర్శలు వెల్లువెత్తాయి. అయితే, మాంచెస్టర్‌లో డ్రా, ఓవల్‌లో విజయంతో శుభ్‌మన్ గిల్ సారథ్యంలో జట్టు సిరీస్ సమం చేసింది. దీంతో తదుపరి కోచ్ ఎవరనే చర్చకు తాత్కాలిక బ్రేక్ పడింది. మాజీ క్రికెటర్ ఛతేశ్వర్ పూజారా మాత్రం రవిచంద్రన్ అశ్విన్ భవిష్యత్ కోచ్‌గా ఉంటాడని ధీమాగా చెప్పాడు. "అశ్విన్ లెజెండరీ ఆటగాడు. మూడు ఫార్మాట్లలో బ్యాట్, బంతితో ప్రత్యర్థులను ఇబ్బంది పెట్టాడు. సుదీర్ఘ అంతర్జాతీయ అనుభవంతో కోచ్‌కు అవసరమైన అన్ని లక్షణాలు అతడిలో ఉన్నాయి. టీమిండియా కోచ్‌గా అశ్విన్ రాణిస్తాడనడంలో సందేహం లేదు," అని పూజారా ఈఎస్‌పీఎన్ క్రిక్‌ఇన్ఫోతో చెప్పాడు. ఈఎస్‌పీఎన్ ర్యాపిడ్ ఫైర్‌లో పూజారా ఆసక్తికర సమాధానాలిచ్చాడు. రోజంతా కలిసి గడపాలంటే విరాట్ కోహ్లీ, రియాల్టీ షో నిర్వహించాలంటే శిఖర్ ధావన్, టేలర్ స్విఫ్ట్ కాన్సర్ట్‌కు కేఎల్ రాహుల్, క్రికెట్ గురించి నిరంతరం చర్చించేది అశ్విన్, వీడియోలు చూసేది రిషభ్ పంత్, బ్యాట్లను జాగ్రత్తగా చూసుకునేది సచిన్ టెండూల్కర్, జట్టుకు రంగేసుకునేది ఎంఎస్ ధోనీ, బెస్ట్ గిఫ్ట్‌లు ఇచ్చేది రాహుల్ ద్రవిడ్ అని వెల్లడించాడు. అశ్విన్ 2024 డిసెంబర్‌లో ఆస్ట్రేలియా టెస్టు సిరీస్ మధ్యలో గబ్బా టెస్టు తర్వాత హఠాత్తుగా రిటైర్మెంట్ ప్రకటించి అందర్నీ ఆశ్చర్యపరిచాడు. ప్రస్తుతం అతడు ఐపీఎల్, తమిళనాడు టీ20 లీగ్‌లో ఆడుతున్నాడు. మూడు ఫార్మాట్లలో 765 వికెట్లు తీసిన అశ్విన్, టెస్టుల్లో 537 వికెట్లతో అనిల్ కుంబ్లే తర్వాత భారత అత్యధిక వికెట్ల వీరుడిగా నిలిచాడు.



## క్రికెటర్ నుంచి వరల్డ్ కప్ అంపైర్‌గా

# బంగ్లా మహిళ జెస్సీ

**బంగ్లాదేశ్, ఆగస్టు 17 (జనంసాక్షి):** బంగ్లాదేశ్ మాజీ క్రికెటర్ షథిరా జకీర్ జెస్సీ వన్డే వరల్డ్ కప్‌లో అంపైర్‌గా చరిత్ర సృష్టించ నుంది. భారత్ ఆతిథ్యమిచ్చే ఈ మెగా టోర్న మెంట్‌లో తొలిసారి అంపైరింగ్ చేయనున్న ఆమె, బంగ్లాదేశ్ నుంచి వరల్డ్ కప్‌లో ఈ బాధ్యతలు నిర్వహించిన తొలి మహిళగా రికార్డు నెలకొల్పనుంది. "వరల్డ్ కప్ మ్యాచ్‌లకు అంపైరింగ్ చేయాలనే కల సాకారమవుతోంది. టీ20 వరల్డ్ కప్‌లో అవకాశం రాలేదు, కానీ ఈ మెగా ఈవెంట్‌లో బాధ్యతలు నిర్వహించే ందుకు ఆతృతగా ఉన్నాను," అని జెస్సీ భావోద్వేగంతో తెలిపింది. క్రికెటర్‌గా కేవలం మూడు మ్యాచ్‌లు ఆడిన జెస్సీ, రిటైర్మెంట్ తర్వాత 2022లో అంపైరింగ్ అర్హత సాధించిం ది. మలేషియాలో జరిగిన అండర్-19 ఆసియా కప్‌లో తొలిసారి అంపైరింగ్ చేసిన ఆమె, పాకిస్థాన్‌లో మహిళల వన్డే వరల్డ్ కప్ క్వాలి ఫయర్స్, బంగ్లాదేశ్ ఎమర్జింగ్ టీమ్, దక్షిణా ఫ్రికా సిరీస్‌లలోనూ అంపైర్‌గా ఆకట్టుకుంది. సెప్టెంబర్ 30 నుంచి ప్రారంభమయ్యే వన్డే వరల్డ్ కప్‌తో ఆమె అంపైరింగ్ కెరీర్‌లో కొత్త అధ్యాయం మొదలుకానుంది.





# సునీల్ ఛెత్రీ లెజెండ్..

## కానీ కొత్తవారికి అవకాశం ఇవ్వాలనుకున్నాం: కోచ్ ఖలిద్

**నాగర్‌కర్నూల్, ఆగస్టు 17 (జనంసాక్షి):** సెంట్రల్ ఆసియా ఫుట్‌బాల్ అసోసియేషన్ నేషన్స్ కప్ ప్రాబబుల్స్ జాబితాలో మాజీ సారథి సునీల్ ఛెత్రీ పేరు లేకపోవడంపై అభిమానులు కారణం చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. ఆల్ ఇండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ సమాధాన బాధ్యతను కోచ్‌పై నెట్టేసింది. ఈ నేపథ్యంలో కోచ్ ఖలిద్ జమిల్ ఛెత్రీని తప్పించడం వెనుక కారణాన్ని వివరించాడు. "సునీల్ ఛెత్రీ భారత ఫుట్‌బాల్‌కు లెజెండ్, స్ఫూర్తిదాయక వ్యక్తి. అతనికి జట్టు తలుపులు ఎల్లప్పుడూ తెరిచే ఉంటాయి. సీఎఎఫ్ఏ నేషన్స్ కప్ ఆసియా కప్ క్వాలిఫయర్స్‌కు సన్నాహకంగా ఉపయోగపడే టోర్నమెంట్. కొత్త ఆటగాళ్లకు అవకాశం ఇవ్వాలనే ఉద్దేశంతో ఛెత్రీని ఎంపిక చేయలేదు," అని జమిల్ తెలిపాడు. గత ఏడాది జూన్‌లో అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు వీడ్కోలు పలికిన ఛెత్రీ, జట్టు పేలవ ప్రదర్శనతో ఈ ఏడాది యూటర్న్ తీసుకున్నాడు. అయినప్పటికీ, 35 మంది ప్రాబబుల్స్ జాబితాలో అతనికి చోటు దక్కలేదు. బెంగళూరు ఎఫ్‌సీకి చెందిన గుర్‌ప్రీత్ సింగ్, రాహుల్ భెకే, రోషన్ సింగ్, సురేష్ సింగ్‌లు స్క్వాడ్‌లో ఉండగా, స్టార్ ఫార్వర్డ్ ఛెత్రీని సెలెక్టర్లు విస్మరించారు. ఆగస్టు 29 నుంచి ఉజ్బెకిస్థాన్, తజకిస్థాన్‌లలో ప్రారంభమయ్యే నేషన్స్ కప్‌లో భారత్ గ్రూప్ బీలో తజకిస్థాన్, ఇరాన్, అఫ్గనిస్థాన్‌లతో తలపడనుంది.

# బాబర్, రిజ్వాన్‌లపై వేటు

## సల్మాన్ అఘా సారథ్యంలో పాక్ స్క్వాడ్

**లాహోర్, ఆగస్టు 17 (జనంసాక్షి):** ఫామ్‌లేమితో సతమతమవుతున్న పాకిస్థాన్ స్టార్ ఆటగాళ్లు బాబర్ ఆజం, మహ్మద్ రిజ్వాన్‌లపై ఆసియా కప్ 2025 స్క్వాడ్ ఎంపికలో వేటు పడింది. ఆదివారం పాకిస్థాన్ క్రికెట్ బోర్డు 17 మందితో కూడిన జట్టును ప్రకటించగా, ఈ టీ20 టోర్నమెంట్‌కు సల్మాన్ అఘా కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. సీనియర్ల స్థానంలో ఫఖర్ జమాన్, సయీం ఆయూబ్, సహిబ్జాదా ఫర్హాన్‌లు టాప్ ఆర్డర్‌లో బరిలోకి దిగనున్నారు. పేస్ బౌలింగ్‌ను షాహీన్ అఫ్రిది, హ్యారిస్ రవుఫ్, స్పిన్ విభాగాన్ని మహ్మద్ నవాజ్ నడిపించనున్నారు. ఆసియా కప్‌కు ముందు ఆగస్టు 29 నుంచి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో జరిగే ముక్కోణపు సిరీస్‌లో యూఏఈ, అఫ్గనిస్థాన్‌లతో పాటు పాకిస్థాన్ ఈ స్క్వాడ్‌తోనే పోటీపడనుంది. సెప్టెంబర్ 9 నుంచి యూఏఈలో ఆసియా కప్ ప్రారంభమవుతుంది,

దేశవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలు నగర ప్రజానీకాన్ని ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. ఇప్పటికే హైదరాబాద్, ముంబైలో చినుకు పడితే చాలు వాహనదారులు, లోతట్టు కాలనీ వాసులు నరకయాతన అనుభవిస్తున్నారు. తాజాగా ఢిల్లీ కూడా వరద ముప్పును ఎదుర్కొంటోంది.

# హైదరాబాద్ ప్రయాణికులకు ఆర్టీసీ బంపర్ ఆఫర్

## ఆ టికెట్ల ధర తగ్గింపు... ఆగస్టు 15 నుంచి ఆగస్టు 31 వరకు వర్తింపు

టీజీఎస్ ఆర్టీసీ బంపర్ ఆఫర్ ప్రకటించింది. గ్రేటర్ హైదరాబాద్ ప్రయాణికులకు గుడ్‌న్యూస్ తెలిపింది. ట్రావెల్ యూస్ యూ లైక్(టి.ఎ.వై.ఎల్) టికెట్ల ధరలను తగ్గించింది. ఆగస్టు 15 నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు టికెట్ల తగ్గింపు ధరలు అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు. మెట్రో డీలక్స్ బస్సులతో పాటు, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో 34 గంటల పాటు ఈ టికెట్లను కొనుగోలు చేసే సౌకర్యం కల్పించారు. సవరించిన టికెట్ ధరలు ఇవే : పెద్దలకు ఇంతకు ముందు ఉన్న టికెట్ ధర రూ.150ను సవరించి రూ.130లు చేశారు. మహిళలకు, సీనియర్ సిటిజన్స్కు ఇంతకు ముందు ఉన్న టికెట్ ధర రూ.120లు ఉండగా, దాన్ని సవరించి రూ.110లు చేశారు.



# యూరియా కొరతపై రాజకీయం సరికాదు

- అడిగిన వెంటనే యూరియా సరఫరా చేయిస్తున్న ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు
- బర్త్ డే గిఫ్ట్‌లో సింగిల్ విండో చైర్మన్ ఉండడాన్ని ఖండించిన పాలకవర్గ సభ్యులు

**వేములవాడ, ఆగస్టు 17 (జనంసాక్షి):** వేములవాడ ప్రాథమిక సహకార సంఘం పరిధిలో యూరియా కొరతా ఉందని చెప్పగానే స్పందించి ఉన్నతాధికారులతో మాట్లాడి యూరియా సరఫరా చేయిస్తున్న ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కు వేములవాడ ప్రాథమిక సహకార సంఘం వైస్ చైర్మన్ తో పాటు పాలకవర్గ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వేములవాడ ప్రాథమిక సహకార సంఘం సమీపంలో వారు మాట్లాడుతూ శుక్రవారం రాత్రి శాత్రాజ్ పల్లి లో ఓ రైతు జన్మదిన వేడుకల్లో యూరియా సంచిని గిఫ్ట్ గా ఇవ్వటం ప్రభుత్వాన్ని బధనం చేయడమే అన్నారు. బర్త్ డే వేడుకల్లో సింగిల్ విండో చైర్మన్ తిరుపతి రెడ్డి పాల్గొనడం పట్ల వారు తీవ్రంగా ఖండించారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులకు యూరియా సరఫరా చేయడంలో ముందుండి సహకరించాలి కానీ ఇలా జన్మదిన వేడుకల్లో యూరియా కొరత ఉన్నట్లు, గిఫ్ట్ గా యూరియా బస్తా ఇవ్వటం, అందులో చైర్మన్ పాల్గొనడం సరికాదన్నారు. రైతులకు అందుబాటులో ఉండి యూరియా ను సరఫరా చేయాల్సిన బాధ్యత చైర్మన్ పై ఉందన్నారు. వేములవాడ పరిధిలోని చెక్కపల్లి, వట్టెంల గోదాముల్లో ఇప్పటికే యూరియా బస్తాలను సరఫరా చేశామని వారు గుర్తు చేశారు. ఇంకా రైతులకు సరిపడా యూరియాను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సహాయంతో రైతులకు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో వైస్ చైర్మన్ తూమ్ లక్ష్మీ కాంతారావు, డైరెక్టర్లు తోటరాజు, గూగుల్ బాలవ్వ, కొండ వెంకటేశం, దొబ్బల మల్లేశం, దొంతగోని రాజయ్య, తదితరులు ఉన్నారు.

# నీళ్ల విలువ రేవంత్ రెడ్డికి, ఉత్తమ్‌కుమార్ రెడ్డికి తెలియదు



**సిద్ధిపేట ఆగస్టు 17 (జనంసాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల ప్రయోజనాల కంటే రాజకీయాలే ముఖ్యమని.. కట్టిన ఇల్లు పెట్టిన పొయ్యిలాగా కాళేశ్వరం ప్రాజెక్టు ఉంటే ఈ ప్రభుత్వం నీళ్లను సముద్రంలోకి వదిలి పడావు పెట్టిందని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. సిద్ధిపేట క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ.. నంది మేడారంలో కటక ఒత్తితే రోజుకి రెండు టీఎంసీల నీళు వస్తాయి. కానీ ఎందుకు నీళ్లను సముద్రంలో వదులుతున్నారు. ఇది రాష్ట్ర ప్రభుత్వ క్రిమినల్ నెగ్లిజెన్సీ.. నీళ్ల విలువ రైతులకు తెలుస్తుంది కానీ రేవంత్ రెడ్డికి, ఉత్తంకుమార్ రెడ్డికి తెలియదన్నారు.

కృష్ణా, గోదావరి నీళ్లు సముద్రం పాలైతుంటే రేవంత్ రెడ్డి కనులప్పగించి చూస్తున్నాడు . కాళేశ్వరం ప్రాజెక్టు కూలిందని చెప్పిన మీ అబద్ధాన్ని నిజం చేసేందుకే మోటార్లను ఆన్ చేయడం లేదా..? రేవంత్ రెడ్డి అని ప్రశ్నించారు. ఈ రాష్ట్రంలో ఇరిగేషన్ శాఖకు మంత్రి ఉన్నాడా.. ? ముఖ్యమంత్రికి సోయి ఉన్నదా. వరద నీటిని ఒడిసిపట్టి రిజర్వాయర్లు, చెరువులు నింపితే యాసంగిలో లక్షల ఎకరాల పంట పండుతుంది. వెంటనే మోటార్లను ఆన్ చేసి రోజుకి రెండు టీఎంసీలు నీళ్లు మిడ్ మానేరుకు, అక్కడినుండి మిగతా రిజర్వాయర్లకు విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాం. కాళేశ్వరం మోటార్లను కక్షపూరితంగా పనికిరాకుండా చేయాలని రోజుకు రెండుసార్లు ఆన్ ఆఫ్ చేస్తున్నారు. రాజకీయాల కోసం మాట్లాడటం లేదు రైతుల ప్రయోజనాల కోసం మాట్లాడుతున్న. ఈ రాష్ట్ర మాజీ నీటిపారుదల శాఖ మంత్రిగా అవగాహనతో మాట్లాడుతున్న. వెంటనే మోటార్లు ఆన్ చేసి రైతులకు నీళ్లు ఇవ్వాలి.. లేదంటే రైతులతో వేలాది మందిగా కదిలి వచ్చి మేమే మోటార్లను ఆన్ చేస్తామని హెచ్చరిస్తున్నామని అన్నారు

# అలసత్వం వద్దు..

## అంతా అప్రమత్తంగా ఉండండి

- పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగంతో మంత్రి సీతక్క వీడియో కాన్ఫరెన్స్



**హైదరాబాద్, ఆగస్టు 17 (జనంసాక్షి):** పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దానసరి అనసూయ సీతక్క ఆదివారం మధ్యాహ్నం పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో ENC ఎన్. అశోక్‌తో పాటు చీఫ్ ఇంజనీర్లు, సూపరింటెండింగ్ ఇంజనీర్లు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. వర్షాలు, వరదల కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పడిన పరిస్థితులపై సమీక్ష నిర్వహిస్తూ, ఇప్పటివరకు మొత్తం 86.55 కిలోమీటర్ల మేర గ్రామీణ రహదారులు దెబ్బతిన్నాయని మంత్రికి నివేదించారు. ఈ రహదారుల తాత్కాలిక పునరుద్ధరణకు ఆరున్నర కోట్లు, శాశ్వత పునరుద్ధరణకు రూ.143 కోట్ల వరకు వ్యయం అవుతుందని ప్రాథమిక అంచనా వేసినట్లు తెలిపారు. మొత్తంగా రహదారులు మరియు ఇతర మౌలిక వసతుల పునరుద్ధరణకు రూ.150 కోట్ల వరకు అవసరమవుతుందని అధికారుల నివేదిక వెల్లడించింది. అలాగే వర్షాలు, వరదల కారణంగా 66 రహదారులు, 83 క్రాస్ డ్రైన్ పనులు, 60 చోట్ల గండ్లు పడినట్లు వివరించారు. అంతేకాకుండా శిధిలావస్థలో ఉన్న 36 భవనాలు గుర్తించామని, వాటిలో నివసిస్తున్న ప్రజలను ఇతర సురక్షిత ప్రదేశాలకు తరలిస్తున్నామని మంత్రికి తెలియజేశారు.గత రెండు రోజులుగా కురిసిన వర్షాల కారణంగా రవాణా సంబంధాలు తెగిపోయిన కొన్ని గ్రామాలకు మళ్లీ కనెక్టివిటీ పునరుద్ధరించినట్లు అశోక్ తెలిపారు. మంచిర్యాల జిల్లా భీమిలి మండలంలోని కర్జిభీంపూర్ గ్రామానికి, అదే మండలంలోని రాజారం గ్రామానికి రవాణా సంబంధాలను పునరుద్ధరించినట్లు వెల్లడించారు. అసిఫాబాద్ జిల్లా, అసిఫాబాద్ మండలంలోని రాజూర్ గ్రామానికి కూడా కనెక్టివిటీ పునరుద్ధరించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, అధికారులు, సిబ్బంది అందరూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. విధి నిర్వహణలో ఉన్నవారు పనిప్రదేశాలను వదిలి వెళ్లరాదని సూచించారు. వర్షాలు తగ్గిన వెంటనే తాత్కాలిక మరమ్మతు పనులను తక్షణం పూర్తి చేయాలని ఆదేశిస్తూ, జిల్లా కలెక్టర్ల వద్ద ఇప్పటికే తగిన నిధులు అందుబాటులో ఉన్నందున వాటిని వినియోగించి తక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. సమాజానికి నేరుగా సంబంధించిన రహదారులు, కల్వర్టులు, భవనాల పునరుద్ధరణలో ఎలాంటి ఆలస్యం చేయకుండా వేగంగా స్పందించాలని మంత్రి సీతక్క ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు.

# లంగర్‌హౌస్‌లో మళ్లీ మొసలి

## స్థానికుల్లో భయాందోళన



**హైదరాబాద్, ఆగస్టు 17 (జనంసాక్షి):** లంగర్‌హౌస్ సమీపంలో మూసీ నదిలో ఆదివారం మరోసారి మొసలి కనిపించడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ సీజన్‌లో మూసీ నదిలో మొసలి కనిపించడం ఇది మూడోసారి అని స్థానికులు తెలిపారు. ఆదివారం సాయంత్రం మూసీ నది ఒడ్డున ఆడుకుంటున్న పిల్లలు ఒక బండరాయిపై మొసలిని గుర్తించి, వెంటనే స్థానికులను అప్రమత్తం చేశారు. స్థానికులు గుమిగూడి మొసలి దృశ్యాలను తమ మొబైల్ ఫోన్లలో రికార్డు చేసి, అటవీ శాఖ అధికారులకు, పోలీసులకు సమాచారం అందించారు. ఇటీవల కిషన్‌బాగ్, అసద్ బాబానగర్, చైతన్యపురి వద్ద కూడా మొసళ్లు కనిపించాయి. హిమాయత్ సాగర్ గేట్లు ఎత్తడంతో మూసీ నదిలో వరద ప్రవాహం పెరిగి, మొసళ్ల సంచారం ఎక్కువైందని తెలుస్తోంది. దీంతో నది పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు భయాందోళనతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.



# నిండు కుండల్లా చెరువులు

**ఉర్కొండ ఆగస్టు 17, (జనంసాక్షి) :** మండలంలో నిన్న మొన్నటి వరకు చుక్క నీరు లేక ఎండిపోయిన చెరువులు, కుంటలు ఇప్పుడు కళకళలాడుతున్నాయి. గత వారం రోజులలో రెండుసార్లు భారీ వర్షాలు పడటంతో చెరువుల్లోకి కుంటల్లోకి నీరు వచ్చి చేరుతుంది. కొన్ని చెరువులు సగానికి పైగా నిండగా కొన్ని చిన్న చెరువులు అలుగులు పారుతున్నాయి. చెరువులు కుంటలు నిండడంతో ఖరీఫ్ పంటకు దోకా ఉండదని రైతులు ఆశా భావం సంతోషాన్ని వ్యక్తం చేశారు.చెరువులు నిండటంతో బోరు బావులు ఊటపడుతున్నాయి. ఏండి పోతాయన్న పంటలు వర్షం పడటంతో మొక్కజొన్న, పత్తి వేసిన రైతుల ముఖాలలో సంతొషం వ్యక్తం చేశారు.

## మహానందిలో తల్లిదండ్రుల నిర్లక్ష్యం

### కానిస్టేబుల్ అప్రమత్తతో చిన్నారి రక్షణ



**నంద్యాల, ఆగస్టు 17 (జనంసాక్షి):** నంద్యాల జిల్లా మహానందిలో చిన్నారికి పెను ప్రమాదం తప్పింది. ఆదివారం మహానందీశ్వరుడి దర్శనానికి వచ్చిన ఓ దంపతులు తమ చిన్నారిని కారులో వదిలేసి ఆలయ దర్శనానికి వెళ్లారు. కారులో లాక్ అయిపోయిన చిన్నారి ఊపిరాడక తీవ్ర ఇబ్బందులు పడింది. ఆలయ ప్రాంగణంలో విధులు నిర్వహిస్తున్న ఓ పోలీస్ కానిస్టేబుల్ ఈ దృశ్యాన్ని గమనించి, వెంటనే అప్రమత్తమై కారు అద్దాలను పగులగొట్టి చిన్నారిని సురక్షితంగా రక్షించాడు. కానిస్టేబుల్ యొక్క సత్వర చర్యలు చిన్నారి ప్రాణాలను కాపాడాయి. ఈ సంఘటనపై స్థానికులు, భక్తులు కానిస్టేబుల్ అప్రమత్తతను శ్లాఘించారు.



# మనసు కదిలించింది..

## నాన్న, అన్న లేని లోటు తీర్చమని కోరింది

### బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**గంభీరావుపేట ఆగస్టు 17 (జనం సాక్షి):** ఆడబిడ్డ ఆహ్వానం మనసు కదిలించిందని, నాన్న, అన్న లేని లోటు తీర్చమన్న నా చెల్లి నమ్మకాన్ని నిలబెట్టానని, ఇది నాకు ప్రత్యేకమైన ఆహ్వానమే కాకుండా మరిచిపోని అనుభూతి అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ భావోద్వేగమైన వ్యాఖ్యలు చేశారు. జిల్లాలోని గంభీరావుపేట మండలం నర్మాల గ్రామానికి చెందిన ధ్యాన బోయిన నవత తన వివాహానికి కేటీఆర్ ను ఆహ్వానించింది. తన తండ్రి నర్సింలు జీవితకాలం బీఆర్ఎస్ పార్టీ అభ్యున్నతి కోసం కృషి చేసి, కరోనా విపత్తు సమయంలో మరణించారని, అనాది కాలంలోనే ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్న తన అన్న నరేష్ రోడ్డు ప్రమాదంలో మరణించారని, చనిపోయిన నరేష్ అవయవాలు జీవన్ దాన్ కు దానం చేశామని తెలుపుతూ, ఇప్పుడు తనకంటూ ఎవరూ లేరని, ఈనెల 17న జరగబోయే వివాహానికి హాజరై తనను ఆశీర్వదిస్తే తన నాన్న, అన్నలు వచ్చినంత ధైర్యం ఉంటుందని వాట్సాప్ మెసేజ్ ద్వారా ఆహ్వానించింది. ఆదివారం కేటీఆర్ నవత వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. చెల్లెలు నవిత ఆనందంలో భాగస్వామి కావడం, ఆమెకు అండగా నిలవడం అన్నగా, ఆత్మీయుడిగా నా బాధ్యత అని భావించానని కేటీఆర్ అన్నారు. నిఖార్సయిన తెలంగాణ బిడ్డలే బీఆర్ఎస్ పార్టీకి బలం, బలగమని స్పష్టం చేశారు. ప్రజలతో ఉన్న అనుబంధం రాజకీయాలకు మించినదని ఇలాంటి సందర్భాలు నాకు ఎప్పుడూ గుర్తు చేస్తూనే ఉంటాయన్నారు. చెల్లెలు నవిత-సంజయ్ దంపతుల కొత్త జీవిత ప్రయాణం సంతోషం, ప్రేమ, ఆశీర్వాదాలతో నిండిపోవాలని హృదయపూర్వకంగా కోరుకుంటున్నారన్నారు. నవత దంపతులకు బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు.

## ప్రేమ పేరుతో కాలేజీ అమ్మాయిలను మోసం

### ప్రైవేటు వీడియోలతో బ్లాక్‌మెయిల్



**హైదరాబాద్, ఆగస్టు 17 (జనంసాక్షి):** హైదరాబాద్‌లో నిత్యం పెళ్లికొడుకుగా మారిన ఓ యువకుడి బాగోతం బయటపడింది. ప్రేమ పేరుతో కాలేజీ అమ్మాయిలను మాయమాటలతో మోసం చేసి, వారిని పెళ్లి చేసుకుని, ప్రైవేటు వీడియోలతో బ్లాక్‌మెయిల్ చేసిన ఘటన అత్తాపూర్‌లో వెలుగులోకి వచ్చింది. బాధిత యువతి పోలీసులను ఆశ్రయించడంతో ఈ విషయం బట్టబయలైంది. హైదరాబాద్ అత్తాపూర్‌కు చెందిన రఫీ అలియాస్ రవికుమార్, తన పేరును మార్చుకుని కాలేజీ అమ్మాయిలను ప్రేమ పేరుతో లోబరచుకునేవాడు. మాయమాటలతో వారిని వలలో వేసి, ముగ్గురు యువతులను పెళ్లి చేసుకున్నాడు. వారితో సన్నిహితంగా ఉండగా రహస్యంగా వీడియోలు తీసి, ఆ వీడియోలతో బ్లాక్‌మెయిల్ చేస్తూ యువతులను వేధించాడు. రఫీ బెదిరింపులు తాళలేని ఓ యువతి అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## హైదరాబాద్‌లో గణపతి మండపాల సన్నాహాలు

**హైదరాబాద్, ఆగస్టు 17 (జనంసాక్షి):** ఈ నెల 27న వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా ప్రారంభం కానున్నాయి. హైదరాబాద్ నగరం గణనాథుల విగ్రహాలతో కళకళలాడనుంది. వీధుల్లో వినాయకుడి మండపాలను ఏర్పాటు చేసి, భక్తులు శ్రద్ధాభక్తులతో లంబోదరుడికి పూజలు నిర్వహించనున్నారు. సెప్టెంబర్ 6న హుస్సేన్ సాగర్‌లో గణనాథుల విగ్రహాల నిమజ్జనం జరగనుంది. ఈ నేపథ్యంలో భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి కీలక నిర్ణయాలు తీసుకుంది. నిమజ్జనానికి విగ్రహాలను తరలించే వాహనాల ధరలను నిర్ణయించి, ఆర్టీఏ అధికారుల నుంచి ఆమోదం పొందింది. ఈ ఏడాది నగర వ్యాప్తంగా సుమారు 1.40 లక్షల గణేశ్ మండపాలు ఏర్పాటు కానున్నాయి. వీటిలో 30 నుంచి 40 శాతం విగ్రహాలను మూడు నుంచి నాలుగు రోజుల్లో నిమజ్జనం చేయనున్నారు, మిగిలిన విగ్రహాలను సెప్టెంబర్ 6న నిమజ్జనం చేస్తారు.

## అవినీతికి అడ్డాగా మారిన హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్



**ఖమ్మం, (జనంసాక్షి):** తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ధారం గురువారెడ్డి ఆదివారం ఖమ్మం పట్టణంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ క్లబ్ విధానం మొత్తం కూడా అవినీతితో నిండినదనీ, నిధుల వినియోగం పూర్తిగా అక్రమమనీ, సిఏజి మార్గదర్శకాలను తప్పుదోవ పట్టించేందేననీ ఆయన తీవ్రంగా విమర్శించారు. హకా వారి స్వంత ఆడిటర్ల ద్వారానే ఆ వివరాలు తిరస్కరించబడుతున్నా, 2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరాల ఖాతాలను హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ జనరల్ బాడీ అక్రమంగా ఆమోదించిందని వివరించారు. 2023 అక్టోబరులో నాలుగు ఎఫ్ఐఆర్ లతో పోలీస్ కేసులు నమోదు చేసినప్పటికీ, అంతకు ముందు కార్యదర్శులపై లేదా సంబంధిత సరఫరాదారులపై ఎటువంటి చర్య తీసుకోలేదని తెలిపారు. న్యాయమూర్తి ఎల్. నాగేశ్వరరావు కమిటీ చేసిన సంస్కరణలను హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ పూర్తిగా విస్మరించిందనీ, నేరాలపై ఉన్న వారిని ఇప్పటికీ హోదాలలో కొనసాగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. 2022-23 మరియు 2023-24 ఆర్థిక సంవత్సరాల హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆడిట్ నివేదికలు కాపీ చేయబడిన వేరు వేరుగా చూసించడమేనని, వీటిలో తీవ్రమైన లెక్కల లోపాలు, నిర్లక్ష్యం మరియు ప్రజా ధనాన్ని కోట్లు రూపాయల మేర కాజేసిన విధానాన్ని ప్రదర్శించారు. జట్లు పెట్టని క్లబ్‌లు, బీసీసీఐ నియమాలను తీర్చని సంస్థలు కూడా ఓటు హక్కుతో చూపబడ్డాయని అన్నారు. గత 10 సంవత్సరాలుగా జిల్లాల్లోని కొన్ని క్లబ్‌లు మౌలిక వసతుల పేరుతో అబద్ధపు నివేదికలు ఇవ్వడంతో నిధులు దుర్వినియోగమ య్యాయని చెప్పారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ద్వారా రూ.200 కోట్లకు పైగా దోచుకున్నా రని, రూ.12 కోట్లకు పైగా జిల్లాల క్రికెట్ పేరుతో దుర్వినియోగం చేసిన విషయంలో స్పష్టమైన ఆధారాలు ఉన్నాయని వివరించారు. అవినీతిలో ఉన్న వారిపై ఖమ్మం మరియు పరిసర జిల్లాల పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి అరెస్టు చేయాలని కోరుతూ, గ్రామీణ ప్రాంతాలలోని యువ క్రికెట్ టీంలు, వారి తల్లి దండ్రులు ఈ అపకర్మల నుండి కాపాడబడాలని అన్నారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ స్థాపించి 90 ఏళ్లు గడిచినా ఇప్పుడు కూడా రాష్ట్రంలో ఎక్కడా సరైన క్రికెట్ మౌలిక వసతులు కనిపించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లాలోని మంత్రులు, ఎంపీలు ఈ అవినీతి కుంభకోణంపై గట్టి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. విలేకరుల సమావేశంలో టిసిఏ ఖమ్మం జిల్లా డాక్టర్ ప్రదీప్ కుమార్ కురపాటి, కార్యదర్శి వీరేశ్ గౌడ్, వరంగల్ జోన్ కార్యదర్శి టి. జయపాల్, చిత్తరంజన్, అలీం, డా.విడి రాజీవ్, సినియర్ క్రికెటర్లు కొండా యాదవ్, వీర్ల రవి, వెంకట్, నరేశ్, నజీర్, నవీన్, కొండా శ్రీను, జోజి చకో, మహిళా క్రికెటర్లు రాధిక, అంజలి, వాణి, పద్మ తదితరులు పాల్గొన్నారు.


## గొల్లకొండ కోటపై జెండా ఎగరేసిన బహుజన బిడ్డ సర్వాయి పాపన్న

- మొగల్ చక్రవర్తుల వెన్నులో వణుకు పుట్టించిన వీరుడు
- సర్వాయి పాపన్న సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలి
- పాపన్నగౌడ్‌కు ఘన నివాళి అర్పించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

**కరీంనగర్ జిల్లా బ్యూరో, ఆగస్టు 17 (జనంసాక్షి) :**
కరీంనగర్ జిల్లా బ్యూరో, ఆగస్టు 17 (జనంసాక్షి): గొల్లకొండ కోటపై జెండా ఎగరేసిన బహుజనుల ముద్దుబిడ్డ సర్వాయి పాపన్న అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కొనియాడారు. ఆయన పోరాటాలతో మొగల్ చక్రవర్తుల వెన్నులో వణుకు పుట్టించిన వీరుడని అభివర్ణించారు. సర్దార్ పాపన్న జయంతి సందర్భంగా ఆదివారం కరీంనగర్ శివారులో బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, మాజీ మేయర్ సునీల్ రావు తదితరులతో కలిసి సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం మీడియాకు ప్రకటన విడుదల చేస్తూ, సామాన్య కల్లుగీత కుటుంబంలో జన్మించి మొగల్ చక్రవర్తుల నిరంకుశ పాలనను ఎదిరించిన అసామాన్య వీరుడు సర్వాయి పాపన్న అని, గొల్లకొండ కోటపై జెండా ఎగరేసిన మొనగాడని, బడుగు, బలహీన, పేదల పాలిట ఆపద్బాంధవుడని కీర్తించారు. సమసమాజ స్థాపన కోసం ప్రాణాలను ఫణంగా పెట్టిన ఈ వీరుడు, "అమ్మా! తాటిచెట్టు ఎక్కను, లొట్టి పట్టను, గోల్కొండ ఖిల్లాపై జెండా ఎగరేయడమే నా జీవిత ఆశయం" అని తల్లికి మాటిచ్చి, దానిని సాధించిన మహావీరుడని పేర్కొన్నారు. సర్వాయి పాపన్నకు సిద్ధాంతాలు, ప్రపంచ విప్లవాల అధ్యయనం, రాజరిక వంశ పారంపర్యం లేకపోయినా, మొగల్ చక్రవర్తుల దోపిడీ, స్థానిక జమిందారులు, జాగీర్దారులు, దేశ్‌ముఖ్‌లు, భూస్వాముల దౌర్జన్యాలను ఎదిరించేందుకు ఒక్కడిగా ప్రారంభించిన పోరాటం, సబ్బండ కులాల పీడిత ప్రజలను సమీకరించి 12 వేల సైన్యంతో గెరిల్లా యుద్ధాలు చేసి, ఖిలాషాపూర్‌ను రాజధానిగా పాలన సాగించాడని తెలిపారు. ఛత్రపతి శివాజీ మహరాజ్, సర్దార్ సర్వాయి పాపన్న సమకాలీనులేనని, ఇద్దరూ సామాన్య కుటుంబాల నుంచి వచ్చి మొగల్ చక్రవర్తులను ఎదిరించి రాజ్యాలను స్వాధీనం చేసుకున్నవారని, కానీ శివాజీకి దక్కిన చారిత్రక స్థానం పాపన్నకు దక్కకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. పీడిత ప్రజల కోసం ప్రాణాలను అర్పించిన సర్దార్ సర్వాయి పాపన్న చరిత్రను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్దార్



సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోడూరి పర్శరాములు గౌడ్, జిల్లా అధ్యక్షులు బుర్ర పర్శరాములు గౌడ్, గౌడ నాయకులు గణగోని సత్తన్న గౌడ్, పడాల రమేశ్ గౌడ్, బుర్ర కనకయ్య గౌడ్, పతంగి అనిల్ గౌడ్, మంజూ సంపత్ గౌడ్, ముంజ ప్రశాంత్ గౌడ్, బత్తిని కన్నయ్య గౌడ్, శ్రీనివాస్ గౌడ్, రమేశ్ గౌడ్, బత్తిని రాజేశ్ గౌడ్, బత్తిని శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# అందరి చూపు.. 'ఎల్లంపల్లి' వైపు..

## పర్యాటకులకు పసందు ఎల్లంపల్లి ప్రాజెక్టు

- వర్షాలు కురిస్తే పర్యాటకుల సందడే సందడి
- రెండు జిల్లాల సందర్శకులకు కనువిందు
- మత్స్యకారులకు పండగే పండగ

*ఉమ్మడి కరీంనగర్, మంచిరియాల జిల్లాల సరిహద్దులో, మాంచెస్టర్ ఆఫ్ ఇండియాగా పేరొందిన పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలంలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు, వర్షాకాలంలో జలకళతో హృదయాలను ఆకర్షిస్తోంది. గత మూడు రోజులుగా కురిసిన సమృద్ధ వర్షాలతో 62 గేట్లతో అలరారే ఈ ప్రాజెక్టు, ఆదిలాబాద్‌లోని కడెం నుంచి వచ్చే వరద నీటితో గోదావరి ఒడ్డున జలతారలా మెరిసిపోతోంది. రెండు జిల్లాల ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారవేత్తలు ఈ సౌందర్యాన్ని తిలకించేందుకు తండోపతండాలుగా తరలివస్తున్నారు. మత్స్యకారులు వలలతో చేపలు పట్టే దృశ్యం, సైరన్‌లతో అధికారులు, పోలీసులు అప్రమత్తం చేసే క్షణాలు, ఈ సహజ సౌందర్యం మధ్య మానసిక శాంతిని, ఉల్లాసాన్ని పొందే పర్యాటకుల ఆనందం అనిర్వచనీయం. ఈ ప్రాజెక్టు ప్రకృతి ప్రేమికులకు, ఒత్తిడితో నిండిన జీవితంలో ఊరట కోసం వచ్చే వారికి ప్రశాంతత నిలయంగా నిలిచింది.*

**రామగుండం ఆగస్టు 17, (జనం సాక్షి) :**
ఉమ్మడి కరీంనగర్, మంచిర్యాల జిల్లాల సరిహద్దు కావడం, మాంచెస్టర్ ఆఫ్ ఇండియాగా పేరు గాంచిన పారిశ్రామిక ప్రాంతం కావడం వల్ల, నిత్యం శ్రమికులు, వారి పిల్లలు విద్య, వృత్తి, వ్యాపార రీత్యా ప్రతి ఒక్కరూ బిజీ జీవితం గడపడం ఇక్కడ సర్వసాధారణం. అయితే, పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలంలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు వర్షాకాలం వచ్చినప్పుడు జలకళతో పర్యాటకులకు సందడే సందడి. వర్షాకాలం వచ్చినప్పుడు మానసిక ఉపశమనం కోసం రెండు జిల్లాల ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారవేత్తలు ప్రాజెక్టు జలకళను తనివితీరా కళ్లతో ఆస్వాదించేందుకు తండోపతండాలుగా తరలివస్తుంటారు. గత మూడు రోజులుగా రాష్ట్రంలో విస్తృతంగా వర్షాలు సమృద్ధిగా కురుస్తున్న నేపథ్యంలో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు సందర్శకుల తాకిడి పెరిగింది. ప్రాజెక్టుకు ఒకవైపు పెద్దపల్లి, మరోవైపు మంచిరియాల జిల్లాల నుంచి నేరుగా వచ్చేందుకు ఇరువైపులా విశాలమైన రోడ్డు మార్గం ఉండటం సందర్శకులకు అనుకూలంగా మారింది. పర్యాటకులను ఆకట్టుకునే అందమైన 62 గేట్లతో కూడిన ప్రాజెక్టు దర్శనమిస్తోంది. ప్రాజెక్టుకు ఎగువనున్న ఆదిలాబాద్ జిల్లాలోని కడెం ప్రాజెక్టు నుంచి దిగువ గోదావరిలోకి నీటిని విడుదల చేయడంతో ఎల్లంపల్లి ప్రాజెక్టుకు వరద తాకిడి ఎక్కువగా ఉండటంతో, ప్రాజెక్టుకు దిగువన మత్స్యకారులు వలలతో చేపలు పట్టడం సందర్శకులను ప్రత్యేకంగా ఆకర్షిస్తోంది. ఏది ఏమైనా, ప్రాజెక్టును తిలకించేందుకు వచ్చిన సందర్శకులకు ఇది మానసిక ఉల్లాసం, ప్రశాంతతకు నిలయంగా మారిందని చెప్పవచ్చు. ప్రాజెక్టులో వరద నీరు ఎక్కువగా వచ్చి చేరి, దిగువ గోదావరిలోకి అధికారులు నీటిని విడుదల చేసే క్రమంలో ముందస్తుగా సైరన్ మోగించి సందర్శకులను అప్రమత్తం చేస్తారు. ఇటు పెద్దపల్లి జిల్లాలోని అంతర్గాం, అటు మంచిర్యాల జిల్లా పోలీసులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, పర్యాటకులను అప్రమత్తం చేస్తూ, ఎలాంటి ప్రమాదాలకు తావివ్వకుండా జాగ్రత్తలు పాటిస్తున్నారు.



**ప్రతి ఏటా వస్తాం :**
**ఈదునూరి నిహారిక**
మేము రామగుండం సమీపంలో ఉంటాము. వర్షాకాలంలోప్రాజెక్టు నిండిందని తెలియగానే పిల్లలను తీసుకొని కుటుంబ సభ్యులతో కలిసి ప్రతి ఏటా వస్తుంటాం. మా ఊరికి దగ్గరలో ప్రాజెక్టు ఉండటం అదృష్టంగా బావిస్తాం.

**నేను ఎప్పుడు ప్రాజెక్టు చూడలేదు**
**ములుకల్ల అశ్విత**



మాది మంచరియాల నేను మూడవ తరగతి చదువుకుంటాను. ఎల్లంపల్లి ప్రాజెక్టు నేను ఇప్పటివరకు చూడలేదు. మా నాన్న మొదటి సారి తీసుకు వచ్చాడు. చాలా బాగుంది. ఇక్కడ ఇంత మంది ఉంటారని. ఇన్నీ నీళ్లు ఉంటాయని తెలియదు. చాలా బాగుంది

**నేను రోజు చాపలు పడుతా ఇక్కడ**
**బోరె రాజయ్య.. ఎల్లంపల్లి మత్స్యకారుడు**



మాది ఎల్లంపల్లి ఊరు. నేను రోజు ప్రాజెక్టులో చాపలు పడుత కుటుంబాన్ని పోషించుకుంటా. వర్షాకాలం వచ్చిందంటే. ప్రాజెక్టు లో నిండిన నీళ్లను చూడటానికి చాలామంది చిన్న. పెద్ద తేడా లేకుండా వస్తారు. సందడిగా ఉండుడే గాక. అందరు ఫోటోలు తీసుకుంటారు

# యూరియా కోసం ఇక్కట్లు



## కలెక్టర్ వచ్చి వారం రోజులైనా

## అందని ద్రాక్షగా యూరియా

- యూరియా ఎప్పుడు వస్తుందో స్పందించిన అధికారులు
- గత నెల రోజుల నుండి రైతులు ఆవేదన




**కథలాపూర్,ఆగస్టు 17, (జనం సాక్షి) :** కథలాపూర్ మండలంలోని రైతుల అరిగోష నెల రోజుల నుండి యూరియా కోసం సొసైటీలో పడి కాపులు కాస్తున్న రావడం లేదంటున్న రైతులు వారం రోజుల క్రితం కలెక్టర్ సత్యప్రసాద్ భూషణరావుపేట సొసైటీ నీ సందర్శించి రైతులకు ధైర్యం చెప్పి యూరియా వస్తుంది రైతుకు రెండు చొప్పున బ్యాగులు ఇవ్వాలని సూచనలు చెప్పి వెళ్లిన ఇప్పటికి యూరియా రాకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మళ్లీ వెనుకటి రోజులు వచ్చాయన్న రైతులు కథలాపూర్ మండల కేంద్రంలో మండల రైతులు రాస్తారోకో నిర్వహించిన కలెక్టర్ కు జిల్లా నాయకులు ఇచ్చిన రైతుల బాధలు తప్పడం లేదని రైతులు ఆవేద వ్యక్తం చేశారు మళ్లీ పెద్ద ఎత్తున జిల్లా వ్యాప్తంగా రైతులు ధర్నాలు చేసి ప్రభుత్వానికి బుద్ధి చెప్తాముంటున్న రైతులు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370